
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ | సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య

సంపుటి 17 - సంచిక 06
**నవంబర్ 2012**
**విడిప్రతి రూ॥ 12.00**
**సం॥ చందా రూ॥ 120**
**3 సం॥ చందా రూ॥ 350**
**10 సం॥ చందా రూ॥ 1116**

పత్రిక చందా మనీ ఆర్డర్ ద్వారా కాని, డ్రాఫ్టు ద్వారా కాని పంపవలసిన చిరునామా
**“శ్రీ వేదమాత గాయత్రి ట్రస్టు”**
**గాయత్రీ చేతనా కేంద్రము**
హెచ్.పి. రోడ్, మూసాపేట,
అశ్విని హౌస్ దగ్గర,
హైదరాబాదు - 500 018.


## మనకు ఏది లభించినా అది మన కర్మఫలమే

శ్లో॥ నమశ్యామో దేవాన్నను హత విధేస్తే పి వసగాః
విధిర్వన్ద్యాః సోపి ప్రతినియత్ కర్మైక ఫలదః ।
ఫలం కర్మాయతం కిమమరగణేం కించ విధినా
నమస్త త్కర్మేభ్యో విధిరపి న ఏభ్యః ప్రభవతి ॥ **- భర్తృహరి నీతి శతకం 95వ శ్లో॥**

మనమందరం మన కోర్కెలు తీరుట కొరకు ఏ దేవశక్తుల అర్చనలు, ఆరాధనల విధి విధానాలు తెలుసుకొనుటకు ఉత్సాహం చూపుతామో, ఆ దైవీశక్తులన్నీ కూడా విధి-వ్యవస్థకు బందీలు. దైవీ విధానాలను అవి ఉల్లంఘించజాలవు. అటువంటప్పుడు సృష్టి సంచాలనం చేసే దైవీశక్తులకు, వాటి విధాతకు మనం నమస్కారాలు ఎందుకు చేయాలి? మన తలరాతని నిర్ధారించే విధి వ్యవస్థ అంతా మన కర్మానుసారం జరిగిపోతూనే ఉంటుంది! ఇది దాని సునిశ్చిత నిర్ణయం. కర్మఫలాన్ని మనకు అందించే ప్రక్రియను మాత్రమే అది నడిపిస్తూ ఉంటుంది.

ఈ ప్రకారం మనం అనుభవించే భోగాలు, ఉపలబ్ధులు, ప్రవృత్తులన్నీ మనం చేసుకున్న కర్మ ఫలితాలే! అటువంటప్పుడు దైవీశక్తులను, వాటి విధాతను ప్రసన్నం చేసుకోవాలనే ఆలోచన చేయుట ఎంతవరకు తెలివైనపని? మనకు లభించే సాధ్యాసాధ్యాలకు కర్మే కారణము. దానికి మాత్రమే మనం వందనాలు అభివందనాలు అర్పించవలసి ఉంటుంది. అలాంటి కర్మనే మనం వరించాలి, దానినే ఆచరించాలి. దైవీ ప్రవృత్తులు దానికి విరుద్ధంగా ఏమి చేయజాలవు. కర్మే అన్నింటికి మూలం! మన పరిస్థితులకుగాని, మనోపరిస్థితులకుగాని మనం చేసుకున్న కర్మ మాత్రమే నిర్మాత! దాని సాధన ద్వారా మాత్రమే మన కోర్కెలు తీరుటకు, ఉపలబ్ధులు ప్రాప్తించుటకు అవకాశం ఉంటుంది.


పత్రిక అందనివారు మరియు పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
**ఫోన్ : 040-23700722, 9949111175, 9440769798**


**తల్లిదండ్రులను, గురువులను, పెద్దలను గౌరవించాలి**

## విషయ సూచిక


1. **సంపాదకీయం :**
మనకు ఏది లభించినా అది మన కర్మఫలమే 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :**
మంచి మిత్రుని ఎంచుకోండి 2
3. **వేదమంత్రం :** నిజమైన బ్రాహ్మణుడు కావాలి 3
4. **గాయత్రీ విద్య - 26 :** తన్మాత్రలు 4
5. **గాయత్రీ చిత్రావళి - 5 :** పరమపోషక వైష్ణవి 6
6. **బాలల భవితకు బంగారుబాట-31 :** అనవసర ఖర్చు 7
7. **ధారావాహిక ప్రశ్నోపనిషద్ - ఆరవ అధ్యాయం (మొదటి ప్రకరణం):** సత్సాహస-సంఘర్షణ ప్రకరణం 8
8. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 5 :**
అపురూపం ఆ మాతృత్వ అనుభూతి 9
9. **మస్తిష్కమే కల్పవృక్షం - 2** 13
10. **సూర్యసాధనా సంవత్సర ప్రత్యేకం :**
సూర్యుని క్షమత 16
11. **మనం - మన ఆరోగ్యం :**
మంచిగా ఆలోచిస్తే రోగాలే రావు 19
12. **పరిణామక్రమం :** పునర్జన్మ 21
13. **యువతకు ప్రత్యేకం :** ఐశ్వర్యం - 7 24
14. **ఆదిశక్తి యొక్క లీలా కథలు - 29 :**
బయట, లోపల ఉన్న శత్రువులను గుర్తించండి 26
15. **యోగికి అన్నీ సంభవమే** 29
16. **ఎంత సుందరమైనది ఈ సృష్టి** 31
17. **అందమే ఆనందం :**
హానికరమైన సౌందర్య సాధనములు 34
18. **పూజ్య గురుదేవుల అమృతవాణి :** విగ్రహారాధన యందు దాగి ఉన్న సంకేతాలు, శిక్షణలు-2 37
19. **నా వారితో నా మాట :**
సృజన సైనికుల కనీస కర్తవ్యము 42
20. **ఆరోగ్యమే మహాభాగ్యం-24 :** హోమియో వైద్య సేవ 45
21. **సుమతి సూక్తం - 2** 46
22. **వార్తలు :** రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు 48




## సద్గురు వచనామృతం

### మంచి మిత్రుని ఎంచుకోండి

మంచి మిత్రులను, మంచి పొరుగువారిని ఎంపిక చేయటం చాలా కష్టం. తమ పని చేయించు కోవాలనే స్వార్థభావనతో చాలామంది వ్యక్తులు మీతో మైత్రికి ఉత్సాహపడతారు. కాని తమ పని పూర్తికాగానే కనుమరుగవుతారు. కనుక వ్యక్తి శీలం, అలవాట్లు, స్నేహం, విద్య మొదలైన వాటిని పరీక్షించి, చాలా జాగ్రత్తగా మిత్రులను ఎంపిక చేయాలి. మీ మిత్రులు ఉదారులుగా, తెలివికలవారుగా, పురుషార్థులుగా, సత్యపరాయణులుగా ఉండాలి. విశ్వాసపాత్రుడైన మిత్రుడు జీవితానికి ఒక ఔషధంలాంటివాడు. మన ఉత్తమ సంకల్పాలను సమర్థించేవారుగా, దోషాల నుంచి, పొరపాట్ల నుంచి మనలను రక్షించేవారుగా, మన సత్యతను, పవిత్రతను, మర్యాదను పెంచేవారిగా ఉండాలి. మనం చెడు మార్గంలో అడుగు పెడితే, వారు మనలను హెచ్చరించాలి. నిజమైన మిత్రుడు మార్గ దర్శకుడుగా, విశ్వాసపాత్రుడుగా నిజమైన సానుభూతి కలిగిన వాడుగా ఉంటాడు.

దృఢచిత్తం, సత్య సంకల్పం కలిగిన వారి ద్వారానే ఈ కర్తవ్యం పూర్తవుతుంది. సుగ్రీవుడు రాముడిని ఆశ్రయించినట్లు ఆత్మబలం కలిగిన మిత్రులను మనం ఆశ్రయించాలి.

మిత్రుడు గౌరవనీయుడు, మంచి హృదయం గలవాడు, మృదువైన మరియు పురుషార్థి అయి ఉండాలి. అప్పుడు మనం అతడి నీడలో ఉండగలుగుతాం, ఎలాంటి మోసము జరగదని నమ్మగలుగుతాం. మైత్రి ఒక నూతన శక్తికి మార్గము.

*- అఖండజ్యోతి, జనవరి, 1951*

*అనువాదం: సత్యనారాయణ గుప్తా*

### పండుగలు

| | |
|---|---|
| **నవంబర్ 2012** | |
| 13-11-2012 | దీపావళి |
| 17-11-2012 | నాగుల చవితి |
| 28-11-2012 | కార్తీక పౌర్ణమి |
| **డిశంబర్ 2012** | |
| 23-12-2012 | గీతా జయంతి<br>ముక్కోటి ఏకాదశి |
| 25-12-2012 | క్రిస్మస్ |
| 27-12-2012 | దత్తాత్రేయ జయంతి |

**ప్రతిభను అలవరచుకోవాలి**

వేద మంత్రం

# నిజమైన బ్రాహ్మణుడు కావాలి

**శచీభిర్నః శచీవసూ దివా నక్తం దశస్యతమ్ ।**
**మా వాం రాతిరూప దసత్కదా చనాస్మద్రాతిః కదా చన ॥**
**(ఋగ్వేద 1/139/5)**

**భావార్థం :** ఈ ప్రపంచములో అధ్యాపకులు, ఉపదేశకులు ఎల్లప్పుడు మంచి నేర్పుగల వాక్కుతో ప్రజలకు సదాచారముల శిక్షణ ఇవ్వాలి. దానివలన వారు సద్గుణవంతులు అవ్వాలి.

**సందేశం :** బ్రాహ్మణుడు భగవంతుని ప్రతినిధి అని చెప్పబడింది. బ్రాహ్మణుడు దేశంలోని పౌరులను జ్ఞానవంతులు, శక్తివంతులు, శీలవంతులు, తేజోవంతులుగా చేస్తాడు. ఎక్కడైనా అజ్ఞానం, చెడు సాంప్రదాయాలు, దురాలోచనలు, దుష్టసంస్కారాల ప్రకోపం కన్పిస్తే, వాటిని నిర్మూలించటానికి ప్రాణం ఒడ్డి పోరాడుతాడు. నిస్వార్థ భావముతో సమాజ వికాసమే తన జీవిత ధ్యేయంగా శ్రమిస్తాడు.

అధ్యాపకులు, ఉపదేశకులు, పరివ్రాజకులు మొదలైనవారు బ్రాహ్మణత్వము యొక్క ఉత్తమశ్రేణికి చెంది ఉండేవారు. ఉపాసన, సాధన వలన ప్రాప్తించిన జ్ఞానాన్ని వ్యక్తివ్యక్తికి పంచి ఆనందించే వారు. పరమాత్మ చేత తయారు చేయబడిన ఈ ప్రపంచంలోని ప్రతిప్రాణి ఔన్నత్యం కొరకు, ఈశ్వరీయ ఆదేశముగా భావించి, తనువు, మనస్సు, ధనములతో నిమగ్నమయ్యేవారు. రాజు-పేద, చిన్న-పెద్ద, అందరు వారిని గౌరవించేవారు. దేశకీర్తి పతాకం ఎత్తుగా ఎగురుతూ ఉండేది.

కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. చాలామంది అధ్యాపకులు తమ బాధ్యతల పట్ల కొంచెం కూడా శ్రద్ధ ఉంచుట లేదు. వాస్తవిక జ్ఞానము ఇవ్వకపోగా విద్యార్థులను రకరకాల చెడ్డ సంస్కారాల వైపు మళ్ళిస్తూ ఉన్నారు. ఉపదేశకులు, పరివ్రాజకులు, ధర్మాచారులు, మఠాధీశులలో కొంతమంది అమాయకులైన ప్రజలను తప్పిత్రోవ పట్టిస్తున్నారు. రకరకాల నకిలీ భగవానులు, బాబాలు ధర్మం ముసుగులో తమ పబ్బం గడుపుకుంటున్నారు. వీటన్నింటి ఫలితంగా నేడు దేశంలోని అధిక సంఖ్యాకులు స్వార్థపరులుగా, దగాకోరులుగా, మోసగాళ్ళుగా కనపడుతున్నారు. వారిలో సంవేదన చచ్చిపోయింది, ఉదారత నశించింది. వారి జీవితం పశువుల కన్నా హీనమయింది, దేవతలు అవటం అలా ఉంచి, మానవుల కన్నా హీనంగా దానవులయ్యారు, అసురలయ్యారు, రాక్షసులయ్యారు.

ఇందుకేనా పరమాత్మ మనుష్యునికి ఇంత సర్వగుణ సంపన్నమైన శరీరాన్ని, బుద్ధిని ఇచ్చింది? అతడు ఇతరులను చెడు త్రోవ పట్టించి పతన మార్గంలో తీసుకువెళ్ళటానికా? కాదు! వేదాలు మానవజాతిని సూర్యునితో సమానంగా, సవితతో సమానంగా జీవించమని ఆదేశించాయి. సూర్యోదయంతో ఎలాగైతే సూర్యుడు పైకి లేస్తాడో అలాగే మనుష్యుడు ఎల్లప్పుడు ఉన్నతివైపు పయనించాలి. సూర్యుడు ఎల్లవేళల ప్రపంచానికి ప్రకాశం ఇస్తాడు, శక్తినిస్తాడు. అలాగే ఇతరులకు జ్ఞాన ప్రకాశం ఇచ్చి, సత్ప్రేరణ, సత్పరామర్శల ద్వారా వారి మార్గాన్ని బాగు చేయాలి, జీవనశక్తిని ఇవ్వాలి, వారికి పురుషార్థము, సమయపాలన నేర్పించాలి. సూర్యుడు ప్రపంచంలోని మురికిని తన తాపముచేత నశింప చేసినట్లు దోషములు, దుర్గుణములు దూరం చేసి సద్గుణాలను పెంపొందించే ప్రయత్నం చేయాలి. సామాన్యులకు వేదం యొక్క ఆదేశం ఇదే. సర్వశక్తివంతుడైన పరమేశ్వరుడు అతని నుండి అపేక్షించేది ఇదే.

విద్వాంసుల నుండి బ్రాహ్మణుల నుండి భగవంతుడు మరింత ఆశిస్తున్నాడు. ప్రతి జ్ఞానవంతుడైన వ్యక్తి వేదం యొక్క నిర్దేశాన్ని హృదయంగమం చేసుకొని నిజమైన బ్రాహ్మణుడు కావాలి.

★★★

## అస్పృశ్యతా నివారణ

*అస్పృశ్యతా నివారణార్థం గాంధీజీ దేశమంతటా తిరుగుతూ ఒరిస్సాలోని ఒక గ్రామంలో బస చేశారు. ఒక పండితుల సమూహం వీరి వద్దకు వచ్చి శాస్త్రార్థాలను తెలుపమంటూ కోరారు. శాస్త్రాలు అస్పృశ్యతను సమర్థిస్తున్నాయని వాదించారు. బాపూజీ పండితులను సగౌరవంగా కూర్చుండబెట్టి అయ్యలారా! నేను శాస్త్రాలను చదవలేదు. కాబట్టి మీముందు ఓటమిని ఆనందంగా అంగీకరిస్తున్నాను. కానీ విశ్వంలోని సమస్త శాస్త్రాలు ఏకమైనను మానవీయ ఐక్యతను కాదనలేవు, అబద్ధమని నిరూపించ లేవు. కాబట్టి ఇదే నా ధర్మం. నా ఈ ధర్మం పట్ల, ధార్మిక సిద్ధాంతాల పట్ల జీవితాంతం స్థిరంగా ఉంటానని పలికారు. వీరి అచంచల విశ్వాసానికి పండిత మండలి నిశ్చేష్టులై వెనుకకు తిరిగివెళ్ళారు.*

*- ప్రజ్ఞాపురాణం నుండి*

ప్రతిభను ప్రోత్సహించాలి



## గాయత్రీ విద్య-26

# తన్మాత్రలు

మన శరీరములోని సమస్త అవయవములు పంచతత్వములచే తయారుచేయబడ్డాయి. పృథ్వి, జలం, వాయు, అగ్ని, ఆకాశం తత్వముల పరిణామములలో (నిష్పత్తి) తేడా వలన వివిధ రకములైన, గుణధర్మములు కలిగిన వస్తువులు తయారవుతాయి.

ఈ పంచతత్వముల సూక్ష్మశక్తి అనుభూతినే తన్మాత్రలని అంటారు. శరీరములో పంచ జ్ఞానేంద్రియులు ఉన్నాయి. ఇవి పంచతత్వములను ఏ విధంగా అనుభూతి చెందుతాయో వాటిని తన్మాత్రలు అని అంటారు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంథములు – ఇవే పంచ తన్మాత్రలు.

ఆకాశము యొక్క తన్మాత్ర శబ్దము. ఇది చెవి ద్వారా అనుభవంలోనికి వస్తుంది. చెవి ఆకాశతత్వం ప్రధానంగా కలిగిన ఇంద్రియము. అగ్నితత్వం యొక్క తన్మాత్ర రూపము. ఇది అగ్నితత్వం ప్రధానంగా కలిగిన నేత్రము ద్వారా అనుభవంలోనికి వస్తుంది. రూపమును కన్నులు మాత్రమే చూడగలవు. జలతత్వం యొక్క తన్మాత్ర రసము. ఇది రసతత్వ రసప్రధానమైన జిహ్వా (నాలుక) ద్వారా అనుభవంలోనికి వస్తుంది. షడ్రచులు అయిన చేదు, తీపి, పులుపు, వగరు, ఉప్పు, కారంల రుచిని నాలుక గుర్తుపడుతుంది. పృథ్వి తన్మాత్ర అయిన గంథమును పృథ్వి గుణ ప్రధానమైన నాశిక గ్రహిస్తుంది. ఈ విధంగానే వాయువు యొక్క తన్మాత్ర స్పర్శ. స్పర్శ యొక్క జ్ఞానమును చర్మము గ్రహిస్తుంది. చర్మములో వ్యాపించి ఉన్న జ్ఞాన తంతువుల ద్వారా ఇతర వస్తువుల వేడి, బరువు, గట్టిదనమును స్పర్శ ద్వారా అనుభవంలోకి వస్తుంది.

ఇంద్రియముల యందు తన్మాత్రలను అనుభవించు శక్తిలేనిచో ప్రపంచానికి, శరీరానికి మధ్యగల సంబంధం తెగిపోతుంది. జీవి ప్రపంచంలో జీవనయానం సాగించవచ్చు కానీ ఎటువంటి ఆనందం ఉండదు. ప్రపంచంలోని వివిధ పదార్థాలు చాలా ఆకర్షణీయంగా ఉంటాయి, దానికి కారణం వాటి తన్మాత్ర శక్తియే. మనం ప్రపంచంలోని పదార్థముల యొక్క రూపమును చూడలేక పోయినట్లయితే ఎలా ఉంటుందో ఊహించుకోండి. అప్పుడు సర్వత్ర మౌనం, ఏమిలేని పరిస్థితి. రుచి చూడలేకపోయినట్లయితే ఏమి తెలియదు. చల్లని ఆహ్లాదకరమైన వాతావరణం తెలియదు, మెత్తటి పరుపు ఉపయోగం ఉండదు.

పరమాత్మ పంచతత్వములలో పంచ తన్మాత్రలు ఉత్పన్నం చేసి, వాటిని అనుభవించటానికి శరీరములో పంచ జ్ఞానేంద్రియములు తయారుచేసి ప్రపంచంలో మన చుట్టుప్రక్కల గొప్ప ఆకర్షణతో కట్టివేశాడు. పంచతత్వములు కేవలం స్థూలమైనవి అయినట్లయితే, వాటిలో తన్మాత్రలు ఉండవు. అప్పుడు ప్రపంచంలోని ఏ పదార్థములో ఆనందం లభించదు. సమస్తం నీరసంగా, నిరర్థకంగా, ఎందుకు పనికిరానివిగా కనిపిస్తాయి. తత్వములలో తన్మాత్రలు లేకపోతే, శరీరంలో జ్ఞానేంద్రియములు లేకపోతే మానవజీవనం ఎటువంటి రసానుభూతి కలుగక నీరసంగా తయారవుతుంది. ఇంద్రియముల సంవేదనాశక్తి (feeling) తత్వముల తన్మాత్రలు కలసి ప్రాణికి అనేక శారీరిక మానసిక రసానుభూతి కలుగచేస్తాయి. దీనికొరకే జీవి జీవితాన్ని పొందుతాడు. అతనికి ఈ ప్రపంచాన్ని వదలిపెట్టాలని పించదు. అతని **ఈ కోరికయే జననమరణ చక్రములను భవబంధనములుగా కట్టిపడేస్తుంది.**

ఆత్మవైపు చూడక, ఆత్మకళ్యాణం గురించి ఆలోచించక ప్రపంచంలోని వస్తువులను సంగ్రహించుటలో, వాటిని స్వంతం చేసుకొనుటలో, వాటి ద్వారా పొందే రసానుభూతిలో మనిషి మునిగిపోతుంటాడు. రంగురంగుల బొమ్మలతో పిల్లలు తన్మయత్వంతో ఎలా ఆడుకుంటారో, అన్నం, నీళ్ళు కూడా మరచి ఎలా ఆడుకుంటారో అదేవిధంగా తన్మాత్రలనే బొమ్మలు మనస్సుపై చాలా మనోహరంగా తిష్ఠవేస్తాయి. వాటిని వదలబుద్ధి వెయ్యదు. ఎన్ని కష్టాలు అనుభవిస్తున్నా మనిషి చావడానికి సిద్ధపడడు. మరణమంటే వణుకు పుడుతుంది. ఎన్ని కష్టములు, లోటుపాట్లు ఉన్న ప్రపంచంలో పదార్థములలోని తన్మాత్రల మోహం, ఆకర్షణల వల్ల ప్రపంచాన్ని వదలబుద్ధివెయ్యదు. కష్టములను భరిస్తున్నా కూడా వాటిని వదలటానికి సిద్ధపడడు.

పంచ జ్ఞానేంద్రియములనే గుంజకు పంచ తన్మాత్రలనే త్రాటితో జీవుడు కట్టివేయబడ్డాడు. ఈ త్రాడు రంగురంగుల, మెరుస్తున్న అందమైన జలతారు. చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. ఆ గుంజ వెండి బంగారములతో తయారుచేయబడి దానిపై వ్రజ వైఢూర్యాలు పొదగబడ్డాయి. జీవరూపుడైన గుర్రం ఇటువంటి త్రాళ్ళతో కట్టబడింది. వాడు బంధించబడి ఉన్నాననే

**పర్యావరణమును రక్షించుకోవాలి**

దుఃఖాన్ని మరచి ఈ గుంజ, త్రాడుల అందాన్ని చూచి ఈ బంధనం నుంచి ముక్తి పొందుదామనే ఇచ్ఛ కూడా వదలివేస్తాడు. వాడికి ఈ బంధనం కూడా బాగుందని అనిపిస్తుంది. బ్రతుకుబండి లాగుతూ, కొరడా దెబ్బలు తినడం కూడా అందమైన త్రాడు, గుంజలతో పోలిస్తే ఫరవాలేదనిపిస్తుంది. ఈ బాలబుద్ధిని, దూరదృష్టి లేకపోవడం, వాస్తవికతను అర్థం చేసుకోలేకపోవడాన్ని శాస్త్రములలో అవిద్య, మాయ, భ్రాంతి మొదలైనవిగా చెప్పారు. ఈ తప్పుల నుండి రక్షించుకోవడానికి అనేక రకములైన ధార్మిక కథలు, గాథలు, ఉపాసనలు, సాధనల విధానాలు ఇవ్వబడ్డాయి.

ఇంద్రియముల తన్మాత్రల కలయిక వల్ల దురద (కోరిక) కలుగుతుంది. ఈ దురదను గోక్కవడం కొరకు మనిషి రకరకాల ఆలోచనలు, పనులు చేస్తుంటాడు. రాత్రింబవళ్ళు ఈ కోరికలు తీర్చుకోవడంలో నిమగ్నమవుతాడు. మనస్సును వశం చేసుకోవడంలో దానిని ఏకాగ్రంగా (concentrate) చేసేందుకు పెద్ద అడ్డు ఈ దురదే (కోరిక). ఇది చిత్తాన్ని ఇంకొక ప్రక్కకు పోనివ్వదు. దురద పుడుతున్నప్పుడు గొక్కుంటే కలిగే ఆనందం ముందు అన్నీ తక్కువే. అందువల్ల సాధనపై ఏకాగ్రత మనస్సు నిలువదు.

తన్మాత్రల రసానుభూతి గుర్రాన్ని కట్టివేసే త్రాడు లేక కోరిక వంటిది. ఇది లేశమైనది, చిన్నది, మహత్వం లేనిది. ఈ భావన అంతఃభూమిలో (అంతఃకరణ) నాటేందుకు, మనోమయ కోశ సువ్యవస్థ కొరకు, తన్మాత్రల సాధనా అభ్యాసం కొరకు చెప్పబడింది. తన్మాత్రలు అనాత్మ వస్తువులను ఈ సాధనల ద్వారా అనుభూతి చెందుతాయి. ఇది జడ పంచతత్వముల సూక్ష్మ ప్రక్రియ మాత్రమే. ఇది మనోమయకోశంలో దురదలాగా అంటుకుని ఒక నిరర్థకమైన ఝుంజాటంలో పడవేస్తుంది, సాధించ వలసిన లక్ష్యాన్ని దూరం చేస్తుంది. అందువలన దీని వాస్తవికత, వ్యర్థమైనవిగా, తుచ్ఛమైనదిగా అర్థం చేసుకోవాలి.

పంచతత్వముల చిన్న చిన్న తేలికైన సాధనలు చెప్పబడ్డాయి. వీటిని సాధన చెయ్యడం వలన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధముల జీవనం గడపడానికి యంత్ర భాగములలో నూనె వెయ్యడం ఎంత అవసరమో ఇది అంత అవసరమని తెలుస్తుంది.

ఇంకొక విషయం ఏమిటంటే మనస్సు కూడా ఒక ఇంద్రియమే. దీని అనుబంధం ఎల్లప్పుడు తన్మాత్రల వైపే ఉంటుంది. ఇదే రసానుభూతి. దానిని సాధనాత్మక రసానుభూతితో నింపినట్లయితే అతి సూక్ష్మశక్తుల జాగరణ జరిగి అనేక రకముల మానసిక లాభములు కలుగుతాయి. పంచ తన్మాత్రల సాధనలు వచ్చే సంచికలో.

★★★

## బుద్ధుడు

*వాస్తవానికి ఆనాడు బుద్ధునికి వ్యక్తిగత సమస్యలంటు ఏమీ లేవు. ఆ రోజులలో యజ్ఞం ప్రేరిట జరుగుతున్న హింస, సాధన పేరిట చేసే మద్యం, మాంసం, మైథునం వంటి దుష్కృత్యాలను చూచి హృదయం తల్లడిల్లగా ఇవన్నీ ఎందుకోసం జరుగుతున్నట్లు అని వారిని ప్రశ్నించాడు. ఈ జరిగేదంతా ధర్మం యొక్క శాశ్వత స్వరూపమని, ఈశ్వర నిర్మితాలైన వేదాల యొక్క ఆదేశమని వారు బదులు పలికారు. అయితే నేను అటువంటి ధర్మాన్ని, వేదాలను, ఈశ్వరుని కూడా నేను విశ్వసించనని బుద్ధుడు నిర్మొహమాటంగా ప్రకటించాడు. ఒకవైపు ఒంటరి అయిన బుద్ధుడు రెండవ వైపు ఆవేశం, అంధ విశ్వాసాలతో కరుడుగట్టిన జనసముదాయం. ఈ జనసముదాయాన్ని మార్చాలంటే శస్త్రాలు, అస్త్రాలు కాక తపోశక్తే అనివార్యమని బుద్ధుడు గుర్తించాడు. ఆత్మశోధన అనే తపస్సును ఆరంభించాడు. ఒక వటవృక్షం క్రింద ఈయనకు ఆత్మ సాక్షాత్కారం లభించింది. ఆ వటవృక్షమే బోధివృక్షం. అదే బుద్ధుని యొక్క గురువు. ఆ తర్వాత ప్రజలతో సంపర్కం పెట్టుకొని వారి మనస్సులను మార్చాలనే నిశ్చయానికి వచ్చాడు. దీనికై ఈయన తన భక్తజనులకు శిక్షణనిచ్చి పరివ్రాజకులుగా పంపారు. సత్ప్రయోజనాలకు సాధనాల కొరత ఎన్నడూ రాదు. బుద్ధుని విషయంలో కూడా ఇదే జరిగింది. అనేకమంది ప్రాయశ్చిత్తం చేసుకొన్నారు. పుణ్యఫలాన్ని సమృద్ధిగా ఆర్జించుకొన్నారు. కేవలం భారతదేశంలోనే కాక ఆసియా మొత్తం మీద అనాచార పరిస్థితులకు కాయకల్ప చికిత్స చేశారు. బుద్ధుడు చమత్కారవాదానికి విరుద్ధం. సదాచారం, వివేకం, సంఘటితశక్తి వీరి అనుయాయుల ప్రయత్నాలకు ఆధారభూతమైనవి. వీరి సంపర్కంలోనికి వచ్చిన వారంతా పై సిద్ధాంతాలను నేర్చుకొని తరించేవారు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**వ్యక్తిగత విలువలను పెంపొందించుకోవాలి**

గాయత్రీ చిత్రావళి - 5

# పరమపోషక వైష్ణవి



ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్

పరమాత్మ యొక్క రజోగుణరూపము విష్ణువు. విష్ణువు యొక్క శక్తిని వైష్ణవి అంటారు. విష్ణువు వాహనము గరుడుడు. వైష్ణవి కూడా గరుడాసీనురాలే. గరుడుడు రజోగుణ ప్రతినిధి. వైష్ణవి ఈ రజోగుణముచే ప్రాణులకు జీవ రసమును త్రాగించి వాటిని పరిపుష్టం చేస్తుంది.

తల్లి తన కుమారుని కోసం సర్వస్వం అర్పిస్తుంది. ఆమె ఒడిలోకి చేరి అతడు అన్ని విధాలుగా నిశ్చింతగా, నిర్భయంగా ఉంటాడు. తల్లి ప్రియాతిప్రియమైన వస్తువును బిడ్డకు ఇచ్చుటకు సంకోచించదు. బాలకుడు అన్ని విధాలుగా తనను తల్లికి అర్పించుకున్నప్పుడే ఇది సాధ్యం అవుతుంది. ఎప్పటివరకు పూర్తిగా తల్లిపైనే ఆధారపడి ఉంటాడో అప్పటి వరకు ఒక క్షణం కూడా ఆమె అతనిని మరువదు.

ఏయే విధంగా బాలుడు తన స్వార్థాన్ని పెంచుకుంటూ పోతాడో, ఆయా విధంగా తల్లి యొక్క ఉపేక్షకు గురి అవుతాడు. ఆ బాలుడు పెద్దవాడైన తర్వాత తల్లి స్నేహము, వాత్సల్యాలను మరచిపోతాడు. అతని మనసులో కృతజ్ఞత, శ్రద్ధ ఏ మాత్రము ఉండవు. నిజమైన భక్తితో అతడు తల్లి చరణాల ముందు తలవంచడు, ఏదైనా అవసరమైనప్పుడు మాయ మాటలతో వలవిసురుతాడు. అనేకమంది సాధకులు ఇలాగే చేస్తుంటారు. వారిలో ఆదిశక్తి జగజ్జనని పట్ల స్వాభావిక శ్రద్ధ, భక్తి పిసరంత కూడా ఉండవు. ఏదైనా పని తిరగబడితే ఆమె సహాయం కోసం రకరకాల దండప్రమాణాలు చేస్తారు. మాత అణువణువునా వసించి ఉన్నది. నిజమైన విశ్వాసపరుల మోసకారుల మధ్య, నిస్వార్థపరులు, ఉత్తుత్తి పొగడ్తలు చేసే వారికి మధ్యగల తేడా ఆమెకు బాగా తెలుసు. అవకాశ వాదులకు ఎప్పుడైనా ఒక ముక్క విసరి వేయవచ్చు. అప్పుడప్పుడు చీదరించుకోవచ్చు. ఏది ఏమైనా అటువంటి వారిపట్ల ఆమె మనసులో నిజమైన మమత ఎప్పటికి ఉత్పన్నం కాదు.

నిజమైన భక్తుడు తల్లి నుండి వస్తువులు కోరడు, ఆమె ప్రేమను కోరతాడు. తన సర్వస్వము తల్లికి సమర్పించి, ఆమె ఒడిలో అప్పుడే పుట్టిన శిశువువలె నిశ్చింతగా విశ్రమిస్తాడు. అటువంటి భక్తుడు నిశ్చయంగా తాను అనంత శాంతి ఒడిలో ఉన్నట్లు భావిస్తాడు. అతనికి తల్లి యొక్క నిజమైన ప్రేమ, సంరక్షణ ప్రాప్తిస్తాయి. సర్వశక్తివంతురాలైన తల్లి ఒడిలో కిలకిలా నవ్వుతూ ఉంటాడు. ఏ లోటు, కష్టము అతనిని పీడించలేవు.

*- అనువాదం : డా॥ తుమ్మూరి*

**నాయకత్వ లక్షణాలను అలవరచుకోవాలి**



## బాలల భవితకు బంగారు బాట-31

# అనవసర ఖర్చు

రంగన్న రిక్షా నడుపుతూ జీవితం కొనసాగిస్తున్నాడు. అతనికి ఒక్కగానొక్క కొడుకు గోపి. ఒక్కడే కొడుకు కావడంతో రంగన్న దంపతులు కుమారుణ్ణి అల్లారుముద్దుగా పెంచు కుంటున్నారు. గోపి తల్లి కూడా నాలుగు ఇళ్ళల్లో పాచిపనిచేసి డబ్బు సంపాదించేది, ఇద్దరు కష్టపడి సంపాదిస్తూ కొడుకును చదివించుకుంటున్నారు. గోపి కూడా శ్రద్ధగా చదువుతూ మంచి మార్కులతో 10వ తరగతి పాసయ్యాడు. రంగన్న సంతోషాన్ని చెప్పలేం. కొడుకుని వెంటపెట్టుకుని గడియారాల షాపుకు వెళ్ళాడు. రూ.500/-లు దాటకుండా నీకు నచ్చిన చేతి గడియారం కొనుక్కో అన్నాడు.

గోపి గడియారాలు చూస్తున్నాడు. చూడగా చూడగా ఒక గడియారం బాగా నచ్చింది. ధర అడిగాడు రూ.5,000/- అన్నాడు షాపు యజమాని. నాన్నేమో రూ.500/- దాటవద్దు అన్నాడు. ఇది 5000 అంటున్నారు. ఆలోచనలో పడ్డాడు. గడియారం చూస్తుంటే వదలబుద్ధికావడం లేదు. గారాబంగా పెరిగాడు గదా! అదే కావాలి అని మంకుపట్టుపట్టాడు. రంగన్నకు ఏం చేయాలో పాలుపోలేదు. అతను కష్టపడి సంపాదించిన డబ్బు కొంత దాచిపెట్టి ఉంచాడు. కాని అది గడియారం కోసం కాదు. కొడుకును ఇంటర్‌లో చేర్పించాలి. కాలేజీ చదువు అంటే మామూలు విషయం కాదు. సరే రేపు మరల వద్దాంలే. ఇప్పుడు అంత డబ్బు తేలేదు అని చెప్పి ఇంటికి తీసుకుపోయాడు.

రంగన్నకు ఆ రాత్రికి నిద్రపట్టలేదు. మెల్లగా తనకు రిక్షా అద్దెకిచ్చిన యజమాని దగ్గరకు వెళ్ళాడు. సంగతంతా వివరంగా చెప్పాడు. "రేపు సాయంత్రం నీ కొడుకుని తీసుకుని షాపుకురా. ఈ అయిదువేలు నీ దగ్గర ఉంచు" అని డబ్బును అప్పుగా ఇచ్చాడు. అనుకున్న ప్రకారం రంగన్న గోపిని తీసుకుని గడియారాల షాపుకు వెళ్ళాడు. అదే సమయంలో రిక్షాల యజమాని కూడా తన కొడుకు రవితో కలసి షాపుకు వచ్చాడు. మాటల్లో తెలిసింది. యజమాని కొడుకు కూడా 10వ తరగతి పరీక్ష పాసయ్యాడు. అతను కూడా గడియారమే కావాలన్నాడట.

రవిని కావలసిన గడియారం చూసుకోమన్నాడు వాళ్ళనాన్న. రవి వెదికి వెదికి 450 రూపాయల విలువగల గడియారాన్ని ఎంచుకుని వాళ్ళ నాన్నకు చూపించాడు. "ఇదేంటి? మంచి మంచి గడియారాలు, ఖరీదైన గడియారాలు ఉన్నాయి కదా! చూసుకోక పోయావా?" అన్నాడు నాన్న. "వద్దు నాన్నగారు! 500 పెట్టి కొన్నా, 5000 పెట్టి కొన్నా రెండు గడియారాలు ఒకే టైమును చూపిస్తాయి. ఆ డబ్బులతో ఇంటరు చదువుకోవడానికి పుస్తకాలు వస్తాయి. అంత డబ్బు పెట్టి కొనడం అనవసరం. పైగా రాత్రి రంగన్నకు అయిదు వేల రూపాయలు అప్పుగా ఇచ్చారు కదా! ఇంకా ఎవరైనా అడిగితే ఇవ్వాలి కదా! మీ దగ్గర డబ్బులన్నీ అయిపోతే పాపం! వారికి ఎవరిస్తారు? నాకు ఈ గడియారం చాలు" అన్నాడు రవి.

అక్కడే ఉండి అంతా వింటున్న గోపి ఆలోచనలలో పడ్డాడు. రవి మాటల్లోని సత్యాన్ని అర్థం చేసుకున్నాడు. రవి తన గురించే కాకుండా ఇతరులను గురించి కూడా ఆలోచిస్తున్నాడు. తానే మూర్ఖంగా అదే కావాలని పట్టుబట్టాడు అన్న ఆలోచన రాగానే తప్పు తెలుసుకున్నాడు. వెంటనే నాన్నకు కూడా చెప్పకుండా అలాంటిదే మరో గడియారం ఇమ్మన్నాడు. రంగన్న సంతోషంతో 450 రూ॥లు తీసిఇచ్చాడు. రవి, గోపి కొత్తగడియారాలను చేతికి పెట్టుకుని సంబరంగా ఇంటికి వెళ్ళారు.

విన్నారు కదా! బాలలు! రవి వాళ్ళ నాన్న చూపించిన తెలివి తేటలు. దీని ద్వారా తాను గోపీకే కాకుండా రవికి కూడా మంచి శిక్షణ ఇచ్చాడు. అనవసరమైనదానికి ఖర్చుపెట్టకూడదు అని తెలిసింది కదా!

*కం॥ మనమున కోర్కెలు కోరుచూ*
*ఘనముగ తలపంగరాదు కలతలు కలుగున్*
*తనదైన శక్తినెరుగుచు*
*మనమున యోచింపవలయు మరువక బాలా!*

– మధుర కవయిత్రి,
పొన్నూరు హైమవతీ శాస్త్రి


యుగశక్తి గాయత్రి
మాస పత్రిక చదవండి !
చదివించండి !!


మతాలకంటే మానవత్వం గొప్పది

ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ - ఆరవ అధ్యాయం (మొదటి ప్రకరణం)

# సత్సాహస - సంఘర్షణ ప్రకరణం

**అనీత్యాతంక హేతోర్యా ఘటనా దుఃఖదాయికాః ।**
**దృశ్యన్నే, దృశ్యమానానాం ప్రతిరోద్ధుం మనోభవత్ ॥ 40**

అవినీతి, అవరోధము అనే కారణాలు దుఃఖదాయకమైన ఫలితాలనిచ్చేవిగా ఉంటాయి. అవి కొన్నిసార్లు దృశ్య, అదృశ్య మానంగా కన్పించి, కన్పించని విధంగా మన మనస్సును ప్రభావితం చేస్తాయి. అప్పుడు వాటిని మనస్సు నిరోధించినప్పుడే శాంతి, ప్రశాంతత, మనశ్శాంతి మొదలైన ప్రయోజనాలు సిద్ధిస్తాయి.

మనం, తాత్కాలిక సుఖాలను ఇచ్చే అనైతిక, అవినీతిపట్ల జాగ్రత్తగా వ్యవహరించాలి. ఎందుకంటే వాటి ఆకర్షణ, ప్రభావము మన మనస్సులపైనే కాకుండా, ఇతరుల మనస్సులను కూడా ఆక్రమించుకుంటాయి. అందువల్ల ఆత్మ నిగ్రహశక్తిని అలవర్చుకోవాలి.

**అజ్ఞానం చాప్యభావశ్చ, అవాంఛనీయౌమతౌ తథా ।**
**యద్యప్యేతౌ తు విద్యేతే, పరోక్షౌ వ్యక్తి గౌధ్రువమ్ ॥ 41**

అజ్ఞానం, అభావము, అవాంఛనీయత అనే దుష్టశక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యక్తిత్వాన్ని భంగపరిచే ప్రయత్నం చేస్తూ ఉంటాయి. ఇవి ప్రగతిని నిరోధించే రాక్షస సహోదరులు వంటివే. అంటే దాయాదుల వంటివి. దేవతలు, దానవులు సోదరులే అయినప్పటికి, దానవులకు ఉండే సహజలక్షణమైన ధ్వంసరచన, హింసాప్రవృత్తి మొదలైనవాటివల్ల అటు రాక్షసులకు ఉపయోగ పడకపోగా, ఇటు దేవతలకు, మానవులకు ఇతర లోకాలలోని జీవులకు, నిరంతర అశాంతి, అభద్రత భావాలు అనుక్షణం బాధిస్తుంటాయి. తెలియనితనం ఉన్నా నష్టం లేదు. కానీ తెలుసుకోవాలన్నా జిజ్ఞాస లేకపోవడం, అన్ని తమకే తెలుసునన్న అహంకారం మొదలైన లక్షణాలు మానవుని ప్రగతికి, పురోగతికి అవరోధాన్ని కలిగిస్తాయి.

**అనయోహేతు నా వ్యక్తిః సమాజశ్చార్తయంత్రణా ।**
**సహేతె స భవేత్త స్మాత్ ప్రతిరోధోప్యనీతివత్ ॥ 42**

వ్యక్తి పురోగతికి, సమాజ హితానికి వ్యతిరేకమైన ఇటువంటి సహించరాని విషయాలను సహించక, వాటిని నిరోధించే కృషి చేయాలి. దానికి మౌలికంగా నైతికత అవసరం. స్వార్థచింతన లేకుండా, ధార్మిక నిబద్ధతతోకూడిన వ్యక్తులు, వారి లక్ష్యసిద్ధితో కూడిన మార్గం అత్యవసరం.

**న్యాయికః ప్రతిబంధోఽస్తి విరోధోఽనీతిపద్ధతేః ।**
**రాజసత్తారుణధ్యేనం, నైతోరోద్ధుం కిమప్యహో ॥ 43**

న్యాయమార్గం ఎన్నో అవరోధాలకు, ఆటంకాలకు గురి అయ్యి, నీతి పద్ధతులకు గ్రహణం పట్టినప్పుడు, రాజమార్గంలో నైతిక విలువల రక్షణ కొరకు ప్రయత్నించే వ్యవస్థ ఏర్పడాలి.

**అనయోరస్తి దాయిత్వం, లోకసేవిన రేషు హి ।**
**సుధాకరేషు శూరేషుతేఽగగా దూరయంత్విమౌ ॥ 44**

హింస, దమననీతి, పాపచింతన మొదలైన చీకటి గుణాలను తొలగింపచేసే వెలుగు రేఖలను ప్రసరింపచేసే ధీరులైన చంద్రుని వంటి యువకులు నాయకత్వం వహించి, ముందుకు నడిపించాలి. వారే రాబోయే తరానికి మార్గదర్శకులు కావాలి. అప్పుడే ఈ అవినీతి దూరమౌతుంది.

**ప్రత్యక్షం దృశ్యతే హానిర్యాతు సాక్రమణోదితా ।**
**ప్రత్యక్ష వాదినోః వాంఛనీయతా తాస్తు సంజగుః ॥ 45**

ప్రత్యక్ష హానిని కలిగించే దుష్ట శక్తులను, అవాంఛనీయ లక్షణాలను ప్రతిఘటించే నైతిక, ధార్మిక శక్తుల సేవలు ఆవశ్యకం, పరోక్ష శక్తులను గమనిస్తూ, దేహంలోని దుర్గుణాలను తొలగించే రీతిలో, సమాజంలోని అవినీతిని అంతమొందించడం అందరి ఆశయం కావాలి.

**దూరీకర్తుం చతాన్యేవ నిరతాస్తే భవంతి హి ।**
**విరలాః కే చనైవేదం జానంతి పురుషాస్తు యత్ ॥ 46**

శారీరక రుగ్మతలను, వాటి కారణాలను తెలుసుకొని, ఏ విధంగా శస్త్ర చికిత్సను చేయగలమో అలాగే సమాజానికి పట్టిన చీడను, దాని మూలకారణాలను వెదికి అంతమొందించడమే తక్షణ కర్తవ్యం. అటువంటి ఆలోచనగల వ్యవస్థ, వ్యక్తులు నేడు అవసరం.

– సాధన నరసింహాచార్య

**సద్విమర్శలను ఆహ్వానించాలి**

## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-5

# అపురూపం ఆ మాతృత్వ అనుభూతి



ఆవల్‌ఖేడాలో ఒక పాత భవంతి ఉన్నది. పండిట్ రూపకిశోర్‌జీ కుటుంబం, వారి సోదరుల కుటుంబాలు ఆ భవంతిలో నివసిస్తాయి. గృహస్థులు, జిజ్ఞాసువులు, బంధువులు ఆ ఇంటికి ఎప్పుడు వచ్చిపోతూ ఉండేవారు. ఇంట్లో ఎప్పుడు సందడిగా ఉంటుంది. పండిత రూపకిశోర్‌జీ వయస్సు అప్పుడు 51 సంవత్సరాలు. వారి ధర్మపత్ని దాన్‌కువరిని అంతా తాఈజీ అని పిలిచేవారు. పండిత రూప్‌కిశోర్ తమ సోదర సోదరీమణులలో పెద్దవారు. ఇంటిలోని పిల్లలంతా పండిట్‌జీని తాఊజీ అని, వారి భార్యను తాఈ అని పిలవడం సహజమే. వారిద్దరు కుటుంబ సభ్యులందరి బాగోగులు శ్రద్ధగా చూచేవారు. కోడళ్ళు ఆమెను అత్తగారిలా కాక వాత్సల్యం, క్షమాగుణం కలిగిన అక్కగా, తల్లిగా పరిగణించేవారు. ఆమె రాత్రి నాల్గవ జామున మేలుకొంటుంది. అర్ధరాత్రి వరకు బంధువుల, అతిథుల, మంచిచెడ్డలు చూడడంలో నిమగ్నం అవుతుంది.

1911లో ఆమెకు తల్లినయ్యానని తోచింది. మొదటి సంతానం ఆమె గర్భంలో పడింది. తాఈజీకి విలక్షణమైన కొన్ని అనుభవాలు కలిగాయి. ఆ అనుభవాల వల్ల తనకు భయం సంకోచాలు కలగలేదని ఆమె సహజమైన రీతిలో చెప్పారు. ఇరుగు పొరుగున ఉన్న వృద్ధ మహిళలకు ఆమె ఆ అనుభవాలను వివరించింది. అవన్నీ పూర్వీకుల, కులదేవతల అనుగ్రహాలని ఆశీస్సులని వారు చెప్పారు. ఆమె తన అనుభవాలను ఇలా వర్ణించింది.

ఒకరోజు ఉదయం ఆమె స్నానం, పూజ ముగించుకుని పాలు కాచడానికై పాల గిన్నె పొయ్యిమీద పెట్టింది. ఆరోజు చేయవలసిన పనుల గురించి ఆలోచిస్తోంది. శరీరంలో ఎంతో చైతన్యం, క్రియాశీలత ఉండేవి. రాత్రి బాగా పొద్దుపోయేవరకు పనిచేయ వలసి వచ్చినా ఆమెకు నీరసం వచ్చేది కాదు. కఠోర పరిశ్రమ చేసినా ఆమెకు అలసట కలిగేది కాదు. మరి ఆరోజు ఉదయం ఏమి జరిగిందో తెలియదు. ఆమెకు చిన్న కునుకు పట్టింది. ఆమె కూర్చొని ఉన్నది. కళ్ళు మూతలు పడ్డాయి నిద్రవచ్చినట్లు. ఆ నిద్రలో కల వచ్చినట్లు ఆమెకు అనిపించింది.

ఆమె ఎక్కడో వనంలో ఉంది. ఆ నిర్జన ప్రదేశంలో ఆమె ఒంటరిగా ఉన్నది. తూర్పు దిక్కున మండుతున్న అగ్ని గోళంలా సింధూరపు ఎరుపు రంగుగల సూర్యబింబం ఉదయిస్తోంది. ఉదయిస్తున్న ఆ సూర్యుని వెలుగు నలుగువైపులా విస్తరిస్తోంది.

వాతావరణంలో సుగంధం గుబాళించడం ఆమెకు అనుభవమయింది. ఆమె స్పృహ కోల్పోయింది. తూర్పు దిక్కున ఉదయాచలం వెనుక నుండి వెలికివస్తున్న సూర్యబింబం క్రమ క్రమంగా కాంతివంతం అవుతోంది. ఆ బింబం మధ్యలో ఒక స్త్రీ మూర్తి మెరుపులా మెరుస్తోంది. బంగారు వెలుగులు విరజిమ్ముతున్న ఆ మూర్తి హంస వాహనంపై కూర్చొని ఉన్నది. ఆమె కుడి చేతిలో కమండలము ఉన్నది. ఎడమ చేతిలో గ్రంథం ఉన్నది. అది ఏ గ్రంథమో తాఈజీకి అర్థం కాలేదు. అది భాగవతం అని ఆమె అనుకున్నది. ఎందుకంటే, ఆమె పతిదేవులు భాగవతం పురాణం చెప్తూ ఉంటారు. ఆ మూర్తి కొద్ది క్షణాలు కానవచ్చింది, ఆ తర్వాత అంతర్ధానం అయింది.

తాఈజీ కళ్ళు తెరచి చూచేసరికి పాలు పొంగిపోయాయి. పాలు పొయ్యిలో పడ్డాయి. మండుతున్న కట్టెలమీద ఆ పాలు పడడంతో సర్రుమనే ధ్వని వచ్చింది. ఆ ధ్వనికి ఆమెకు మెలకువ వచ్చింది.

ఆమె తన పతిదేవులకు ఈ దృశ్యం వర్ణించింది. ఆ దేవి చేతిలో భాగవత గ్రంథం ఉన్నదని చెప్పింది. ఆ గ్రంథం భాగవతం కాదని, వేదమని, భాగవత శాస్త్రం ఆ వేదంలోని ఒక మంత్రానికి వ్యాఖ్య, వివరణయని భాగవతం, రామాయణం వంటి గ్రంథాలు గాయత్రీ మంత్రాన్ని వివేచన చేసే శాస్త్రాలని ఆయన వివరించారు.

తాఈజీకి ఈ దృశ్యం ఆ తర్వాత కూడా కనిపించింది. ఒకరోజు మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత కుటుంబ సభ్యుల యోగక్షేమాల అడిగి తెలుసుకుని, కొద్దిసేపు కూర్చున్నది. సాయంత్రం చేయవలసిన పనులకు ఏర్పాట్లు చూస్తూ వంటగది లోనే ఉన్నది. అప్పుడు కనిపించింది ఆ దృశ్యం.

తాఈజీ భావ సమాధిలో ఉన్న సమయంలో ఆమెకు ఒక దృశ్యం కనిపించింది. ఆమె ఒక సరస్సు ఒడ్డున నిలబడి ఉన్నది. ఆ సరస్సులో కమలాలు విచ్చుకుని ఉన్నాయి. ఇంతకుముందు సవితా మండలంలో కానవచ్చిన స్త్రీమూర్తి ఒక పెద్ద కమలంలో కూర్చొని ఉన్నది.

మరో కలంలో తూర్పు నుండి దేవతల విమానం ఎగురుతూ

**బలహీనులకు సహాయం అందించాలి**

కనిపించింది. ఆ విమానంలో కూర్చొని ఉన్న దేవతలు పువ్వులు కురిపిస్తున్నారు.

ఈ దృశ్యాలు ఆంతరిక జగత్తులో జరుగుతున్న పరిణామాలకు సంకేతాలని పండిట్‌జీ చెప్పారు. ఈ సంకేతాలను చేతనలో జరిగే పరివర్తనలని కూడా చెప్పవచ్చునని ఆయన వివరించారు. ఒక పుణ్య ఆత్మ శరీరం ధరించే సమయంలో, అది గర్భంలోనికి ప్రవేశిస్తున్న సమయంలో ఇలాంటి కలలు వస్తాయని ఆయన వివరించారు.

గృహంలో, ప్రాంగణంలో కూడా ఆ రోజులలో కొన్ని విచిత్ర సంఘటనలు జరిగాయి. తాఈజీ ఇలా చెప్పేవారు అకస్మాత్తుగా ఇంటిలో సువాసన గుప్పుమనేది. అగరువత్తులు వెలిగించినట్లు, హవనం జరిగినట్లు, ఆ సుగంధం తీయ తీయగా ఉండేది. ఆ సుగంధం కొద్దిసేపు ఉండేది. ఆ తర్వాత క్రమంగా తగ్గిపోయేది.

భవంతి ప్రాంగణంలోకి అకస్మాత్తుగా పెద్ద సంఖ్యలో ఆవులు వచ్చి చేరాయి. ఇంటి ప్రక్కనే ఉన్న గోశాలలోని ఆవులు బయటి నుంచి కూడా ఆవులు వస్తున్నాయి. ఒక్కోసారి 9-10 ఆవులు వచ్చి రాత్రంతా అక్కడే ఉంటున్నాయి. ఆవల్‌ఖేడాలోని ఇతర గ్రామీణుల దొడ్ల నుండి కూడా అవి వస్తున్నాయి. వాటిని వెదకడానికి జనం వస్తున్నారు. పండిట్‌జీ గోశాలలో అవి ఉండడం చూచి వారు ఆశ్చర్యపోయేవారు. మామూలు పరిస్థితులలో పరాయి పశువులను జనం తరిమి వేస్తారు. అయితే ఆ రోజుల్లో తాఈజీ మనస్సులో విలక్షణమైన మార్పు వచ్చింది. ఆవులను తరిమివేయడానికి బదులు ఆమె వాటికి సేవ చేసేది. వాటికి మేతా, నీళ్ళు పెట్టేది.

భవంతిలో తేనేటీగలు వచ్చి రొదచేస్తూ ఉంటే తాఈజీకి ఆశ్చర్యం కలిగింది. వారం రోజులలో అవి భవంతిలో నాలుగైదు తేనె పట్లు పెట్టాయి. కుటుంబ సభ్యులందరికి ఇబ్బంది కలిగింది. ఆ తేనేటీగలు ఎవరినీ కుట్టడం లేదు. అయినా, వాటివల్ల ఇంటి వాతావరణం దెబ్బతిన్నది. తేనేటీగలను తరిమివేయాలని కుటుంబ సభ్యులు అనుకుంటున్నారు. మంటవేస్తే ఆ పొగకు అవి పారిపోతాయి. గ్రామాలలో ఇలాగే చేస్తూ ఉంటారు.

తేనేటీగలను తరిమి వేయాలనుకుంటున్నారని తాఈజీకి తెలిసింది. ఆమె తరమవద్దన్నది. అందరికన్నా ఎక్కువగా ఇంటిలో తిరుగుతుండేది ఆమే. ఆమెకు ఇబ్బంది కలుగుతోంది. అయినా, తేనెపట్టులను నాశనం చేయాలనే ఆలోచన ఆమెకు నచ్చలేదు. ఈ తేనేటీగలు ఎవరినీ కుట్టడం లేదు. అవి తాము కట్టుకున్న పట్టులలో ఉంటున్నాయి. వాటిని ఎందుకు బాధ పెట్టాలి? అవి మనకు బాధ కలిగించనప్పుడు మనం తేనెపట్టులను ఎందుకు తొలగించాలి? అని ఆమె గట్టిగా వాదించింది. అంతా శాంతించారు.

ఆ సమయంలో పండిత రూపకిశోర్‌జీ పురాణం చెప్పడానికి పొరుగూరు వెళ్ళారు. తొమ్మిది పది రోజుల తర్వాత తిరిగి వచ్చారు. జరిగిన సంఘటన గురించి తెలుసుకుని, ఆయన తాఈజీని సమర్థించారు. తేనేటీగలు రావడం, ఇంటిలో తేనె పట్లు పెట్టడం శుభ సూచకమనే ఆధ్యాత్మిక వాస్తవాన్ని ఆయన కుటుంబ సభ్యులకు బోధపరచారు. కుటుంబంలోకి దివ్యాత్మ వచ్చే సమయంలో ఇలాంటి శుభ సూచన వస్తుంది. అది శివుని వరం. ఆయన పంపిన ప్రాణి పువ్వుల సువాసనను, తేనెను సేకరించి తెస్తోంది. ఇది శివుని అనుగ్రహం, రాబోయే ఆత్మకు భరోసా అని ఆయన వివరించారు.

శక సంవత్సరం 1968 ఆశ్వయుజ కృష్ణ త్రయోదశి రోజున (1911 సెప్టెంబరు 20) ఆగ్రా జలేసర్ రహదారిలో ఉన్న ఆ గ్రామంలోని భవంతిలో ఉదయం 9 గంటలకు శ్రీరామ్ జన్మించాడు. పితృపక్షం నడుస్తోంది. పితృపక్షం రోజులలో శరీరం వదలడం, జన్మ ఎత్తడం విలక్షణ విషయాలని సనాతన ధర్మం చెప్తోంది. ఈ సమయంలో శరీరాన్ని వదలేవారు పరలోకంలో ఎక్కువ కాలం తిరగరు. వారిలోని భోగవాసన ఏదీ మిగలదు. కనుక ఆ వాంఛను తృప్తిపరచడం కోసం వారు అశరీర స్థితిలో ఉండిపోవలసిన అవసరం ఉండదు. ఆ ఆత్మలు సరాసరి పితృ లోకానికి వెళ్ళిపోతాయి లేదా కొత్త శరీరాన్ని ధరిస్తాయి. ఈ సమయంలో జన్మించే ఆత్మలు కూడా ముక్తప్రాయులుగా ఉంటాయి. వాటి సూక్ష్మవాసనలు (కోరికలు) ఒకటి రెండు మిగిలి ఉంటాయి. వాటిని పూర్తిచేయడం కోసం అవి శరీరాన్ని ధరిస్తాయి.

అంతేకాదు పితృపక్షంలో జన్మించే వ్యక్తులు ఆ వంశంలోని మేధావులైన పూర్వీకులు అయి ఉంటారు. తమ వంశ పరంపరను ముందుకు నడపించడానికి, దానికి సమృద్ధి కల్పించడానికి, దాని గౌరవాన్ని పెంచడానికి, గత జన్మలో తమకు అనుగ్రహం, ఉపకారం చేసిన వారి రుణం తీర్చుకోవడానికి వారు జన్మ ఎత్తుతారు.

రూపకిశోర్‌జీ కుటుంబంలో ఒక యతి ఆత్మ, ఒక యోగి ఆత్మ జన్మ ధరించిందని, 51 సంవత్సరాల వయస్సులో ఆయనకు అదృష్టం వరించిందని, బాలుడు పితృపక్షంలో జన్మించడం ఆధారంగా, అతడు జన్మించడానికి ముందు జరిగిన సంఘటనల ఆధారంగా ఆవల్‌ఖేడాలోని పండితులు నిర్ణయించారు.

శిశువు జననంతో ఇంటిలోనేకాక గ్రామంలో కూడా ఆనందం వెల్లివెరిసింది. గ్రామంలో ఉన్నవి 30-40 ఇళ్ళే, ఆవులు

**ఇష్టపడి చదవండి - కష్టపడి పనిచేయండి**

రావడం, తేనేటీగలు తేనెపట్లు కట్టడం, తాఈజీ తన కలలను గురించి చెప్పిన మాటలు ఈ శుభ శకునాలన్నీ నిజం అయినాయనే మాట ఇరుగు పొరుగు ఇళ్ళలోనేకాక గ్రామం అంతటా వ్యాపించింది. ధర్మాన్ని గురించి, లోకోత్తర జ్ఞానం గురించి సహజమైన అవగాహన ఉన్న గ్రామ పెద్దలు ఆ సంఘటనలు జరిగినప్పుడే చెప్పారు పండిట్‌జీ ఇంటిలో యోగి, యతి ఆత్మ జన్మ ఎత్తుతుందని. శిశువు జన్మించిన తర్వాత పండిట్‌జీ ప్రవచనాలు వింటున్న పరిసర గ్రామాల శ్రీమంతులు కులీనుల కుటుంబాల వారు అతడిని చూడడానికి వచ్చారు.

ఇలా వీరంతా రావడం గ్రామ ప్రజలకు సహజమే అనిపించింది. అయితే సాధుసన్యాసులు ఎక్కువగా తమ గ్రామానికి రావడం మాత్రం వారికి విశేషం అనిపించింది. అంతకు ముందు ఎప్పుడైనా ఒకరో ఇద్దరో సన్యాసులు దారి తప్పి వచ్చేవారు. శిశువు జన్మించిన తర్వాత రోజూ నలుగురైదుగురు సన్యాసులు వస్తున్నారు. శిశువు జన్మించిన రోజున ఉదయం పది గంటలకు ఒక సన్యాసి భవంతి ముందు వచ్చి నిలిచాడు. పొడుగ్గా, ధృఢంగా ఉన్నాడు. తేజస్సుతో వెలిగిపోతున్నాడు. శిశువు ఏడుపు విని పిల్లవాడిని చూడాలనే కోరికను వ్యక్తపరిచాడు. తాఈజీ వెనుకాడింది. పండిట్‌జీ నచ్చచెప్పిన తర్వాత అందుకు ఒప్పుకున్నది. సన్యాసి పిల్లవాణ్ణి చూచి రెండు చేతులు ఎత్తి దీర్ఘాయువుగా ఉండమని, కీర్తి సంపాదించమని శిశువును ఆశీర్వదించి వెళ్ళిపోయాడు.

శ్రీరామ్ జన్మించిన తర్వాత భవంతిలో మధుర సంగీతం వినిపించసాగిందని తాఈజీ చెప్పేవారు. మరునాటి ఉదయం వరకు మంత్ర పఠనం, రామాయణ గానం వినిపించింది. తాఈజీ ఆంతరిక స్థితి వల్ల ఆమెకు ఈ అనుభూతి కలిగి ఉండవచ్చు. అయితే సన్యాసులు వచ్చి వెళ్తూ ఉండడం వల్ల ఆమె కలత చెందడం పలువురు చూచారు. సాధు సన్యాసులు ఇంటి గుమ్మం వద్ద నిలిచి ఏమీ మాట్లాడకుండా నిలబడి ఉండటం చూచి ఆమెను కొంత కలవరపడేది. వారికి పూజ చేయబోతే వద్దనేది. చాలాసేపు గృహంవైపు రెప్పవాల్చకుండా చూస్తూ ఉండేది. పిల్లవాడి ఏడుపు విని ఆమె వెళ్ళిపోయేది. ఇలా సాధువులు రావడం పండిట్‌జీకి చిత్రంగా తోచింది. ఆయన కలత చెందేవారు కాదు. తాఈజీ కలత చెందితేవారు పండిట్‌జీ ఆమెకు నచ్చచెప్పేవారు.

బాలుడు జన్మించి 16-17 రోజులు అయ్యాయి. సూతక నివారణ తర్వాత నామకరణ సంస్కారానికి ఏర్పాట్లు జరిగాయి. ఆ రోజున ఒక చిత్రమైన సంఘటన జరిగింది. అందువల్ల తాఈజీతో పాటు పండిట్‌జీ కూడా కొంత చలించారు. నామకరణ సంస్కారం కోసం విజయదశమి రోజును ఎంపిక చేశారు. గ్రామంలో రామలీల, రావణ దహనం వంటి కార్యక్రమాలు జరిగేవి కావు. ఇళ్ళలో నవాహ్న పారాయణం జరిగేది. సప్తశతి పఠనం కూడా జరిగేది. అయితే ఎక్కువమంది రామచరిత మానస్ గ్రంథాన్ని పఠించేవారు. పిల్లవాడు పుట్టినందువల్ల ఇంటిలో సూతకం అమలు జరిగింది. సంధ్యావందనం, పూజా పునస్కారాలు యథాప్రకారం జరిగాయి. కానీ, నవరాత్రి విశేష పూజలు జరగలేదు. నవమి రోజున సూతక నివారణ జరిగింది. ఆ రోజునే రామచరిత మానస్ అఖండపఠనం జరిగింది. మరునాడు పూర్ణాహుతి, యజ్ఞం, యజ్ఞంతో పాటు నామకరణ సంస్కారం జరుగవలసి ఉన్నది.

రామచరిత మానస్ పూర్ణాహుతి, యజ్ఞ సంస్కారాల కార్యక్రమంలో గ్రామస్థులు దాదాపు అందరు పాల్గొన్నారు. విజయదశమి రోజున ప్రజలు రాసాగారు. భవంతి గుమ్మం దగ్గర ఒక సన్యాసి నిలబడి ఉండడం వారంతా చూచారు. కొంత సేపటికి ఒక యోగిని అక్కడకు వచ్చింది. ఇద్దరు మాట్లాడుకోలేదు. అయితే నామకరణ ప్రారంభమయ్యే వరకు వారు ఒక చోట కదలకుండా నిలబడి ఉన్నారు. సంస్కారం ప్రారంభం కాగానే వారిద్దరు లోపలికి వచ్చారు. తాఈజీ ఒడిలో పడుకుని ఉన్న శిశువును వారు కళ్ళార్పకుండా చూస్తూ ఉండిపోయారు. తాఈజీ దృష్టి వారిద్దరి మీద పడింది. వారిని చూడగానే ఆమె సంకోచించింది. శిశువుని చీర కొంగుతో కప్పసాగింది. అప్పుడా సాధువు ఇలా అన్నాడు “అలా ఉండ నివ్వండి తల్లీ. పిల్లవాణ్ణి మమ్మల్ని కూడా చూడనివ్వండి. తృప్తిగా చూడనివ్వండి. ఆ తర్వాత మేము చూడగలమో చూడలేమో” అలా చెప్తూ ఆ సాధువు తనకేసి చూపాడు. ఆ తర్వాత మేము జీవించి ఉంటామో ఉండమో అన్నట్లు, కానీ ఆయన పిల్లవాణ్ణి గురించి ఆ మాట అన్నట్లు తాఈజీకి అనిపించింది. ఆమెకు కోపం వచ్చింది. ఆమె వేదిక నుండి లేచింది. సాధువును బెదిరించసాగింది. యోగినిని కూడా తిట్ట సాగింది. వారిద్దరు తమకు చెడు తలపు ఏదీ లేదని సంజాయిషీ ఇచ్చుకోసాగారు. అయినా తాఈజీకి కోపం చల్లారలేదు. పండిట్‌జీ లేచి నిలబడ్డారు. ఆయన నోటి నుండి అతి సహజంగా ఈ మాటలు వెలువడ్డాయి. “పరవాలేదు, శ్రీరామ్ కీ మా! పిల్లవాడికి ఎలాంటి బాధా కలుగదు. అతడు క్షేమంగా ఉంటాడు.”

పండిట్‌జీ ఇంకా ఏదో చెప్పబోతూ ఉండగా ఆ సాధువు ఇలా అన్నాడు – మాతా! మేము వెళుతున్నాము. అయితే మాదొక చిన్న మాట. దానిని మీరు పాటించాలి. పిల్లవాడికి శ్రీరామ్ అని

**దురలవాట్ల నుండి దూరంగా ఉండాలి**

పేరు పెట్టండి. అతడి తండ్రి నోట ఆ పేరు తనకు తానుగా వెలికి వచ్చింది కదా. ఇది ఈశ్వరేచ్ఛ.

పండిట్‌జీ కూడా సాధువు అభిప్రాయంతో ఏకీభవించాడు. ఆ తర్వాత తాఈజీ సన్యాసిని, యోగినిని ఏమీ అనలేదు. సంస్కారం పూర్తయ్యే వరకు వారు అలా నిలబడే ఉన్నారు. శిశువు నామకరణంలో తండ్రికి, పిలువకుండా వచ్చిన ఆ సన్యాసికి అనుకోకుండా ఏకాభిప్రాయం ఏర్పడింది.

మరో రోజున ఒక వృద్ధ సన్యాసి గంటన్నర సేపు భవంతి ఎదుట నిలబడ్డాడు. తాఈజీ ఆ సన్యాసిని చూచి గాభరా పడింది. కేకలు పెడుతూ ఇంటి నుండి వెలికి వచ్చింది. సన్యాసి వ్యక్తిత్వం చూసి ఆమె స్తంభించిపోయింది. నా పిల్లవాణ్ణి ఎందుకలా చూస్తావు? వాడు నీకేమి అపకారం చేశాడు? అని భయం భయంగా అతడిని అడిగింది. 'మేము పిల్లవాడికి హాని చేయడానికి రాలేదు. అతడి దర్శనం కోసం వచ్చాము. హిమాలయంలోని ఒక సిద్ధ పురుషుడు మీ ఒడిలోనికి వచ్చాడనే భావం మాకు కలిగింది. ఆ సంగతి మాకెలాగో తెలిసింది. కనుక అతడిని చూడడానికి వచ్చాము. ఒక్కసారి చూచి వెళ్ళిపోతాము' అని ఆ సన్యాసి అన్నాడు. తల్లి సన్యాసి మాట విన్నది.ఒక్కసారి పిల్లవాడిని చూపించి తిరిగి వెళ్తూ అన్నది. "నేను ఇంకెవరికి నా పిల్లవాడిని చూపించను" సాధువులు ఇక్కడికి రావడం నాకిష్టం లేదు.

ఆమె తన గదిలోకి వెళ్ళింది. తన ఇష్టదైవం ద్వారకాధీశుడి ముందు కూర్చున్నది. చాలాసేపు ఏడుస్తూనే ఉన్నది. హిమాలయంలోని ఆత్మ, సన్యాసి, సిద్ధపురుషుడు, దర్శనం వంటి మాటలు ఆ తల్లి మనసును కల్లోలపరిచాయి. తన పిల్లవాడు ముందు ముందు తనను విడిచి వెళ్ళిపోతాడేమోనని ఆమె భయపడింది. తన పిల్లవాడు ఎప్పుడు తన దగ్గరే ఉండాలని, ఎన్నడు తనను విడిచి వెళ్ళిపోకూడదని ఆమె తన ఇష్టదైవాన్ని ప్రార్థించి ఉంటుంది. భక్తురాలు తన భగవంతుడిని ఏమి కోరింది అనేది వారిద్దరి మధ్య జరిగిన ఆంతరిక సంభాషణ. ఏది ఏమయినా ఈ సంఘటన తర్వాత ఆ ఇంటిని సాధు సన్యాసులు రావడం, మంచివే అయినా చిత్రమైన పరిస్థితులు ఏర్పడడం ఆగిపోయాయి.

మొదటి మూడు నాలుగు సంవత్సరాలు శిశువు బాల్య క్రీడలతో గడచిపోయాయి. అతడు కాళ్ళు చేతులు ఊపడం, వచ్చీరాని ముద్దు మాటలు మాట్లాడటం చూచి తల్లిదండ్రులు సంతోషించారు. శ్రీరామ్ జన్మించిన మూడున్నర సంవత్సరాలకు కుటుంబంలో ఒక బాలిక జన్మించింది. ఆమెకు కిరణ్ దేవి అని పేరు పెట్టారు. ఆ తర్వాతి కాలంలో మరో చెల్లెలు పుట్టింది. ఆమెకు అన్నపేరే పెట్టారు రామదేవి అని. చెల్లి పుట్టిన తర్వాత తల్లి దృష్టిని ఇద్దరు పంచుకోవడం సహజమే. అంతవరకు వంట చేస్తూ, పూజా పునస్కారాలు జరుపుతూ, ఇంటికి వచ్చిపోయేవారి సంగతి చూస్తూ కూడా తల్లి తన దృష్టిని పిల్లవాడి మీదే పెట్టేది. ఆమె తన పిల్లవాడిని తండ్రికి, ఇతర కుటుంబ సభ్యులకు అప్పగించిన సందర్భాలు చాలా తక్కువ. పిల్లవాడు పుట్టినప్పుడు సన్యాసులు రావడం, వారు చిత్ర విచిత్రమైన మాటలు చెప్పడం ఇదంతా తాఈజీ మనసులో మారుమ్రోగుతూ ఉండేది. ఏ సన్యాసి నీడ అయినా తన శ్రీరామ్‌పై పడుతుందేమో అన్న తెలిసీ తెలియని భయం ఆమెను పీడిస్తూ ఉండేది. కిరణ్ దేవి పుట్టిన తర్వాత తాఈజీ ఇతరుల మీద ఆధారపడవలసి వచ్చింది. అప్పుడైనా ఆమె కొడుకును తండ్రికే అప్పచెప్పేది. ఆడపిల్లను చూచుకోవడంతో పాటు ఆమె శ్రీరామ్‌ను కూడా ఎంతో శ్రద్ధగా చూచుకునేది. పండిట్‌జీ ఇంటిలో లేకపోతే, ఆమె పిల్లవాడిని పసిపిల్లతో పాటు నిద్ర పుచ్చేది. తండ్రి ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత ఆమె పర్యవేక్షణ కొంత సడలేది.

– *అనువాదం: ఎ. వేణుగోపాల రెడ్డి*

## అభినందనలు




***శ్రీ పి.వి. చలమయ్య,*** *విజయనగరం పట్టణం విజయనగరం జిల్లా వాస్తవ్యులు, గాయత్రీ పరివార్ ప్రముఖ కార్యకర్త, 2012 ఆగస్టు మరియు సెప్టెంబర్ మాసములలో– యుగశక్తి గాయత్రి మాసపత్రికలకు 800 మందిని నూతన చందాదారులుగా చేర్చారు. ప్రజలలో ముఖ్యంగా ఓటర్లలలో రాజకీయ చైతన్యము మరియు వివేకాన్ని పెంపొందించెడి దిశగా వారిని జాగృతం కావించుటకై పూజ్య గురుదేవులు శ్రీరామశర్మ ఆచార్యుల* ***"యజమానులారా (ఓటరులారా) మేల్కొనండి! ప్రజాస్వామ్యాన్ని కాపాడండి"*** *అనే పుస్తకాన్ని 20వేల కాపీలను ముద్రించి జిల్లాలో పంపిణీ చేయుటకు ఏర్పాట్లు చేసిరి.*

*తోటి సహచర గాయత్రీపరివార్ సభ్యుల సహకారంతో సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ బాధ్యతగల పౌరునిగా ఈ బృహత్తర కార్యక్రమానికి సారథ్యం వహించినందులకు వారిని, వారి మిత్ర బృందాన్ని హైదరాబాదు గాయత్రీ చేతనాకేంద్రం అభినందించుచున్నది.*

**బలహీనతలను అధిగమించాలి**

# మస్తిష్కమే కల్పవృక్షం - 2



*(గత సంచిక తరువాయి...)*

ఈ రకం సంఘటనలు జరగటానికి కారణములు, సామర్థ్యముల, సిద్ధుల ఆధారం మనిషి యొక్క మనస్సు-మస్తిష్కము అని చెప్పారు. ఇదే మస్తిష్కము యొక్క ఈ పక్షమును మనస్సు అని చెప్పవచ్చు. కాని మనస్సు, మస్తిష్కముల సామర్థ్యమును స్థూలముగా విభజింపలేము. మనస్సు యొక్క స్వాస్థ్యం (ఆరోగ్యం) మనిషి యొక్క ఆంతరిక, బాహ్య పరిస్థితులపై తప్పనిసరిగా ప్రభావం చూపుతుంది.

1763 జనవరి 21వ తేదీన జరిగిన సంఘటన. మాదామ్ లుహర్‌మేట్ తన 4 సంవత్సరాల కొడుకు ఆర్మండును తీసుకుని ఫ్రాన్స్ సామ్రాట్టు లూయి16కి ఇవ్వబడిన మృత్యు దండనను చూడటానికి వెళ్ళింది. లూయిని అతికర్కశంగా చంపేశారు. ఆ భీభత్స దృశ్యాన్ని చూచి మాదామ్ కొడుకు ఆర్మండ్ చాలా భయపడ్డాడు. ఆమె పిల్లవాడిని తీసుకుని ఇంటికి తిరిగి వెళ్ళింది. ఆర్మండ్ ఆడుకుంటుండగా అతనికి ఆ భీభత్స దృశ్యం గుర్తుకు వచ్చింది. ఉన్నట్టుండి స్పృహతప్పి పడిపోయాడు. అతనిని హాస్పటల్‌కి తీసుకువెళ్ళారు. డాక్టరు పరీక్షించి అతని మనస్సుపై ఏదో సంఘటన యొక్క ప్రభావం అతిగా పడిందని అన్నాడు.

ఆర్మండ్ స్పృహలోకి వచ్చాడు కాని ఆ సంఘటన అతని మనస్సుపై ఎలాంటి ప్రభావం చూపిందంటే అతనికి నిద్ర పట్టడం లేదు. రోజులు, 2-3 వారాలు గడిచాయి కానీ అతనికి నిద్ర రావడం లేదు. నిద్ర కొరకు మత్తుమందులు కూడా ఇచ్చారు కాని ఏమి ఉపయోగం లేకపోయింది.

నిద్రపోకపోవడం వల్ల పిల్లవాడి ఆరోగ్యం పాడయిపోతుందని అతని తల్లితండ్రులు భయపడ్డారు. ఒకటి రెండు రోజులు నిద్రపోకపోతే చాలా చిరాకుగా ఉంటుంది, ఆందోళన కలుగుతుంది. సామాన్యంగా మనిషికి 8గంటల నిద్ర అవసరమవుతుంది, అది కొంచం తక్కువయినా దినచర్య గడపటం కష్టమవుతుంది. కాని ఆర్మండ్‌ను చూస్తే ఈ ఆలోచనలు తప్పనిపిస్తుంది.

నిద్రపోకపోయినా కూడా ఆర్మండ్ చదువుకోవడం ఆడుకోవడం అందరిపిల్లలవలె చేసేవాడు. అంతేకాదు బాగా చదివి వకీలు అయ్యాడు. అందరు నిద్రపోతుంటే ఆర్మండ్ కోర్టు కేసులలో వాదనలకు తయారవుతుండేవాడు. ఆర్మండ్ జాక్వస్ అనే పేరుతో మంచి వకీలుగా ఖ్యాతి గాంచాడు, 75 సంవత్సరాలు వయస్సులో ఆర్మండ్ 1864లో చనిపోయాడు. అంతిమ క్షణాల వరకు నిద్ర పోకుండానే గడిపాడు.

ఇటువంటి సంఘటనలను ఎన్నో పరిశోధించి డా॥ సోలమన్ "మైండ్ మిస్టరీస్ అండ్ మిరకిల్స్" అనే పుస్తకం రచించాడు. మనస్సుకు అతి సూక్ష్మమైన, అద్భుతమైన శక్తి ఉన్నదని ఈ పుస్తకంలో ఆయన అంటాడు. ఈ రహస్యాలను తెలుసుకోవడం అతి కష్టమైన పని. భారతీయ తత్వదర్శనంలో అన్ని రకాల సఫలతలకు, విఫలతలకు మనస్సే మూలకారణమని చెప్పబడింది. బంధానికి, మోక్షానికి మనస్సే కారణమంటుంది.

**"మన ఏవ మనుష్యానాం కారణం బంధ మోక్షయో "**

పైన చెప్పిన సంఘటనను విశ్లేషిస్తూ డా॥ సోలమన్ ఇలా వ్రాశారు. లూయికి ఇచ్చిన మృత్యు దండన ఆర్మండ్ చేతనత్వాన్ని ఎంతగా కుదిపివేసిందంటే అతనిని 71 సంవత్సరాలు నిద్రపోనివ్వలేదు. పరిస్థితులు, సంఘటనల వల్ల ప్రభావితమైన మనస్సు శరీరాన్ని ఎలా ఆడిస్తుందో తెలుస్తూనే ఉన్నది. బాధాకరమైన పరిస్థితులలో ముఖం పాలిపోవడం, ఆవేదన భరితమైన పరిస్థితులలో నిద్ర పట్టకపోవటం, ఆనందకరమైన సమయంలో ముఖం వికసించడం మొదలైన విషయాలు మనస్సుకు, శరీరానికి ఉన్న సంబంధాన్ని నిరూపిస్తాయి.

మనస్సు అతి సమర్థవంతమైనది, బలమైనది. శ్రీకృష్ణుడు ఇలా అంటాడు.

**అసంశయం మహా బాహో మనో దుర్నిగ్రహం చలమ్**

**(గీత 6/35)**

అర్జునా! మనస్సు ఎంతో చంచలమైనది. ఎంతో కష్టం మీద గాని వశం కాదు.

శాస్త్రకారులు, యోగులు, సిద్ధులు, మహాపురుషులు మనస్సును సమస్త శక్తుల భాండాగారం అని నిరూపించారు, దీనిని వశంలో ఉంచుకొనడం ఆవశ్యకం అని చెప్పారు.

మనస్సు యొక్క శక్తులను భారతీయ మహర్షులు, మునులు ఏనాడో అవగతం చేసుకున్నారు. ఆధునిక విజ్ఞానం కూడా దీని యొక్క ప్రచండ సామర్థ్యాన్ని స్వీకరిస్తున్నది. సైకాలజి, పారా సైకాలజి, మెటా ఫిజిక్స్, ఫెయిత్ హీలింగ్ మొదలైన విజ్ఞానధారలు

**సాధనతో ఏదైనను సాధించవచ్చు**

మనస్సు యొక్క అధ్యయనం ద్వారా పొందినవే. శరీరాన్ని ఒక భోగవస్తువుగా భావించి ఆధ్యాత్మిక సుఖ సంపదలను పోగొట్టు కుంటున్నారు. అదేవిధంగా మనస్సువంటి ప్రచండమైన శక్తిని కేవలం లౌకిక స్వార్థాలకు, ఇంద్రియ భోగాల వరకే ఉపయోగించుకుని ఎంత కోల్పోతున్నారో చెప్పనలవికాదు.

మనస్సు భౌతిక శరీరానికి చైతన్య శక్తి. ఐన్‌స్టీన్ యొక్క శక్తి సిద్ధాంతాన్ని అనుసరించి ఒక పరమాణువులో 3,45,660 లక్షల కాలరీల శక్తి ఉత్పన్నమవుతుంది. నిజానికి ఒక పరమాణువు నుంచి ఎంత శక్తి వెలువడుతుందో ఇప్పటికి సరిగ్గా వివరించలేక పోతున్నారు, ఎందుకంటే పరిశోధన చేసిన కొద్దీ క్రొత్తక్రొత్త రహస్యాలు బయటపడుతున్నాయి, పదార్థాన్ని శక్తిగా మార్చే ఎన్నో అవకాశాలు కనిపిస్తున్నాయి. వాటి ప్రకారం ఒక పౌండు అంటే 453.6 గ్రాముల పదార్థం యొక్క శక్తి 14 లక్షల టన్నుల బొగ్గు మండిస్తే వచ్చేటంత శక్తితో సమానమని చెప్పవచ్చు.

కాని పదార్థాన్ని పూర్తిగా శక్తిగా మార్చడం ఇప్పటివరకు సాధ్యం కాలేదు. ఇది సంభవమయితే 453.6 గ్రాముల బొగ్గుతో అమెరికా అంతటికి ఒక నెలకు సరిపోయే విద్యుత్‌ను తయారు చేయవచ్చు. పదార్థాన్ని శక్తిగా రూపాంతరం చేయడం వైజ్ఞానికులకు సాధ్యంకాలేదు. కాని పరమాత్మ మనిషి శరీరాన్ని ఎలా సృష్టించాడంటే శరీరంలోని విద్యుత్‌శక్తి మనస్సు రూపంలో వెలుగొందుతుంది. మనస్సు అనేది శరీర రూపంలో ద్రవ్యం యొక్క విద్యుత్ శక్తి. దీనిని ఉపయోగించుకోగలిగితే 60 కిలోగ్రాముల శరీరం యొక్క విద్యుత్ శక్తి అనగా మనస్సు యొక్క సామర్థ్యాన్ని ఉపయోగించగలిగితే భారతదేశమంతటికి 10 సంవత్సరాల వరకు విద్యుత్‌శక్తిని అందించవచ్చు.

డా॥ బైనేట్ మనస్సును ఒక మహావిద్యుత్‌శక్తిగా వర్ణించాడు. ఈ శీర్షికపై ఆయన ఒక పుస్తకం కూడా రచించాడు. "మైండ్ ఎ గ్రేట్ ఎలక్ట్రికల్ ఫోర్స్" (Mind a Great Electrical Force) దీనిలో ఆయన అనేక తథ్యాలను వెల్లడించాడు. ఈ శక్తిని ఒక నిశ్చితమైన దిశలో వినియోగించినట్లయితే చమత్కార ఫలితాలను ప్రాప్తించుకొనవచ్చునని అంటాడు డా॥ బైనేట్.

వేదంలో ఈ శక్తిని 'జ్యోతిషాం జ్యోతి' అని చెప్పబడింది. దీని ప్రచండమైన సామర్థ్యంతోనే భారతీయ యోగులు, ఋషులు ప్రాచీన కాలంలో శూన్యాకాశంలో విస్ఫోటనం చేసి, శక్తిద్వారా సమస్త భూమండలంలోని మానవీయ సమస్యలకు పరిష్కారం లేదా నియంత్రణ చేసేవారు. సింహాన్ని, ఆవును ఒకే రేవులో నీళ్ళు తాగించగల సామర్థ్యం ఈ శక్తికి ఉన్నది.

ఈ సందర్భంలో గీతాకారుడు 6వ అధ్యాయంలో ఒక మహత్తరమైన నిర్దేశమును ఇచ్చాడు.

**ఉద్ధరేదాత్మనాత్మానాం నాత్మానమేవసాదయేత్**
**ఆత్మైవ హ్యాత్మనో భంధుః ఆత్మైవ రిపురాత్మనః**
**భంధురాత్మాత్మనస్తస్య యేనాత్మైవాత్మనా జితః**
**అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్ (భ.గీత. 6/5-6)**

ఆత్మ చేతన మీ మిత్రుడు. మీకు మీరే శత్రువులు. ఆత్మసత్తాను మనస్సు అనే అర్థంలో ఇక్కడ ఉపయోగించబడింది. ఎవరైతే దీనిని జయిస్తారో వ్యక్తి తనకు తానే మిత్రుడు. మనస్సుపై నియంత్రణ లేకపోతే అదే అతని శత్రువులాగా ప్రవర్తిస్తుంది.

మనిషికి ఇటువంటి సాటిలేని శక్తి సంపత్తి ఉన్నప్పటికి దానిపై నియంత్రణ లేకపోవడం వల్ల, వినియోగం చేసుకోలేక పోవడంవల్ల, ఇతరుల నుండి ఆశించేవాడుగా, దీనుడిగా తయారవుతాడు. నియంత్రణ లేని మనస్సు యొక్క శక్తి దురుప యోగం అవుతుంది. నిప్పుతో అన్నం వండుకోవచ్చు లేదా దానితో దేనినైనా తగలపెట్టవచ్చు. విద్యుచ్ఛక్తితో కాంతిని పొందవచ్చు లేదా దానితో ప్రాణానికి ముప్పు కూడా తేవచ్చు. అణుశక్తిని మానవ కళ్యాణం కొరకు ఉపయోగించవచ్చు లేదా దీనితో మారణ హోమం చేయవచ్చు.

ఈ మధ్య లభ్యమైన ప్రమాణాలతో తెలుసుకున్నదేమిటంటే **రోగాలకు మూలకారణం భౌతిక శరీరంలో లేదు, పాడయిపోయిన మనస్సులో ఉన్నది.** అమెరికాలోని రోగుల మనోవిశ్లేషణ చేసిన తరువాత అర్థమయినది ఏమంటే అధికాంశ రోగులు మానసిక దృష్టితో అస్వస్థులే. పొట్టకు సంబంధించిన వ్యాధులు కలవారు నూటికి నూరుపాళ్ళు మనోవికారం కల వ్యక్తులే. డా॥ కైనాన్ అధ్యక్షతలో అమెరికాలోని డాక్టర్లు, మానసిక వైద్యులు అధ్యయనంలో తెలిసిందేమిటంటే జీర్ణకోశం మస్తిష్కంలోని "అటోనిమిక్" (Autonamic) కేంద్రంతో నేరుగా సంబంధం కలిగి ఉన్నది. ఆటోనిమిక్ కేంద్రంలో రెండు భాగాలున్నాయి అవి సింపథటిక్, పేరా సింపథటిక్ (Sympathetic, Para Sympathetic), ఇవి జీర్ణకోశ కార్యకలాపాలు జరుపుతాయి. అన్నాన్ని జీర్ణం చేసే రసాలను ఉత్పన్నం చేస్తాయి. వ్యక్తి యొక్క మనస్సు అస్తవ్యస్తమయితే, ఉద్రేకభరితమయితే అతని జీర్ణ వ్యవస్థపై చెడు ప్రభావం పడుతుంది. అతని పొట్ట ఎప్పుడు గడబిడగానే ఉంటుంది.

డా॥ క్రేన్స్ డాల్‌మోర్, డా॥ రావో కలసి చేసిన పరిశోధనలలో శరీరం, మనస్సు మధ్యగల సంబంధం గురించి విస్తృతమైన

**లోపాలను సరిదిద్దుకోవాలి**

వివరణ ఇచ్చారు. వారేమంటారంటే రోగం అనేది శరీరంలో అసలు పుట్టదు. **మనిషి యొక్క మనస్సు ఆరోగ్యంగా ఉంటే అసలు రోగమే రాదు.** వారు తాము రచించిన పుస్తకంలో రెండు ఫోటోలు కూడా ప్రచురించారు. 70 సంవత్సరాల వయస్సుగల వ్యక్తి ఫోటోలో నుదిటిపై ముడతలే లేవు, ముసలితనపు లక్షణాలు కనిపించనే లేదు. 50 సంవత్సరాలున్న వ్యక్తి ఫోటో చూస్తే రోగంతో బాధపడుతున్నవాడిలాగానే కాక ముసలివాడిలా ఉన్నాడు. లోతుకు పోయిన కళ్ళు, అతుక్కుపోయిన బుగ్గలు, వాడిపోయిన ముఖం రోగిష్టితనానికి చిహ్నాలు కాక మరేమిటి?

ఇవి శరీరంపై మనస్సు యొక్క ప్రభావానికి ఉదాహరణలు. సమాజంలో కూడా రోగం, శోకం, సంహారం, యుద్ధం, పోట్లాటలు, ఆక్రమణలు చెడు భావనల వల్ల, మనస్సు వల్ల, వికృతమైన ఆలోచనలు ఉన్న వ్యక్తుల వల్లనే సంభవిస్తాయి. ఎన్ని యుద్ధాలు, ఎన్ని మారణహోమాలు జరిగాయో వాటన్నింటికి కారణం అటువంటి మనఃస్థితి ఉన్న వ్యక్తులే. రెండవ ప్రపంచ యుద్ధంలో రెండు కోట్ల మంది చనిపోయారు. చెడు భావాలున్న మనస్సు ఎన్ని అనర్థాలు సృష్టిస్తుందో అనే దానికి ఇదే ఉదాహరణ. ఒక వ్యక్తి యొక్క క్రూరత్వం, అహంకారం కారణంగా ప్రపంచంలో లక్షలాది మంది యుద్ధాలలో ప్రాణాలు కోల్పోయారు. ఇంకొక ప్రక్క చక్కని మనస్సుగల సాత్విక మనస్సు యొక్క ప్రభావం చూడదలచుకుంటే మహాత్మాగాంధి, అబ్రహం లింకన్, మార్టిన్ లూథర్ కింగ్ మొదలైన మహాపురుషుల రూపంలో చూడవచ్చు. వీరు ఒంటరిగానే తమ సమాజంలో, ప్రపంచంలో మహత్వ పూర్ణమైన పరివర్తన తీసుకువచ్చారు.

అణుశక్తి యొక్క సదుపయోగం చేయాలా లేక విధ్వంసక ప్రయోగం చేయాలా అనేది నిర్ణయించేది మనఃస్థితియే. ప్రపంచంలో అంతరించిపోతున్న ఇంధనముల తరుణంలో వైజ్ఞానికుల దృష్టి అణుశక్తిని ఉపయోగించుకునే అవకాశాల మీద కేంద్రీకృతమయింది. అణుశక్తి విధ్వంసకర రూపం ఎంత భయానకమైనదో రెండవ ప్రపంచ యుద్ధంలో చూచాము. ఇప్పుడు 4-5 అణుబాంబుల విస్ఫోటనతో మొత్తం పృథ్వి మీద జీవం నశించిపోవడం ఖాయం.

మనస్సుకు ఉన్న శక్తి అణుశక్తి కన్నా ఏ విధంగాను తీసిపోదు, అది ఇంకా సమర్థవంతమైనది, ప్రచండమైనది. ఇతిహాసాలలో, పురాణాలలో వర్ణించబడిన శాప వరదానాలు ఈ మనస్సు యొక్క శక్తి యొక్క విధ్వంసక మరియు సృజన ఉపయోగముల ఉదాహరణలే. ఈ తథ్యాన్ని భారతీయ తత్వవేత్తలు ఎప్పుడో వ్రాశారు. **"మనః మాతస దేవీ చతుర్వర్గ ప్రదాయకమ్"** అంటే మనస్సు యొక్క శక్తిలో ధర్మ, అర్థ, కామ, మోక్షాలను ఇవ్వగలిగే అన్ని శక్తులు ఉన్నాయి.

– అనువాదం: *శ్రీమతి టి. జ్ఞానప్రసూన*

## ఆనందానికి కారణం

*ఒక మహాత్ముడు ఉండేవాడు. ఈయనకు ధర్మంపట్ల అచంచలమైన శ్రద్ధాభక్తులుండేవి, ఎల్లప్పుడు ప్రసన్నంగా దివ్య తేజస్సుతో వెలుగుతూ, ఉల్లాసంగా కనిపించేవాడు. ఇది గమనించి ఒక దొంగల సమూహం ఇతనివద్ద బాగా విలువైన సంపద ఉండి ఉంటుందని, సుఖాన్నిచ్చే సుఖమణి ఎక్కడో దాచి ఉంటాడని భావించారు. ఒక అర్థరాత్రి ఈ మహాత్ముని అపహరించి అరణ్యం మధ్యకుగొనిపోయి "ఓ మహాత్ముడా! నీ వద్ద ఉన్న ఆ అమూల్యమైన మణిని వెంటనే మాకు అప్పగించు లేదా నిన్ను నిర్దాక్షిణ్యంగా చంపేస్తాం" అని బెదిరిస్తారు. ఆ మాటలకు మహాత్ముడు చిరునవ్వుతో "నాయనలారా! ఆ మణిని నేను మీవంటి దొంగలకు భయపడి భూమిలో దాచిపెట్టాను. సరిగ్గా స్పష్టంగా చెప్పలేను గానీ ఇంచుమించుగ ఆ ప్రదేశాన్ని మీకు చూపిస్తాను, మీలో ఎవ్వరైనా చంద్రుని ఛాయ మీద పడుతూ ఉండగా మాత్రమే లోతుగా త్రవ్వినట్లయితే ఆ మణి లభిస్తుందని చెప్పి" ఆ ప్రదేశాన్ని చూపిస్తాడు. దొంగలందరు త్రవ్వకాలు సాగించారు. కాస్త త్రవ్వేసరికి చంద్రుని ఛాయ ప్రక్కకు తొలగిపోతూ ఉండేది. చంద్రుని ఛాయకు అనుగుణంగా అనేక గుంటలు త్రవ్వి త్రవ్వి దొంగలు అలిసిపోయారేగాని, మణి మాత్రం లభించలేదు. చెట్టు క్రింద హాయిగా విశ్రమించిన మహాత్ముడు వారిని చూచి జాలిపడి, "నాయనలారా! ఆ మణి మన నివాసం (దేహం)లోనే ఉన్నది. దానిని త్రవ్వి దర్శించండి. ధార్మికమైన ఆలోచనలు మనిషికి ఆనందాన్ని కలిగిస్తాయి. వ్యక్తి సదా తనను తాను త్రవ్వుకుంటూ జీవించగలిగితే అంతా ఆనందమే. ఆనందంగా జీవించగల కళ భగవంతుడు అందరికి సమంగానే నేర్పి పంపించాడు. నా వద్ద ఉన్న సుఖమణి ఇదే. మీరు కూడా మీ దృష్టి కోణాన్ని మార్చుకొని ఆనందంగా జీవించడం నేర్చుకోండి" అని పలుకుతాడు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**అజ్ఞానం నశించినప్పుడు విజ్ఞానం ఉదయిస్తుంది**

సూర్యసాధనా సంవత్సర ప్రత్యేకం

# సూర్యుని క్షమత

సూర్యుడు భూమి కన్నా 3,30,000 రెట్లు పెద్ద. సూర్యునికి అతి దగ్గరగా బుధగ్రహముంది. దీని వ్యాసం 3010 మైళ్ళు. కుజ గ్రహం బుధ గ్రహం కన్నా కొంచెము పెద్దది, వ్యాసం 4200 మైళ్ళు. దీనితో పోల్చితే భూమి పెద్దది. దీని వ్యాసం 7913 మైళ్ళు. ఇది శుక్రగ్రహంతో సమానంగా ఉంటుందని చెప్తారు. అన్నిటికంటే పెద్దగ్రహం బృహస్పతి. దీని వ్యాసం 142984 మైళ్ళు కలిగి భూమి కంటే 11 రెట్లు పెద్దది. వీటి తరువాత శనిగ్రహం. వ్యాసం 120536 మైళ్ళు.

పైన పేర్కొన్న గ్రహాలుకాక క్రొత్తగా కనుగొన్నవి యురేనస్, నెప్ట్యూన్, ప్లూటో గ్రహాలు. ఈ ప్లూటో గ్రహం సూర్యుని నుండి చాలా దూరంలో ఉండి తన చుట్టూ తాను తిరగటానికి 6 రోజులు సూర్యుని చుట్టూ తిరుగుటకు 248 సంవత్సరాలు పడుతుంది.

మన సూర్యుడు ఆకాశగంగ గర్భంలో ఉండి ప్రతి సెకనుకు 200 కిలోమీటర్లు వేగంతో తన నిర్ధారిత కక్ష్యలో తిరుగుతూ ఉంటాడు.

బ్రిటన్‌లోని విశ్వవిఖ్యాత భౌతిక శాస్త్రవేత్త డా॥ హెచ్.వి. వన్‌వూర్ తెల్పినదేమనగా సూర్యుడు ఒక రోజులో 9 సార్లు కంపిస్తూ ఉంటాడు. ఈ కంపనలు ఒక్కోసారి 160 నిముషాల వరకు ఉంటుంది. సూర్యునిలో హైడ్రోజన్ ఇంధన భట్టీ (furnace) ఎప్పుడు కుతకుత ఉడుకుతూ ఉంటుందని తెలుస్తుంది. సూర్యుడు ఎంతో విశాలంగా ఉండి 10 లక్షల నూరుకోట్ల టన్నుల హైడ్రోజన్ ఇంధనాన్ని ఒక సెకండు సమయంలో ఊది పారేస్తాడు. ఇంత ఆహారం తింటూ కూడా సూర్యదేవునకు కడుపు నిండదు. ఆయన ఆకలి తీరదు. ఇంత తినుటవల్ల, తగ్గిపోతున్న ఆహారం కారణంగా (ఆయన) సూర్యగ్రహం చల్లబడిపోతుందని శాస్త్రవేత్తలంటున్నారు.

సూర్యుడు భౌతిక దృష్టితోనే కాక ఆధ్యాత్మిక దృష్టిలో కూడా ఒక ప్రత్యేక స్థానంలో నిలబడి ఉన్నాడు. సూర్యుడిని సవితాదేవత ప్రాణ ఊర్జాకి ఉత్పత్తి స్థానమని చెప్పుట జరిగింది. ఈ రోజుల్లో బ్రహ్మ, విష్ణు, శివ, రామ, కృష్ణ, దుర్గ, గణేశ్, హనుమాన్ మొదలైన దేవతలు జన బాహుళ్యంలో ఉన్నారు. సూర్య దేవాలయాలు ఇతర దేవతల దేవాలయాల కంటే చాలా తక్కువగానే ఉన్నాయి. అయినప్పటికి పురాతన కాలంలోని దేవాలయాలను గమనించి నప్పుడు సూర్యుడినే ప్రముఖ దేవతగా స్వీకరించి ఆయన ఉపాసనే ఎక్కువగా చేసుకొనేవారని తెలుస్తుంది. ఆయనకు అనేక దేవాలయాలు నిర్మించుట కూడా జరిగిందని, దాదాపు 500 పురాతన మందిరాలలో ఆయనదే (సూర్యుని) ప్రముఖస్థానంగా ఉండేదని పురాతన చారిత్రక సత్యాల ద్వారా తెలుస్తుంది.

'గోపాడి' (గ్వాలియర్) క్షేత్రంలో ఒక పురాతన సూర్య మందిరం ఉండేది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకొంది. శాంకలో (సియోల్‌కోటా) సూర్యమందిరం గురించి హ్యూయన్‌సాంగ్ అనే చైనా యాత్రికుడు తన గ్రంథంలో వ్రాశాడు. 'మోఢేరా' (గుజరాత్), కోణార్క్ (ఒడిశా), ఖజురహో, తిరుపతి బాలాజీ (ఆంధ్రప్రదేశ్) మడఖేర (ఉత్తరప్రదేశ్) మొదలైన చోట్ల పురాతన సూర్య మందిరాలన్నీ జీర్ణావస్థకి చేరుకొన్నప్పటికి ఆ శిథిల మందిరాల ద్వారా భారతదేశంలో ఒకప్పుడు సూర్య ఉపాసన ప్రధానంగా జరిగేదని తెలుస్తుంది. వృత్తాకార సూర్యుణ్ణి 'బాలాజి' అంటారు. ఈ పేరు మీదే మధ్య యుగంలో సూర్య ఉపాసన జరిగేది.

కుషాణుల కాలంలో సూర్యోపాసన ఆసియా ఖండంలోని అధిక ప్రాంతంలో చేసేవారని తేలింది. ఈజిప్ట్, ఇరాన్ వంటి దేశాలలో ఇస్లాం మతం రాకముందు సూర్య సాంప్రదాయమే ఆధిపత్యం వహించేది. ఆనాటి ప్రతిమలు శిలా శాసనాల ఆధారంగా ఈ ప్రాంతాలలో సూర్యదేవతకే ప్రాముఖ్యత ఉండేదని తెలుస్తుంది.

ఋగ్వేదం 1-125-1 లో సూర్యుడిని జగతికి ఆత్మ అని చెప్పబడింది. ఈ భూమి మీద ఉన్న చేతనత్వాలన్నిటికి ఉద్గమ స్థానం (ఉత్పత్తి స్థానం) సూర్యుడే! దానిలో మనకు వేడి, వెలుతురే కాక చేతనత్వానికి సంబంధించినవి కూడా అందుతాయి. ప్రఖ్యాత గాయత్రీమంత్రం సూర్య ఉపాసన మంత్రము. ఈ మంత్రాధిదేవత 'సవిత'! సవితాలోని 'భర్గ'ను యాచించడం జరుగుతుంది. ఆ భర్గకు ప్రగతిశీల ప్రేరణ ఇవ్వమనే ప్రార్థన ఉన్నది.

12 నెలల కారణంగా సూర్యుణ్ణి 'ద్వాదశాదిత్యుడని' అంటారు. ఆరు (6) ఋతువులు ఆయన భార్యలుగా చెప్పుట జరిగింది. 'ఉష' ని ఆయన ప్రేయసిగా, సంజ్ఞను లేక సంధ్యను పట్టపురాణి

**జీవితాశయాలు ఉత్తమంగా ఉండాలి**

రూపంగా చెప్తారు. ఈ విధంగా చెప్పుటలో సూర్యునిలోని మూల భూత శక్తిని అనేక ప్రయోజనాలు పొందుటకు వినియోగించు కొంటున్నందున ఆ విధంగా చెప్పవలసి వచ్చింది.

శ్రీరాముడిని సూర్యవంశజునిగా భావిస్తారు. కుంతీదేవి సూర్య ఉపాసన ఆధారంతో కర్ణునికి జన్మనిచ్చింది. కాబట్టి వీరు కూడా సూర్య వంశీయులే! చంద్రుడు సూర్యుని నుండి ప్రకాశం పొందుతున్నాడు. కాబట్టి చంద్ర వంశీయులు కూడా సూర్యోపాసనను అనురక్తితో చేస్తూ ఉంటారు.

హిందూ దేవతల సంఖ్య పెరిగిపోవటం చూస్తూంటే ఆశ్చర్యమేస్తుంది. ఆదికాలం నుండి సూర్యుడినే ఉపాసన చేసేవారు. ప్రతి నిత్యం దర్శనం ఇచ్చే ప్రత్యక్ష దేవత సూర్యుడు మాత్రమే! ఆయన నుండి పొందే వేడిమి వెలుగేగాక జీవులు జీవించటానికి కావలసిన ఎన్నో ప్రయోజనాలు పొందటానికి కారకుడని, అర్థం చేసుకోవాలి. అలాగే ఆయన గొప్ప శక్తులను కూడా అర్థం చేసుకోగలగాలి. చంద్రుని వెన్నెల, చల్లదనానికి కారణం సూర్యుని వెలుగేనని గ్రహించిన ప్రజలు, సూర్య భగవానునికి అధిక శ్రద్ధాళువులుగా మారిపోయారు. ప్రతి ఉదయం, సాయంకాలాలలో స్వాగతం వీడ్కోలు కొరకు సంధ్యా వందనము చేయుట నియమముగా మారింది. దీని కొరకు సూర్య ఉపాసన సరళమైన, భావపూరితమైన విధానాన్ని ఆచరించుట జరిగింది. అభ్యర్థన సేవగా సూర్య అర్ఘ్యం ఇచ్చుట కొరకు జలాన్ని ఉపయోగించే విధానం పరంపరగా వస్తుంది. ప్రతినిత్యం ఈ కార్యం జరుపుట ఎంతో సులభమైన విధానం.

ఇతర దేవీ దేవతలందరు సూర్యపరివారంగానే భావించుట జరిగింది. సప్తవర్ణ, సప్త అశ్వ వర్ణన సూర్యునితో విడదీయరాని అంగంగా భావించారు. అందుచేత వివిధ రకాల సూర్య స్థాపనలతో పాటు వివిధ రకాల ఆరాధన విధుల వ్యవస్థ రూపుదిద్దు కోవటం జరిగింది. వైదిక దేవతలలో ఏడు సంఖ్య ప్రముఖమైంది. ఋషులలో గొప్పవారిని సప్తఋషులుగా పిలుచుట జరిగింది. సప్తలోకాలు, సప్తమహా ద్వీపాలు వర్ణనలు కూడా సూర్యవిజ్ఞాన పరంగా వెలుగు చూసే విషయాలుగా ఆవిర్భవించుట జరిగింది. మన శరీరంలో కూడా సప్తధాతువుల విషయం మనందరకు బాగానే తెలుసు. సూక్ష్మశరీరంలో షట్ చక్రాలు వాటి అధిపతిగా సహస్రార చక్రంతో కలిపి ఏడు చక్రాలుగా ఉన్నాయి. రత్నాలన్నిటిలో ఏడు రత్నాలు మాత్రమే ప్రముఖమైనవి. సప్త స్వరాలన్నీ కలసి సూర్యుని సప్త అశ్వాలతో కూడి ఉంటాయి.

ఆధ్యాత్మికత, వైజ్ఞానికత రెండూ చెప్పేదేమనగా చేతన మరియు ప్రకృతిలో గల సప్తధారల ప్రవాహాలు సూర్యునితో సంబంధం కలిగి ఉన్నాయి. పురాణాలలో వీటిని భగవంతుని దర్బారులో సప్త సభాసదులుగా చెప్పుట జరిగింది. ఒక్కో చోట సప్త భార్యలుగా కూడా వర్ణించుట జరిగింది. యోగశాస్త్రంలో సప్తనాడుల వర్ణన ఉన్నది. అవి రక్త ప్రవాహపు ధమనులలో చలనం కలిగించే, ఆరోగ్యంగా నిలిపే విభూతులుగా భావించాలి. రిద్ధి-సిద్ధిల పుట్టుక ఇదేనని నమ్ముతూ, మానవ జీవితానికి స్థిరత్వంతోపాటు ప్రగతి సాధించేదిశగా వీటి ద్వారా లభించే వరాలు, దైవీ అనుగ్రహాలుగా భావించుట జరిగింది. కాలాన్ని లెక్కించే విధానంలో వారం రోజులకు (సప్తాహం) గొప్ప విలువ ఉంది. జ్యోతిష్య విజ్ఞానపు పునాది, సప్తాహం మీదే ఆధారపడి ముందుకు పోగలుగుతుంది.

ఋగ్వేదం 1-264-8 లో పృథ్వి సూర్యునకు పత్ని వంటిదని వర్ణించింది. ఆమె ఆయనకు తన సర్వస్వాన్ని సమర్పించుకొంది. మేఘాల ద్వారా ఆమె గర్భం ధరిస్తుందని, దాని ఫల స్వరూపంగా ప్రాణికోటికి జన్మనిచ్చి, వాటిని రక్షించే బాధ్యత తీసుకొంటుందనే వర్ణన వేదంలో ఉన్నది.

ఇతిహాసంలో దేవాలయ నిర్మాణం గురించి 12 పురాణాలలో సాంబ అనే రాజు మూడు సూర్య మందిరాలను ఉదయగిరి, సాంబపూర్‌లలో స్థాపించి, వీటిలో వరుసగా ప్రాతఃకాలం-మధ్యాహ్నం-సాయకాలపు అస్తమయ కాలాల్లో ప్రతిమలను ప్రతిష్టించాడు. చైనా దేశపు తీర్థయాత్రికుడు 'హ్యూయాన్‌సాంగ్' తన యాత్రా గ్రంథంలో సాంబపూర్‌లోని సూర్య దేవాలయంలో ప్రతిష్టించిన స్వర్ణ విగ్రహాన్ని గురించి వర్ణించాడు. డాన్‌సన్ తన పుస్తకం 'హిస్టరీ ఆఫ్ ఇండియా'లో ఈ స్వర్ణ ప్రతిమ 230 మణుగుల బంగారంతో తయారుచేసినట్లు క్రీ.శ.712లో ముస్లిముల దండయాత్రలో ఆ విగ్రహాన్ని నాశనం చేసి బంగారాన్ని దోచుకుపోయినట్లు వ్రాశాడు.

వైదిక దేవతలలో ఇంద్ర, ఆర్యమ, పూషా, మిత్ర, వరుణ, విష్ణు, త్వష్ట మొదలైనవారి వర్ణన వేదాలలో ఉన్నది. ఈ నామాలన్నీ సూర్యుని సంబోధిస్తున్న వివిధ దేవతా స్వరూప నామాలు. ఈ ప్రకారం వేదాలలో కనిపించే దేవతలందరు అంతిమంగా ఒకే బ్రహ్మ అనే భావనను సూచిస్తూ 'బహుధావదన్తి' అనేది వేదసూక్తిలో కలిసిపోయింది.

సవితా ఉపాసనలో సూర్య స్థాపనతోబాటు సూర్య అర్ఘ్యదానంకు కూడా విశేషమైన మహత్తు కలిగి ఉన్నది. సూర్యునికి

**ఓటమికి భయపడవద్దు - గెలుపుకి గర్వపడవద్దు**

ఎదురుగా నిలబడి, రెండు చేతులు పైకి ఎత్తి గాయత్రీ మంత్రజపం చేస్తూ మూడు దోసిళ్ళ నీటిని సూర్యునకు అర్ఘ్యాన్ని సమర్పించాలి. స్కంధ పురాణంలో 4-9-46 లో ఈవిధంగా ఉంది "ఎవరైతే గాయత్రీ మంత్రంలో అభిమంత్రించిన జలాన్ని మూడుసార్లు సూర్య సమక్షంలో అర్ఘ్య ప్రదానం చేస్తారో, వారు మూడు లోకాల మేలు కొరకు ఎంతో చేసిన వారుగా కీర్తింపబడగలరు". మూడు అంజలుల అర్ఘ్య దానం మూడు లోకాల మేలు కొరకు చేసినట్లు అవుతుంది. అలాంటి అర్ఘ్యదానం గాయత్రీ మంత్రంతో చేయాలి.

**శ్లో॥ గాయత్రిమంత్రంతోయాధథ్య దత్తం యేనాంజలిత్రయం।**
**కాలే సవిత్రే కిం న స్యాత్తేన దత్తం జగత్ర్యయం ॥**

స్కంధ పురాణం కాశిఖండం పూర్వార్థం 9-54 మంత్రంలో సూర్యుని, గాయత్రిని నోటితో ఉచ్చరించబడిన పాటగా నాట్యంగా, ఉపమానం చెప్పుట జరిగింది. ఈ రెంటి కలయికతో ఏకాత్మ సిద్ధి ప్రాప్తిస్తుంది.

**శ్లో॥ వాచ్యవాచకకమ్సవంధో గాయత్ర్యాః సవితు ద్వియోః ।**
**వాచ్యోఽసౌసవితా సాక్షాద్ గాయత్రీ వాచికా పరా ॥**

గాయత్రీ ఉపాసనకు పరమగతి సూర్యలోకాన్ని పొందగల భాగ్యం ప్రాప్తించగలదని భావిస్తారు. పద్మ పురాణంలో "జితేంద్రుడు బ్రహ్మపరాయణుడు గాయత్రీ ఉపాసన చేసినట్లయితే, అతడు జీవనముక్తి పొంది సూర్యలోకంలోని పరమ పదాన్ని ప్రాప్తించు కొంటాడు" అని వర్ణించుట జరిగింది.

**శ్లో॥ తాం దైవీముపతిష్టంతె బ్రాహ్మణా యే జితేంద్రియాః ।**
**సూర్యలోకం తె ప్రయాన్తి క్రమాన్ముక్తిం చ పార్థివః ॥**

**సృతి వచనం "యః సంధ్యానుపాసతే బ్రహ్మైఽదుపాసతే**

అర్థం: ఎవరు సంధ్యోపాసన చేస్తారో అది బ్రహ్మ ఉపాసనే అవుతుంది. పరబ్రహ్మ అనగా ఏమి? దీనికి ఛాందోగ్యపనిషత్తులో "ఆదిత్యో బ్రహ్మ" అంటే ఆ బ్రహ్మకు సంకేతము ఆదిత్యుడు, తైత్తిరీయ అరణ్యకంలో కూడా ఇదే విధమైన అర్థం బలం చేకూర్చింది. దాని 2-2 మంత్రంలో "అసావాదిత్యో బ్రహ్మ" అంటే ఈ ఆదిత్యుడే బ్రహ్మ.

గాయత్రిని వినియోగంలో దాని అధిష్ఠాన దేవత సవితగా చెప్పుట జరిగింది ఈ సవిత ఆదిత్యుడు ఒక్కటే. శతపథ బ్రాహ్మణంలో 9-3-1-20 మంత్రంలో "అసౌవాః ఆదిత్యోదేవః సవితా" అని ఉన్నది. అనగా ఈ ఆదిత్యుడు, సూర్యుడే సవితగా ఉన్నాడు. దీని నిర్ధారణకుగాను దైవత కాండం 4-31 మంత్రంలో కూడా వివరణ దొరుకుతుంది. దానిలో **"ఆదిత్యోఽపి-సవితై వోచ్యితే"** అనగా ఆదిత్యుడినే సవితా అంటారు అని ఉన్నది.

అన్ని వైజ్ఞానిక ప్రమాణాలు, ఆప్త వచనాలు సవిత గొప్పదనం గురించే చెప్పాయి. మహాప్రజ్ఞ గాయత్రీ ఉపాసన సవితా దేవత ఆరాధనగా చేయుట జరుగుతుంది. దాని దివ్య ప్రకాశంలో తనకే కాక సృష్టిలోని అన్ని ప్రాణులకు జీవన చేతన, సత్ ప్రేరణ ప్రాప్తించగల ప్రార్థన చేయబడుతుంది. మనస్సును బయట ప్రపంచం నుండి వెనుకకు మరల్చి, అంతరంగంలోకి అంతర్ముఖంగా మార్చగల ప్రతివారు సూర్యభగవానుని దివ్య విభూతుల ద్వారా అనేక లాభాలను తప్పక పొందవచ్చు.

*- అఖండజ్యోతి, ఫిబ్రవరి 1984*
*అనువాదం : జి. చెన్నకేశవరావు*

## శ్రీ గాయత్రీ శతకం

**83.** ***మూడు పాదముల్ కలిగిన పుణ్యగీతి***
***మూడు వ్యాహృతుల్ ముందున్న పూర్ణసూక్తి***
***విశ్వమున కధిష్ఠాత్రియై ప్రేరణగును***
***విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత***

*తా:- గాయత్రీ మంత్రం మూడు పాదాలతో ఉంటుంది. అందుకే త్రిపద అంటారు. ఆ విధముగా ఆ మంత్రము పుణ్యాన్నిచ్చే గీతమైంది. అలాగే ప్రారంభంలో గల భూః, భువః, స్వః అనే అక్షరాలను వ్యాహృతులంటారు. ఇట్టి మంత్రమును నిత్యం స్మరిస్తే ప్రేరణ కలిగిస్తుంది మంత్రమాత.*

**84.** ***ప్రబల ఆత్మసుజ్ఞానమే బ్రహ్మవిద్య***
***అదియె వ్యవహరింపబడు గాయత్రి యనగ***
***ఆ మహామంత్ర మొసగు ననల్పబుద్ధి***
***విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత***

*తా:- ప్రబలమైన ఆత్మ విజ్ఞానమే బ్రహ్మ విద్యయగును. అదే గాయత్రిగా వ్యవహరింపబడును. అటువంటి మహా మంత్రమును జపిస్తే అత్యధికమైన బుద్ధి వికాసమును కలిగిస్తుంది గాయత్రీమాత.*

*రచన : సహజ కవి, సాహిత్య రత్న,*
*శతక చతురానన, పద్య కవితాసుధానిధి*
*శ్రీ అయినాల మల్లేశ్వర రావు*

**మంచి పనులు చేయడానికి ముహూర్తం అవసరం లేదు**

మనం - మన ఆరోగ్యం

# మంచిగా ఆలోచిస్తే రోగాలే రావు

మన మెదడులో రెండు భాగాలుంటాయని వింటేనే గాబరా పుడుతుంది. మస్తిష్క విఖండన (split brain) అనే రుగ్మతకి గురైన వారికే దీని బాధ తెలుస్తుంది. మన మెదడు రెండు భాగాలతో తయారై ఉంటుందని వైజ్ఞానికులు చెప్తారు, అవి ఎడమ హెమిస్ఫియర్, కుడి హెమిస్ఫియర్. ఈ రెండు భాగాలు కార్పస్ కలోసమ్‌తో జోడించబడి ఉంటాయి. కార్పస్ కలోసమ్ (corpus callosam) అనే నాడీ వ్యవస్థ ఈ రెండిటిని సమన్వయ పరుస్తుంది, పరస్పర సమాచారాన్ని అందిస్తుంది. శరీరం యొక్క కుడి భాగమును ఎడమ హెమిస్ఫియర్ నియంత్రిస్తుంది. ఎడమ భాగమును కుడి హెమిస్ఫియర్ నియంత్రిస్తుంది. సవ్యమైన శరీర సంచాలనకు ఈ రెండు హెమిస్ఫియర్ల సమన్వయం చాలా అవసరం. ఈ రెండు భాగాలను కలిపే కార్పస్ కలోసమ్ పాడైతే రెండు హెమిస్ఫియర్ల మధ్య సమన్వయం దెబ్బతింటుంది. దాని వల్ల ద్వివిధ వ్యక్తిత్వం (multiple personality) తయారవుతుంది. ఇదొక రోగం, దీన్ని సీజోఫ్రేనియా (schizophrenia) అంటారు. గ్రీకు భాషనుండి పుట్టిన ఈ పదానికి అర్థం మస్తిష్క విభజన.

భ్రమ, సందేహం, అనుమానం, మానసిక అసంతులన, ఒత్తిడి, ఉత్తేజం, క్షోభ, దురాలోచనల వల్ల ఈ రోగం వస్తుంది. శరీరానికి, మనస్సుకు చాలా తేడా ఉంది. శరీరం బాహ్యంగా కనిపిస్తుంది, మనస్సు అదృశ్యమైనదైనా చాలా శక్తివంతమైనది. ఇంతటి శక్తివంతమైన మనస్సును అనుమానాల, సందేహాల పరిధిలో కట్టివేస్తే అదుపుతప్పిన గుర్రం లాగా వదిలేస్తే, మానసిక భ్రమ అనే రోగం వృద్ధి చెందుతుంది. మానసిక భ్రమలు రెండు రకాలుగా ఉంటాయి. మొదటిది ఆధారం లేని సందేహం, రెండవది అవచైతన్యంతో(ఉపచైతన్యం) ప్రేరేపించబడ్డ సందేహం. ఏదైనా రోగం గురించి చదివినా, విన్నా ఆ రోగ లక్షణాలు తనలో కూడా పుట్టుకొస్తున్నాయనే భయము, ఊహ మొదటి కోవకు చెందినవి. నేడు ప్రపంచంలో చాలా మంది అనుమానం అనే వలలో చిక్కుకున్న రోగగ్రస్తులే. స్పష్టమైన తథ్యాలు వెలవడుతున్నా, ఆ కారణాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉండడం, అచేతన ప్రేరిత సందేహం అవుతుంది. ఉదా: ఒక కంపెనీలోని ఉద్యోగిని హటాత్తుగా పనిలోంచి తీసేసారు. అందుకు కారణం మేనేజర్ యొక్క నిర్లక్ష్యం, ఉద్యోగి మీద మంచి అభిప్రాయం లేకపోవడం అయినప్పటికి ఆ ఉద్యోగి దాన్ని గమనించకుండా, అశ్రద్ధ చేయడం ఈ కోవకి వస్తుంది.

ఈ రెండు రకాల సందేహాలు ద్వి మస్తిష్క విఖండనకు ముఖ్య భూమికని నిర్వహిస్తాయి. **పిల్లలను మానసికంగా కాని, శారీరికంగా కాని హింసిస్తే వారు రోగాలకు గురవుతారు.** ఫ్రాంక్.డబ్లూ. పుట్నెమ్ తన ఇ.ఇ.జి ద్వారా తీసుకున్న గ్రాఫ్‌ను పరిశీలించి ద్వివిధ వ్యక్తిత్వం కలవారి మస్తిష్కంలోని విద్యుత్ ప్రవాహం సామాన్యులకన్నా ఎక్కువగా ఉంటుంది అని తేల్చారు.

మానవ మనో విశేషజ్ఞుల ప్రకారం ప్రతి వ్యక్తిలోను స్వతంత్రంగా పని చేసే ఒక కేంద్రం ఉంటుంది, దాన్నే 'సబ్ సిస్టమ్' అంటారు. మర్చిపోయిన విషయాలు అకస్మాత్తుగా గుర్తుకురావడం, ఏదైనా సమస్యకు తక్షణం సమాధానం దొరకడం, కలల ద్వారా అనేక తథ్యాలు అవగతమవడం ఇటువంటివన్నీ ఈ అచేతన సబ్ సిస్టమ్ వల్లనే సాధ్యమవుతుంది. కానీ ఆందోళన, దుఃఖంలాంటి వాటి కారణంగా ఈ సబ్ సిస్టమ్ అనేక మస్తిష్కీయ రోగాలకు జన్మనిస్తుంది. అలాంటప్పుడు ఈ సబ్ సిస్టమ్ పని చేయడం మానేసి, జరగాల్సిన దానికి వ్యతిరేకంగా జరుగుతుంది. అంటే ఉన్నట్టుండి అప్పటి విషయాలే మర్చిపోవడం లాంటిది.

అసలు మన మెదడులోని రెండు సగభాగాల గురించి ఊహించనే లేము అంటారు దెకార్తె. మనిషి ఎప్పటికి 'నేను' అనే ఆలోచనతో ముడిపడి ఉంటాడు. ఆలోచనల్లోనే పూర్ణత్వం ఉంది. **మస్తిష్కం అనే సిస్టమ్ సువ్యవస్థితంగా ఉండాలంటే అనుమానాలు, ఒత్తిడి నుండి బయటపడాలి.** అందరి మనసులు ఒకేలాగా ఉంటాయని అని ష్రొడింగర్ అనే మరో వైజ్ఞానికుడు పేర్కొన్నాడు. బ్రహ్మాండం మొత్తం ఒక విరాట్ పురుషుని మస్తిష్కంతో నిర్వహించబడుతోంది. కాబట్టి ఆ విరాట్ సత్తాలో తాను ఒక చిన్న భాగమని మనిషి అర్థం చేసుకుని, తనని తాను ఆ సత్తాతో జోడించుకుని తన వ్యావహారిక జీవితంలో సుఖంగా ఉండడం కోసం ఆలోచనల్లో వికృతిని తొలగించుకోవాలి. ఇలా చేయలేకపోవడం వల్లనే చాలా రోగాలు వస్తున్నాయి.

న్యూయార్క్ నగరంలో వెలువడే విశ్వప్రసిద్ధ పత్రిక 'న్యూస్ వీక్' (20 నవంబర్ 1995) సంచికలో 'భ్రమ ఒక రోగం' అనే శీర్షికతో ఒక వ్యాసం ప్రచురించబడింది. అందులో న్యూరో విశేషజ్ఞుడు డేవిడ్ సిల్వర్ స్వీంగ్, మోర్ట్ బుశమ్ చేసిన ప్రయోగాల గురించి ప్రచురించారు. లండన్‌లోని హేంప్‌సర్‌స్మిత్ ఆస్పత్రిలో పని చేసే న్యూరో సర్జన్ డేవిడ్ సిల్వర్ స్వింగ్ ప్రకారం భ్రమ వల్ల మెదడులో తీవ్ర సంవేగాత్మక స్థితి ఏర్పడి సీజోఫెర్నియా అనే రోగం పుట్టుకొస్తుంది. దీనివల్ల మెదడులోని థైలామస్,

**స్నేహం వల్ల పోయేది ఏమి లేదు - వైరం వల్ల సాధించేదేమి లేదు**

హిప్పోకాంపస్, స్ట్రైటం పై ప్రభావం ఉంటుంది. సిల్వర్ స్వీంగ్ పి.ఇ.టి (పోజిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీ) ద్వారా 23 ఏళ్ళ వయసున్న ఆరుగురి మీద ప్రయోగాలు చేసారు. ఈ పి.ఇ.టి ద్వారా మెదడుని అధ్యయనం చేయవచ్చు. ప్రయోగంలో భాగంగా సామాన్యమైన ఆలోచనల మరియు సందేహాత్మకమైన ఆలోచనల (doubtful thougts) మీద ప్రయోగం చేయడం జరిగింది. పి.ఇ.టి గ్రాఫ్‌ను పరిశీలిస్తే సందేహకరమైన ఆలోచనల క్రమం (doubts) నడుస్తున్నప్పుడు మెదడులో రక్తప్రసరణ వేగం పెరిగినట్లు తేలింది. మౌంట్ సీనాయ్ స్కూల్ ఆఫ్ మెడిసెన్ లో పనిచేసే న్యూరాలజిస్ట్ మోర్ట్ బుషమ్ ప్రకారం భ్రమ వల్ల ప్రి ఫ్రంటల్ లోబ్ (pre frontal lobe) పాడయ్యే అవకాశాలు చాలా స్పష్టంగా ఉంటాయన్నారు, తద్వారా జ్ఞాపక శక్తి హరించబడుతుంది.

వాషింగ్టన్‌లో వెలువడే ప్రముఖ పత్రిక నేషనల్ జియోగ్రఫీ (జూన్ 1995) లో డి.సి.వీన్‌వర్గ్ చేసిన ఒక పరిశోధనా పత్రం ప్రచురించబడింది. ఆయన వాషింగ్టన్‌లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ లో ప్రముఖ న్యూరాలజిస్ట్. **సందేహం, భ్రమ వల్లనే సిజోఫ్రేనియా వస్తుందని ఆయన కనుక్కున్నారు.** స్మృతికి కేంద్రం హిప్పోకాంపస్. ఇది నిరాశ, నిస్పృహల్లో స్మృతిని కోల్పోతుంది. ఈ పత్రిక ప్రకారం అమెరికాలోని 40 శాతం సిజోఫ్రేనియా రోగులు అశ్రద్ధకి గురై ఉన్నారు. మెదడులో 'మోనో ఎమీనో ఆక్సీడస్ ఎ' అనే ఒక ఎంజైమ్ (enzyme) స్రవిస్తూ ఉంటుంది. దీని వల్ల రెండు హెమిస్ఫియర్ల మధ్య సంతులన, క్రియాశీలత సక్రమంగా సాగుతుంది. ఒత్తిడి, ఉత్తేజం కలిగినప్పుడు ఇది స్రవించడం ఆగిపోతుంది. ఈ పరిస్థితి పరాకాష్టకు చేరితే బ్రెయిన్ క్యాన్సర్‌కి కూడా దారి తీస్తుంది.

నోబుల్ పురస్కారాన్ని అందుకున్న ఫ్రాంసిస్ కిక్ ఈ విషయంపై చేసిన ప్రయోగాల విశేషాలు ఇవి – సుఖము, దుఃఖము, స్మృతి, ఆశ, అనుభూతి, స్వతంత్ర కోరిక ఇవన్నీ నరాల యొక్క కణాలపై ఆధారపడి ఉంటాయి. ఆశ, ఉత్సాహం, ప్రేమ, కణాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. కేండర్స్ పర్ట్ అనే ఆయన ప్రేమ, సానుభూతి మీద ప్రయోగాలు చేసారు. ప్రేమ పూర్వకంగా వ్యవహరించినప్పుడు పెప్టిక్ ఎంజైమ్ (peptic enzyme) ఎక్కువగా ఉత్పన్నమవుతుంది అంటున్నారు. ఈ ఎంజైమ్ మనిషిలో రోగనిరోధక శక్తి పెరగడానికి, మెదడు ప్రశాంతంగా ఉండడానికి ఉపయోగపడుతుంది.

**ప్రేమపూర్వకమైన సజల భావనలు, మంచి ఆలోచనలతోనే మెదడు ఆరోగ్యంగా ఉంటుంది.** అప్పుడే సరళమైన, ఆనంద కరమైన జీవితం అనే కోరిక నెరవేరుతుంది. ఓల్డు టెస్టమెంట్ (old testament) ప్రకారం ప్రేమతో నిండిన హృదయమే ఎప్పటికి మెదడును ప్రశాంతంగా, మెరుగ్గా ఉంచుతుంది. 4000 ఏళ్ళనాటి చైనా చికిత్సా విధానం కూడా ఈ విషయాన్ని ఒప్పుకుంటుంది. **'తప్పుగా ఆలోచించకండి, తప్పు జరుగుతుంది' అని వైజ్ఞానికంగా నిరూపించిన మొదటి వ్యక్తి దెకార్తె. నీవు ఈశ్వరునితో సమానమైన శక్తివంతుడవని నమ్ము, చక్కటి ఆలోచనలతో మస్తిష్కాన్ని నింపుకో అంటారు ఆయన.** ఆలోచన, వ్యవహారాలు పరస్పరం అన్యోన్యాశ్రితాలు. అత్యుత్తమ ఆలోచనలుంటే సందేహాలు, అనుమానాలు వాటంతటవే తొలగిపోతాయి. 'ఎ ట్రీటీజ్ ఆఫ్ హ్యూమన్ నేచర్' అనే పుస్తకంలో డేవిడ్ హ్యూమ్ మనస్సు గురించిన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. మనస్సు ఆధారంగానే శరీరం ఉంటుంది. మనస్సు యొక్క సమన్వయం (conscious of unity) ద్వారా మస్తిష్కీయ విఖండన (split brain) అనే పీడను వదిలించుకోవచ్చు.

బ్రహ్మాండీయ చైతన్యంలో మనిషి తనని తాను లయం చేసుకోవచ్చా అని ఎవరైనా అడగచ్చు. రోమ్యా రోలాం అడిగిన ఈ ప్రశ్నకు జవాబు సిగ్మండ్ ఫ్రాయిడ్ రాసిన 'సివిలైజేషన్ ఎండ్ ఇట్స్ డిస్కంటెంట్‌మెంట్'లో (civilisation and discontent-ment) సాముద్రికత అనుభూతిగా అందుబాటులో ఉన్నది. ఈ అనుభూతి శైశవ స్థితిలో మాత్రమే కలగవచ్చు. ఈ పరిస్థితిలో మనిషికి, మిగిలిన ప్రపంచానికి మధ్య ఉన్న రహస్యమైన తెరను తొలగించవచ్చు. మెదడులోని హెమిస్ఫియర్ల మధ్య రేడియో లింక్ ఏర్పరుచుకోగలిగితే ఒక్క చైతన్యంతోనే సంపూర్ణ ప్రపంచాన్ని నియంత్రించచ్చు. ఈ విషయంపై పరిశోధన సాగుతోంది. రేడియో లింక్ అంటే అదృశ్య జగత్తులో మన ఫ్రీక్వెంసీలో ఉన్న ఆలోచనలను ఆకర్షించి చైతన్యాన్ని శక్తివంతం చేస్తుంది. ఈ శక్తివంతమైన సంఘటన సృజనకి, విధ్వంసానికి కూడా ఉపయోగపడుతుంది. చరిత్రని రక్తసిక్తం చేసిన రావణుడు, కంసుడు, దుర్యోధనుడు, హిట్లర్, నెపోలియన్ మొదలైనవారి ఫ్రీక్వెంసీల కారణంగానే ఆ సంఘటనలు జరిగి ఉండవచ్చు. నేటి అవినీతి, లంచగొండితనం, విప్లవం, భయాందోళనలు, విచ్చలవిడి భోగాలు అన్నిటికి ఇదే కారణంగా కనిపిస్తోంది. అందుకే మన మనస్సు కూడా ముక్కలుగా విడిపోవలసివస్తోంది.

**వీటన్నిటికి సమాధానం ఒక్కటే మనం మంచిగా, చక్కగా ఆలోచించి, ఆ పరమాత్మ మీద, అతని మంగళకరమైన విధానం మీద అకుంఠిత విశ్వాసం కలిగి ఉంటే అక్కడ అమంగళకరమైన వాటికి చోటే ఉండదు. మనం స్వయంగా ఆయన యొక్క అభిన్న భాగాలమనే సత్యంపై ఎల్లప్పుడు విశ్వాసముంచాలి. ఈ తథ్యాన్ని మన జీవితంలోని ప్రతి కోణం ద్వారా వ్యక్తీకరించడమే మన జీవన ధర్మం. ఈ దృఢవిశ్వాసం ఉంటే ఇక బాధెందుకు? భయమెందుకు? అప్పుడు సహజంగానే ఆత్మవిశ్వాసం పెంపొంది మనోరోగాలకి స్థానమే లేని జీవనక్రమం రూపొందుకుంటుంది.**

*– అఖండజ్యోతి, జూన్ 2001*


*అనువాదం : శ్రీమతి జయలక్ష్మి*

**అందమైన కలలు కనండి**

### పరిణామక్రమం

# పునర్జన్మ

మరణము తర్వాత ప్రాప్తించిన జీవితమే పునర్జన్మ అని చెప్పబడుతుంది. విశుద్ధరూపంలో కర్మమీద ఆధారపడిన పునర్జన్మ మూలతః పూర్వజన్మల స్మృతి. విశ్వములోని అన్ని దేశాలలో, ధర్మాలలో పునర్జన్మ సిద్ధాంతమును ఏదో ఒక రూపంలో స్వీకరిస్తారు. దీని సంపూర్ణ విశ్లేషణ ఉపనిషత్తులలో లభిస్తుంది. పాశ్చాత్య విద్వాంసులు, దార్శనికులు, మనీషుల ఒక పెద్ద వర్గము కూడా పునర్జన్మ సిద్ధాంతము మీద నమ్మకమును వ్యక్తపరుస్తున్నారు. అయినప్పటికి దీనిమీద వారి అభిప్రాయములు, స్వరూపములు వేర్వేరుగా ఉన్నాయి. ప్రాచీనకాలము నుండి నేటి అధునాతన యుగం వరకు పునర్జన్మ యొక్క ప్రాచీన పరంపర వెలుగొందుతున్నది.



పిల్లలలో పునర్జన్మ స్మృతులు ఎక్కువగా ఉంటాయని తేలింది. పరామనోవైజ్ఞానికుడు స్టీవెన్సన్ ఇలా అంటాడు. ఒక వెయ్యిమంది పిల్లలలో ఒక పిల్లవాడు తన గత జన్మను గుర్తుంచుకోగలడు. భారతదేశంలో అయితే ఈ సంఖ్య 450 మందిలో ఒకరికి ఉంటుంది. హెూన్‌డెన్ వ్రాసిన పుస్తకము 'ఎక్స్‌ప్లోరింగ్ రీ-ఇన్‌కార్నేషన్' లో పునర్జన్మ సిద్ధాంతమును గురించి విస్తృతంగా వివరించాడు. ఇతను పునర్జన్మ సిద్ధాంతమును నమ్మే ఆరు ప్రాంతాలను ఎన్నుకొన్నాడు. మొదటి ప్రాంతం దక్షిణాఫ్రికా, నైజీరియా, సెనెగల్, ఘనా, మరియు దాని చుట్టు ప్రక్కల దేశాలు. ఈ క్షేత్రంలోనే దక్షిణ తూర్పు ప్రాంతాన గల టర్కీ, లెబనాన్ మరియు ఉత్తర ఇజ్రాయిల్‌లోని ప్రాంతాలు రెండవ విభాగంలో కొస్తాయి. మూడవ విభజనరేఖ క్రిందకు వచ్చే ప్రాంతాలు భరతభూమితో పాటు దక్షిణ తూర్పు ప్రాంత ఆసియాభాగం, మరల అందులో శ్రీలంక, బర్మా, థాయిలాండ్, నేపాల్, టిబెట్, వియత్నాం మొదలైన దేశాలు వస్తాయి. జపాన్ 4వ భూభాగం. ఐదవ ప్రాంతంలో దక్షిణతూర్పు అలాస్కా వస్తుంది. హైంస్‌డెన్ చివరిదైన ఆరవ ప్రాంతంగా యూరప్ పశ్చిమ భూభాగమును, అమెరికాను ఎన్నుకున్నాడు. ఈ అన్ని ప్రాంతాలలోను పునర్జన్మ సిద్ధాంతముమీద నమ్మకము ప్రబలంగా ఉన్నది.

మార్గ్రేట్ మీడ్ అనే ఆయన అనేక సాంస్కృతిక సంప్రదాయములను, పరంపరలను గురించి అధ్యయనము చేసి పరిశోధన కావించాడు. ఎస్కిమోలు సైతము పునర్జన్మను విశ్వసిస్తారు. వారు పిల్లలను దైవీవరదానంగా భావిస్తూ వారు చెప్పిన మాటలమీద విశ్వాసమును కనపరుస్తారు. అలాస్కాకు చెందిన లింగిట్ ఎస్కిమోల అభిప్రాయము ఏమిటంటే దివంగత ఆత్మ స్వయంగా తమ తల్లిదండ్రులను ఎంచుకుంటుంది. వారు దీన్ని విధివిధానము అనుకోరు. వారి దృష్టిలో ఇదొక విశిష్టమైన ఎంపికా విధానము. ఆఫ్రికాలో కూడా ఈ సిద్ధాంతము మీద నమ్మకమును వెలిబుచ్చుతారు. ఇక్కడ 900 రకాల నల్లఆదిమ జాతీయులలో 47 జాతులు ఆత్మ నిమ్నయోనులలోకి జారిపోవటం నిజమని అంగీకరిస్తారు. 36 జాతులు పునర్జన్మ సిద్ధాంతమును గాఢంగా విశ్వసిస్తారు. 12 జాతులు పై రెండింటినీ ఆమోదిస్తారు. ఆఫ్రికాలో ప్రాచీన పరంపరకు అంతర్గతంగా పునర్జన్మ సిద్ధాంతము ఉంటుంది. పశ్చిమ ఆఫ్రికాలో దీనిని శుభమని భావిస్తారు. దివంగత ఆత్మ 'జనన-మరణచక్రము నుండి తప్పించుకొని ముక్తి పొందాలని కోరుకోదు' అని అక్కడ భావిస్తారు. జీవి తన పరివారంలోనే జన్మించాలనే కోరికను వెలిబుచ్చుతుంది. వారు దీన్ని ఆత్మ యొక్క అనంతమైన సుఖయాత్రగా భావిస్తారు.

ఆసియాకు చెందిన బౌద్ధులు మరియు హిందువులు పునర్జన్మమీద ఒక ప్రగాఢమైన విశ్వాసమును వ్యక్తపరుస్తారు. బర్మా ప్రజల నమ్మకం ఏమిటంటే మనిషి పునర్జన్మ దృఢఇచ్ఛాశక్తి పరిణామంగా వర్తమాన జీవితము లభిస్తుంది అని. తన పరివారం లోనే మళ్ళీ మళ్ళీ జన్మిస్తాడు' అని విశ్వసిస్తారు. యూరప్‌కు చెందిన సంతులు మృత్యువు పిమ్మట స్వర్గమును పొందుతారని

**కలల సాకారానికి కృషి చేయండి**

చెప్తూ ఉంటారు. మృత్యువు తదుపరి జీవి విశ్రాంతి తీసుకుంటాడు. చెడుకర్మలు అతనిని నిమ్నయోని లోకి నెట్టివేస్తాయి. ఆత్మయొక్క పవిత్రత ఈశ్వరప్రాప్తికి మార్గమును ప్రశస్తము చేస్తుంది. ఐర్లాండ్‌కు యాత్ర సాగిస్తూ యూరప్ చేరిన అట్లాంటిక్‌వాసులు దీనిని ప్రపంచానికి చాటారు. వ్యక్తి అదే పరివారంలో సరిగ్గా అదే పేరుతో జన్మిస్తాడని ట్యూటోలస్ అభిప్రాయపడ్డాడు. డెంస్, నార్స్, ఆయిస్‌లైండర్స్, గోథ్ తూర్పు ప్రాంతం, లెటస్ మరియు సైక్సన్ మొదలైన జాతులలో కూడా పునర్జన్మ సిద్ధాంతము స్వీకరిస్తారు. ఫీంస్ మరియు లైప్‌లైండర్స్ సంస్కృతులలో కూడా పునర్జన్మ సిద్ధాంతము ప్రాచుర్యంలో ఉన్నది.

అమెరికాలోని అలాస్కా దక్షిణ-తూర్పు ప్రాంతం, కెనడాలోని ఉత్తర-పశ్చిమ ప్రాంతాలకు చెందిన టింగీట్సువాసులలో ఈ విశ్వాసం ప్రబలంగా ఉన్నది. వీరి మతమేమిటంటే దివంగత ఆత్మ తన భవిష్యజన్మకొరకు పరిచయమున్నవారిలోనుండే తల్లిని ఎన్నుకుంటుంది. విధిననుసరించి ఏదైనా ప్రమాదంలో మరణించిన వ్యక్తి తన పరివారంనుండి దూరంగా జన్మిస్తాడు. భారతదేశం మరియు ఎస్కిమో ఆదివాసులలో కూడా పునర్జన్మ సిద్ధాంతము మీద నమ్మిక ఉన్నది. ఐదు యోనులలో జన్మించిన మీదటనే దుర్లభమైన మానవ శరీరము లభిస్తుంది అని ఎస్కిమోలు నమ్ముతారు. కెనడాకు చెందిన సాన్‌వాసులు పునర్జన్మ సిద్ధాంతమును స్వీకరిస్తారు. ఉత్తర అమెరికాకు చెందిన ప్రాంతమంతా ఈ నమ్మికతో పూర్తిగా మమేకమైపోయింది. వీరి అభిప్రాయమును అనుసరించి పవిత్ర హృదయుడైన వ్యక్తి తన గత జన్మను గుర్తుచేసుకొనగలడు. ప్యూబలోసోస్ జనులు పిల్లవాడు మరణించిన పిమ్మట ఆ కుటుంబంలోనే జన్మిస్తాడని నమ్ముతారు. ఇందువలన జీవి ఎక్కువగా తిరిగి వెదకవలసిన అవసరము లేకుండా అతని శరీరమును ఇంటిచుట్టుప్రక్కలే సమాధిచేస్తారు. భారతదేశపు ఆదివాసులు తమ పితరులు తమ చుట్టుప్రక్కలే తిరుగాడుతూ ఉండుటను చూశారు.

మెక్సికో మరియు ఉత్తర అమెరికాకు చెందిన మాయాస్, కెరీబస్, పెరువియన్ మొదలైన భారతీయ ఆదివాసి తెగలలో కూడా పునర్జన్మ సిద్ధాంతము ప్రాచుర్యంలో ఉన్నది. మెక్సికోకు చెందిన స్థానికులు మానవ జన్మయేకాక ఇంకా ఇతర యోనులు, నిమ్నయోనులు ఉన్నాయి' అని విశ్వసిస్తారు. సజ్జనులు అందమైన పక్షులు, ఉత్తమపశుజాతులలోను, దుర్జనులు చిన్న చిన్న జంతువులుగాను జన్మిస్తారు. ఇంకాస్‌వాసుల అభిప్రాయమేమి టంటే మృతశరీరమును సంపూర్ణంగా మమ్మీ రూపంలో పరివర్తితము గావిస్తే మనిషి తిరిగి ఆ శరీరములోకి ప్రవేశించి పునర్జీవితుడు అవుతాడు. ఈ కారణముగానే మమ్మీల ఆచారము ప్రబలింది. బ్రెజిల్‌కు చెందిన చిరీక్చేన్ మరియు పొటాగోనియాస్‌లో కూడా ఈ సిద్ధాంతమును కొంతవరకు విశ్వసిస్తారు.

ఆస్ట్రేలియా మరియు ఓసియెనీయాకు చెందిన వారు పునర్జన్మను నమ్ముతారు. ముఖ్యంగా మధ్యఉత్తరప్రాంత ఆదివాసులు ఈ విశ్వాసమును ప్రబలంగా ఆమోదిస్తారు. యూరప్ జనులతో సంఘర్షణ తరువాత వీరి అభిప్రాయములలో ఒక విచిత్రమైన మార్పు గోచరించినది. మరణించిన తరువాత జీవి శ్వేతశరీరధారి అవుతాడని వీరి అభిప్రాయము. ఉత్తర ఫసిఫిక్ సముద్రతీరవాసులైన ఒకినావాలో జీవి మరణించిన 49 రోజుల తరువాతనే శరీరమును విడిచిపెడతాడు అని నమ్ముతారు. 7 తరాలు లేక సుమారు 200 సంవత్సరముల వరకు ఒక జీవి తన విభిన్న రూపాలలో మనుష్య శరీరములో జన్మిస్తాడు. అయితే వీరు మనిషి తనకంటే నిమ్నయోనులలో జన్మిస్తాడనే ఆలోచనకు వ్యతిరేకులు. బోర్నియో,సెలెబీస్, తస్మానియా, ఫిజీ, సోలోమన్ ద్వీపాలు మరియు న్యూకెలెడోనియా దక్షిణభాగంలో నివసిస్తున్న వారిలో పునర్జన్మ సిద్ధాంతము పట్ల నమ్మకమున్నది.

బహుశః అన్ని ధర్మాలలో పునర్జన్మ సంఘటనమీద శ్రద్ధా, విశ్వాసములు ప్రబలంగా వ్యాపించి ఉన్నాయి. హైంస్ ప్రకారము హిందూధర్మమునకు పునర్జన్మ ముఖ్య ఆధారము. ఇది విశుద్ధ రూపంలో కర్మమీద ఆధారపడి ఉంటుంది. 84 లక్షల యోనులలో జన్మించిన తరువాతనే ప్రాప్తించిన మానవ జీవితము సర్వశ్రేష్ఠమైన జీవితంగా ఆమోదించబడినది. దీనిని కర్మయోని అని పిలుస్తారు. ఎందుకంటే ఈ జీవితంలో మనిషి తన సమస్త కర్మలను నశింపజేసుకుని జీవన్ముక్తుడౌతాడు లేదా ఈశ్వరగణంలో ఒకడిగా చేరుతాడు. విశిష్ట ఆత్మలకు ఈ అధికారము ఒనగూడుతుంది. సత్కర్మలు, దుష్కర్మలే జీవిని స్వర్గ, నరకాల దిశగా తీసికెళతాయి. భగవద్గీతానుసారము ఈ రెండురకాలైన కర్మలకు ఆవలగా పైనున్న నిష్కామకర్మ భగవంతుడిని చేర్చే మార్గమును ప్రశస్తము చేస్తుంది. ఇక్కడ వర్తమాన జీవితకర్మ మరియు చివర క్షణాల తీవ్ర ఇచ్ఛ భావిజీవితమును నిర్ధారిస్తుంది. బౌద్ధమతము కేవలము అంతిమ ఇచ్ఛనే మహత్వపూర్ణమైనదిగా అంగీకరిస్తుంది.

బౌద్ధులు పునర్జన్మను గాఢంగా విశ్వసిస్తారు. వీరిలో కూడా మోక్షమునకు సమానంగా నిర్వాణము అనేది ఉంటుంది. అది మనిషిని సంసారచక్రమునుండి తప్పిస్తుంది. చెడుకర్మల ఫలితము పశుయోనిలో జన్మించుట. టిబెట్‌కు చెందిన బౌద్ధలామాను అవతార పురుషునిగా అంగీకరిస్తారు. మనిషి ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉండగానే మరణిస్తాడు, అప్పుడు అతను దాన్ని

**స్నేహంలో స్వార్థానికి తావు లేదు**

పూర్తిచెయ్యటానికి తిరిగి జన్మిస్తాడు. మహాయానంలో నిర్వాణస్థితి ప్రాప్తించినవారిని బోధిసత్వుడు అని పిలుస్తారు. ఇతను జననమరణచక్రానికి అవలగా ఉంటాడు. కోరికలు మరియు ఆకాంక్షలతో ఆచరించిన కర్మ పునర్జన్మకు కారణమౌతుంది అని చైనాలోని బౌద్ధుల అభిప్రాయము. జైనధర్మంలో కూడా మోక్షమును గురించి స్పష్టమైన కల్పన చెయ్యబడినది. వారు కర్మకంటే అధికంగా నైతికతను బలపరుస్తారు. దివంగత ఆత్మ 9 నెలల తరువాత శిశువుగా జన్మతీసుకుంటుంది. ఒకవేళ ఈ సమయము 9 నెలలను మించి ఉంటే జీవి తన గత జన్మలను గుర్తుంచుకొనగలుగుతాడు.

ఈజిప్ట్-బాబిలోనియా వంటి విశిష్ట సంస్కృతులలో చారిత్రక ఆధారముల సాక్ష్యంగా కూడా పునర్జన్మ సిద్ధాంతమును గూర్చి తెలుసుకోవచ్చును. ఆ సభ్యతలలో ఆత్మను అమరంగా భావిస్తారు అని హెరోడెటస్ చెప్పాడు. పాపములకు ప్రాయశ్చిత్తము చేసుకొనేందుకు మానవ జన్మ ప్రాప్తిస్తుంది. ఆతరువాత మాత్రమే మనిషి దేవత్వమును ప్రాప్తించుకుంటాడు. మానవ శరీరము నుండి వేరుపడిన తరువాతనే జీవి అన్నిరకాల వనస్పతి, జీవయోనుల గుండా యాత్రను సాగిస్తుంది. 3000 సంవత్సరముల తరువాత జీవి మరల మనిషిగా లేదా దేవతగా రూపుదాలుస్తాడు. మనిషి నిమ్నజాతి జీవిగా పుట్టకుండా నిరోధించేందుకే మమ్మీల ఆచారము ప్రాచుర్యములోకొచ్చింది.

ప్లేటో పునర్జన్మకు నూతన వ్యాఖ్య చేశాడు. అతను దీనిని మెనో, ఫెడ్స్, రిపబ్లిక్ రూపాలలో చిత్రీకరించాడు. తన గతజన్మల స్మృతి లేని వ్యక్తి 'మెనో' విభాగంలోకొస్తాడు. ఫెడ్స్‌లో కొంత స్మరణ ఉంటుంది, కొంతమేర ఉండదు. 'ద రిపబ్లిక్' లో మనిషికి జీవన్మరణాల జ్ఞానముంటుంది. ఆ స్థితిలో ఉన్న జీవి తన అనంత ఆయామాల జ్ఞానమార్జించి అవసరాన్ని అనుసరించి జన్మిస్తాడు.

క్రైస్తవులలో పునర్జన్మ పట్ల తక్కువ విశ్వాసము ఉన్నట్లు కనపడుతుంది. సీసరో జీవితము పాపమునకు పరిణామము అని అంటాడు. అపోలోనియస్ కాశ్మీర్‌లోని ఆర్కాన్ నుండి ఈ సిద్ధాంతమును సముపార్జించాడు. ఉచ్చస్తరీయ ఆత్మలద్వారా తప్పులు దొర్లినపుడు, వాటికి ప్రాయశ్చిత్తంగా వారు మానవ యోనిలో జన్మించాల్సి ఉంటుంది అని అతను స్పష్టీకరించాడు. జుడెఇజ్మ వాసులు పునర్జన్మను అంతగా విశ్వసించరు. ఓల్డు టెస్ట్‌మెంట్‌లో ఆత్మయొక్క గతజన్మల గురించిన వర్ణన అక్కడక్కడా కనిపిస్తుంది. ఈ నమ్మిక 8 వ శతాబ్దంలో ప్రబలంగా ఉండేది. అయితే 18 వ శతాబ్దంలో జన్మించిన కెరెట్‌కు దీని మీద అంత విశ్వాసము లేదు. తాహెవ్ అను వ్యక్తి ఆడమ్‌ను సెర్, నోఆహ్, అబ్రహమ్, మూసా మొదలైనరూపాలలో ఆత్మికవికాస క్రమము ఉంటుంది అని భావించాడు. ఈ సిద్ధాంతము కేవలము ఉచ్చస్తరీయ ఆత్మలకొరకే ప్రతిపాదించబడినది. న్యూ టెస్ట్‌మెంట్‌లో కూడా పునర్జన్మను గురించిన అంశాలు లభిస్తాయి. మార్క్, మైథ్యూ, ల్యూక్ మొదలైనవాటిలో దీని గురించిన సుస్పష్ట సంకేతాలు లభిస్తాయి. అనేకమంది చర్చ్ ఫాదర్స్ దీనిని ఆమోదిస్తున్నారు. దీనికి గొప్ప ఉదాహరణ జాన్ అనువాడు ఎలిజగా తిరిగి జన్మించుట.

ఇస్లామ్ దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తుంది. కానీ దీనిలోని కొన్ని సముదాయములు, సంప్రదాయములు ఆధ్యాత్మికజన్మ గురించి వ్యాఖ్యానిస్తాయి. భారతదేశంలో బొరాస్ సంప్రదాయములో పంజరములోని చిలుకలను కొని వాటికి స్వేచ్ఛను కలిగిస్తారు. దీని వెనుక గల భావమేమిటంటే వీటిలో వారి పూర్వజుల ఆత్మ నివసిస్తుంది అనే నమ్మకముంది. సూఫీమతం సైతం పునర్జన్మను విశ్వసిస్తుంది. ఇది ముఖ్యంగా సౌరాష్ట్రకు చెందిన పార్శీలలో ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. వీరి మతానుసారము అమరమైన ఆత్మ కొంత సమయము వరకు ఉచ్చలోకాలనుండి నిమ్నలోకాలలో జన్మించుటకు దిగివస్తుంది. ఇదికూడా హిందువుల 84 లక్షల యోనులలో జన్మించుట అనే కర్మసిద్ధాంతమును ప్రతిపాదిస్తుంది, కానీ దీనిలో సంఖ్యాభేదమున్నది. సూఫీసంతు జలాలుద్దీన్‌రుమీ అభిప్రాయము ప్రకారము ఆత్మ ఖనిజ పదార్థములనుండి వికసిస్తూ క్రమంగా వనస్పతి, జీవులు, మానవుడు, దేవత మరియు ఇంకా పై స్థాయిల దిశగా ప్రగతి సాధిస్తూ ముందుకు పోతుంది.

జర్మనీకి చెందిన గెటె అభిప్రాయమును అనుసరించి మానవుడు "ప్రకృతి-ఈశ్వరుడిని" అనుసంధానించే ఒక సూత్రధారి. చార్లెస్‌ఫెరీయర్ మరియు శోపెన్ హోవర్‌లే కాకుండా శ్వేడిన్‌బర్గ్, విలియమ్ బ్లేక్, శీలర్‌మెజినీ, హర్మన్, లియో టాల్ స్టాయ్, పాల్, ఆర్థర్‌కానన్, నెహలర్ మొదలైన విద్వాంసులందరు పునర్జన్మ సిద్ధాంతపు ఉనికిని అంగీకరించారు. ఆధునిక మనీషియైన డేవిడ్‌లాయల్, హెన్రీఫోర్డ్ మరియు రుడయార్డ్ కెప్లింగ్ పునర్జన్మను మానవ అస్తిత్వంలో అభిన్న అంగంగా ఆమోదిస్తున్నారు. పునర్జన్మ అస్తిత్వం యొక్క ప్రామాణికత అసందిగ్ధ మైనది. ఇందువలన బుద్ధిమంతులైనవారు భావి జీవితము కొరకు వర్తమాన జీవితములోని ప్రతికర్మను శ్రేష్ఠంగా, పవిత్రంగా నిర్మించుకుంటారు. అలా చేయటమే తెలివైన పని.

*- అఖండజ్యోతి, డిశంబరు 2002*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**విద్యకు వినయం తోడవ్వాలి**



## యువతకు ప్రత్యేకం

# ఐశ్వర్యం - 7

ఎక్కడ బాధ్యత తీసుకోవాలో అక్కడ బాధ్యత తీసుకోము. ఉత్తరాలు రాస్తుంటారు. కాని పోస్టులో వెయ్యరు. ఏదో ఉత్తరం వస్తుంది. అక్కడెక్కడో పడేస్తాం. ఎవరికి చెప్పం. లేకపోతే ఈ కబురు అందచెయ్యి అని ఎవడో ఫ్రెండు చెప్తాడు. సరే అంటాం కాని అందచెయ్యం. "మరచి పోయాను" అని తేలికగా అనేస్తాం అలాంటివాడు గొప్పవాడు అవడు. మరచిపోయేవాడు గొప్పవాడు ఎలా అవుతాడు?

"అక్కడికెళితే పని అప్పచెబుతారేమో, వెళ్ళద్దు" పని ఎగ్గొట్టే వాడు గొప్పవాడు అవడు. బాధ్యతను స్వీకరించండి. "దేశాన్ని బాగుచెయ్యి, ప్రపంచాన్ని బాగుచెయ్యి" అని గురువుగారికి ఎవరు చెప్పారు? ఆయన ఆ బాధ్యత తీసుకున్నాడు. కాని ఆయన వినే వారికి చెప్పగలడు. వినని వారికి ఏమి చెప్తారు?

నిన్ను ఎదగవద్దని ఎవరన్నారు? మా నాన్నవల్ల ఎదగలేదు. మా అమ్మవల్ల ఎదగలేదు. పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల ఎదగలేదు. ఇలా అనడం తప్పు. ఒకాయన ఉన్నాడు. కాళ్ళు పడిపోయాయి, చేతులు పడిపోయాయి. మాట్లాడలేదు. చేతులు వ్రాయలేవు కానీ ఆయనకు ఫిజిక్సులో నోబుల్ ప్రైజ్ వచ్చింది. ఆయన పేరు స్టీఫెన్ హాకింగ్. ఎ బ్రీఫ్ హిస్టరి ఆఫ్ టైం అనే (A Brief History of Time) పుస్తకం వ్రాశాడు. ఆయన రీసర్చి స్కాలర్స్‌ను గైడ్ చేస్తున్నాడు.

అంతకంటే నిరాశజనకమైన పరిస్థితి ఉండదు. భౌతిక జగత్తులో నోబుల్ ప్రైజ్ పొందటం కంటే సాధించవలసినది ఏమిలేదు. అలాంటి స్థితిలో ఆయన అంతచేయగలిగితే మరి మీకెందుకు నిరాశ? ఆయన కంటే మీరందరు చాలా ఉన్నతమైన శారీరిక స్థితి ఉన్నవారే. ఆయన ఎవరి సాయం అడగలేదు. మనకి ఇవన్నీ ఉన్నా కూడా సహాయం కావాలంటుంటాము. కళ్ళున్నాయి, చెవులున్నాయి. మీ ఆరోగ్యానికి ఏమి లోపం ఉన్నది? ఆయనతో పోల్చి చూచుకోండి.

ముందు బాధ్యతలు తీసుకోండి. ఎప్పుడయితే మీరు బాధ్యత తీసుకోవడం మొదలుపెడ్తారో మెల్లిమెల్లిగా మనుష్యులు మీకు బాధ్యతలు ఇస్తారు. ముందు ఒక బాధ్యత ఇస్తారు. బాగానే చేశాడనుకుంటే ఇంకొకటి ఇస్తారు. అలా చేసుకుంటూ పోవడమే. "అప్పుడు అంతా నా నెత్తిమీద పడుతుంది కదా!" ఎప్పుడయితే అలా అనుకుంటారో, ఐశ్వర్యం కోల్పోయినట్లే. ఆ క్షణంలో బికారివి అయిపోయినట్లే. ఇప్పుడు తల్లిదండ్రులకు నిరాశ ఎందుకు వస్తోందంటే పిల్లలు వాళ్ళ బాధ్యత స్వీకరించడం లేదు. "మాకు తల్లితండ్రి వద్దు! నేను నా భార్య అంతే!" ఇక పిల్లలు కూడా బరువనిపిస్తున్నారు.

జీవితమంతా అలా ఆగకుండా పోతుంటుంది. (Life is a continuous process) పుట్టిన దగ్గర నుంచి చనిపోయేంతవరకు కాలం ఎక్కడయినా ఆగిందా? మెలకువగా ఉన్నా, నిద్రపోయినా, సినిమాలు చూస్తున్నా ఎన్నో గంటలు అనవసరంగా మాట్లాడినా – కాలం అలా పోతుంటుంది. ఇలా కాలం ఒక ప్రవాహంలాగా పోతుంటే మనం పనికొచ్చే పనులు, పనికిరాని పనులు చేస్తుంటాము. బాధ్యత, బాధ్యతా రాహిత్యం. అమ్మ మంచినీళ్ళు అడిగింది. "నువ్వు తీసుకోవచ్చు కదా" అన్నావు. నీకు రావలసిన ఉద్యోగం ఇంకొకడికి వెళ్ళిపోతుంది. అందుకు ఉద్యోగాలు రావడం లేదు. మీ స్వార్థం కొరకయినా మీరు చేయాలి. "మా అమ్మాయి చదువుకుంటున్నది కనుక పనులు చెప్పము" ఆ అమ్మాయికి పెళ్ళి కాదు. ఎందుకు పెళ్ళి కాదు? పనులు చేయటం లేదు కనుక. పెళ్ళి అంటే భార్యభర్తలు ఒకరికొకరు సేవ చేసుకునే పరిస్థితి. **సేవాభావం ఉన్నవారికి, సేవ చేసే వారికి త్వరగా పెళ్ళిళ్ళు అవుతుంటాయి.** కూలినాలి పనులు చేసుకునే వారికి తొందరగా పెళ్ళిళ్ళు అవుతాయి. గమనించారో లేదో! ఎందుకంటే ఎప్పుడు ఏదో పనిలో ఎవరి సేవలోనో మునిగి ఉంటారు.

నువ్వు కాలాన్ని ఉపయోగించుకుంటున్నావా? ఉపయోగించు కోవా? అది బాధ్యత స్వీకరించడమంటే, కాలాన్ని ఉపయోగించు కోవడం బాధ్యత. కాలాన్ని నాశనం చెయ్యటం బాధ్యతా రాహిత్యం. తమ్ముడికి చదువుచెప్పావు. అమ్మకు సహాయం చేశావు. జోళ్ళు పాలిష్ చేసుకున్నావు, నీ బట్టలు నువ్వు ఉతుక్కున్నావు. ఇదంతా బాధ్యత స్వీకరించడమే. సమాజం మారుస్తాం అనకండి. మీరు మారుతారు. మీరు మారుతారు కనుక చుట్టుప్రక్కల సమాజం మారుతుంది. చీకట్లు పోవు. క్రొవ్వొత్తి వెలుగుతుంది. చుట్టుప్రక్కల కాంతితో నిండుతుంది. నేను చీకటి పోగొడతాను అని చెప్పి దీపం వెలిగించకపోతే ఏమి లాభం? అది బాధ్యత అంటే.

"నేను చాలా సీరియస్‌గా చదువుకుంటున్నాను. అందుచేత కంచాలు పెట్టను. అమ్మకు సహాయం చెయ్యను" రేపు ఎవరు నీకు సహాయం చెయ్యరు. గ్యారెంటీ అది. నీ జీవితంలో సహాయం అనే స్పందనలు పొందపరచుకోవడం లేదు. కాలం నిన్ను ఆ ఇంట్లో పడేసింది. అక్కడ బాధ్యత తీసుకోమని, నేను ఇంట్లో చెయ్యను, బయట ఎక్కడో చేస్తాను అంటే ఎలా? కొంతమంది, స్వయం సేవకులు కావాలంటారు. కాని స్వయం సేవకుడు అంటే ఎవరు? ఎవరి పనులు వారే చేసుకునేవారు. వాడి పనులు వాడు చేసుకోనివాడు బయట ఎందుకు చెయ్యడం? నీ పని నువ్వు చేసుకోలేనివాడివి, నువ్వే ఇతరుల మీద ఆధారపడేవాడివి ఇంకొకడికి ఏమి సాయం చేస్తావు? ఆ స్వయంసేవక ప్రవృత్తి

**కొద్దిపాటి నిర్లక్ష్యం కొండంత సమస్యను సృష్టించవచ్చు**

మీరు పెంపొందించుకోవాలి. అందుచేత ఇళ్ళలో మీ పనులు పని మనిషి చేయకూడదు. అందుకే సంపన్న దేశాలలో పని మనుషులు దొరకరు. ఇక్కడ పెళ్ళి చేసుకుని తీసుకుపోతారు. అమెరికాలో పని మనుషులు ఎందుకు దొరకటం లేదు? అందరు స్వయం సేవకులే కనుక. మా ప్రొఫెసర్ గారు అమెరికా వెళ్ళారు. ఫలానా రూములో ఉండండి అని ఆయనకు ఒక గది ఇచ్చారు. ఈయన అక్కడికి ఏదో రీసర్చికి వెళ్ళాడు. ఇంతలో ఒకాయన పెద్ద కారులో, సూటు బూటు వేసుకుని దిగాడు. ఎవరైనా ప్రొఫెసర్ వచ్చారేమోననుకుని తలుపు తీస్తే "గుడ్ మార్నింగ్‌సార్" అన్నాడట. ఈయన కూడా "గుడ్ మార్నింగ్ సార్" అన్నాడట. సరే వాడు "వేర్ ఈజ్ యువర్ కిచన్" అని ఇంకేదో అడిగాడు. అంటే వాడు పనివాడు, కారులో వచ్చాడు. అదీ ఐశ్వర్యం. అలా ఎందుకుంది అక్కడ? వాళ్ళ పనులు వాళ్ళే చేసుకుంటారు కనుక. వాళ్ళ దగ్గర అది నేర్చుకోవాలి. మరి ఇక్కడ ఇంకెవడో చేయాలి. ఇంకెవడో మనకు ఎంత ఎక్కువ చేస్తే మనం అంత గొప్పవాళ్ళం అన్నమాట.

అబ్రహం లింకన్ ఒకరోజు వైట్‌హౌస్‌లో కూర్చుని బూట్ పాలిష్ చేసుకుంటున్నాడట. సెనెటరీ ఎవరో వచ్చారు. సెనేటర్ అంటే ఇక్కడ మన ఎమ్.పి. (MP) లాంటి వాళ్ళు. "అదేమిటి మీరు మీ జోళ్ళు పాలిష్ చేసుకుంటున్నారు?" అన్నాడు. అప్పుడు "ఏం మీ జోళ్ళు మీరు పాలిష్ చేసుకోవడం లేదా" అని అడిగాడట ప్రెసిడెంట్ అబ్రహం లింకన్.

అందుచేత బాధ్యత తీసుకోవడం చాలా ముఖ్యం. మీరు ఇంట్లో చదువుకుంటున్నారు. బూజు కనిపించింది. దానిని వెంటనే తీసేసి చదువుకోండి. చూడండి ఏమవుతుందో. అక్కడ బూజు తీసేస్తే మీ మనస్సుల్లో బూజులు పోతాయి. అంతా ఒకదానికొకటి సంబంధం ఉంటుంది. పూర్వపు రోజులలో నాన్న ఏదో తీసుకొస్తూ ఉంటే ముందు ఆ సంచి పట్టుకో అని నేర్పేవారు. ఇప్పుడు ఆయన బరువు మోసుకొస్తున్నా ఎవరు కూర్చున్నచోట నుండి కదలరు. "నువ్వు ఇంత వరకు మోసుకొచ్చావు కదా, ఇక నేను మోస్తాను" ఆ కొంచమే. రెండు అడుగులు మాత్రమే ఏమయింది? **ఇతరుల చేతిలో బరువును ఎప్పుడయితే నువ్వు ఎత్తుకుంటావో, నీ బరువు ఎవరో గురువు ఎత్తుకుంటాడు.** లేకపోతే ఆయన ఎత్తుకోలేడు. ఇంతకు కావలసినది ఏమిటి? బాధ్యతను స్వీకరించడం, టైంను వేస్టు చేయకుండా ఉండటం.

మనం చెడ్డపని చేస్తే మనవాళ్ళు ఎవరు ఏమి అనరు. మంచి పని చేస్తే మాత్రం ఏడిపిస్తారు. హరేరామ హరే కృష్ణ మూవ్‌మెంట్ చూచారా? ఇండియాలో గుండు గీయించుకుని డాన్స్ చేస్తున్న వారిని ఎవరినైనా చూచారా? ఫారిన్ కంట్రీస్‌లో (ఇతర దేశాలలో) చేస్తారు. అందుకే వారు ధనవంతులుగా ఉంటారు. డాన్స్ చేయడం వలన ధనం రాదు. అది మంచిది అని అనుకుంటే ఆచరిస్తారు. మీరు అలాంటి డాన్స్‌లు చేయక్కర్లేదు. కాని ఇంటికి వెళ్ళాక బాధ్యతలు స్వీకరిస్తున్నప్పుడు ఇంట్లో వాళ్ళు అడ్డుపడచ్చు లేక వెక్కిరించవచ్చు. అందుకు జాగ్రత్తగా ఉండాలి. ఇంటికి వెళ్ళగానే మరల మామూలుగా అయిపోకూడదు.

నీరసించిపోవడం అనేది మీ లోపం. "రేపు ఏం జరుగుతుందో? ఇది జరగలేదు కదా, ఇది జరగకపోవడం వలన అదేదో అయిపోతుంది" ఇలా ఆలోచించడానికి అలవాటు పడిపోయారు. ఎల్.ఐ.సి. (LIC) విన్నారా? దానిలో కమీషన్ బాగా ఇస్తారు. వాళ్ళ పాలసి ఎందుకు తీసుకుంటాం? వాళ్ళు మీ దగ్గరకు వచ్చి ఏం చెప్తారు? "రేపు మీకేదైనా అయితే?" నిజంగా వాళ్ళ పాలసి తీసుకున్న వారందరు చనిపోతే LIC మూతపడుతుంది. కానీ వాళ్ళకి లాభాలు ఎందుకు వస్తున్నాయి? చావడం లేదు కనుక. అందువల్ల మీరు అనుకున్న బాధలు సహజంగా రావు. వాడు ఏం భయపెట్టి పాలసి కట్టించుకున్నాడో, ఆ బాధలు రావు. అంటే చెప్పదలచుకున్న దేమిటంటే మీ మానసిక స్థితిని దిగజారనీయకండి. నిరంతరం ఉత్సాహాన్ని ఉంచుకుని ప్రతిరోజు ఏదో ఒక అడుగు ముందుకు వేయగలగాలి.

మీకు తెలిసిన వాళ్ళ దగ్గర ఏదైనా స్పెషల్ నాలెడ్జ్ (జ్ఞానం) ఉంటే దాన్ని నేర్చుకోవడానికి ప్రయత్నించండి. స్టూడెంట్ అయితే ఇది వరకు కంటే ఎక్కువ మంచి మార్కులు రావాలి. కాని మీరు నేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నప్పుడు క్లాసువర్కుగాని, ఇంటి బాధ్యతలను వదిలివేశారనుకోండి నేను చెప్పిందంతా శుద్ధ దండగ. మీ ప్రవర్తన ఎలా ఉండాలంటే నువ్వు ఇంట్లోంచి వెళ్ళిపోతే "హమ్మయ్య పీడా వదిలింది బాబు" అనుకోకుండా "వీడు వెళ్ళిపోతే పనులు ఎట్లా? ఇన్ని పనులు చేసేవాడు కదా!" అని అనుకోవాలి. అలా అయితే అందరు నన్ను ఎక్స్‌ప్లాయిట్ (exploit) చేస్తారు. పరవాలేదు. మనుష్యులు నిన్ను ఉపయోగించు కున్నంత మాత్రాన నీకు నష్టం ఏది రాదు. చేసింది ఎన్నడు వృధా పోదు. అందువల్ల ఏమి నేర్చుకోవాలి? 1) పూర్తి బాధ్యత వహిస్తాం 2) ఎవరు వెక్కిరించినా బాధ్యతలను వదలము 3) సాధ్యమయినంత వరకు క్రొత్త విషయాలు నేర్చుకుంటాము 4) ఎవరు ఏమన్నా నేను ఇతరులకు చేసే సహాయాన్ని ఎట్టి పరిస్థితులలోను మానను.

కాని మనం చేసే సహాయం ఎలా ఉండాలంటే అది ఇంట్లో వాళ్ళను బాధపెట్టకుండా, సమాజం నీ మీద వేలెత్తి చూపకుండా చేయగలిగే సహాయం అవ్వాలి. అతిగా దేనికి వెళ్ళినా కూడా మంచిది కాదు.

(సమాప్తం)

– డా౹౹ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారు
యువతకు ఇచ్చిన ఉపన్యాసముల నుండి

(మాష్టారు గారి ఉపన్యాసముల సి.డి.లు కావలసిన వారు సంప్రదించండి ఫోన్: 9441901275)

**దుర్మార్గులతో స్నేహం ప్రమాదకరం**



## ఆదిశక్తి యొక్క లీలాకథలు - 29

# బయట, లోపల ఉన్న శత్రువులను గుర్తించండి

ఆదిశక్తి లీలాకథ యొక్క సూత్రములలో ఆధ్యాత్మిక విద్య యొక్క తత్త్వములు గుదిగ్రుచ్చబడి ఉన్నాయి. ఇందులో సాధనలోని సమర్థవంతమైన విధివిధానములు, నియమాలు మరియు సాధన యొక్క అనుభవములు పొందుపరచబడి ఉన్నాయి. వీటితోపాటే దీనిలోని అక్షరము అక్షరములోను భగవతీమాత అహైతుక కృప నిండి ఉన్నది. శిశువుకు ఏవిధంగా మాతయే సమస్తంగా ఉంటుందో, అదే రీతిలో శక్తి సంతానమునకు, శక్తి సాధకులకు శ్రీదుర్గాసప్తశతియే సమస్తం అయి ఉన్నది. శిశువు తన పోషణ కొరకు, ఔషధముల కొరకు, సేవ కొరకు, ఆహారం కొరకు, మనోరంజనము కొరకు మరియు చిన్నాపెద్దా అవసరాల కొరకు, కేవలము తన తల్లికొరకు ఎదురుచూస్తూ ఉంటుంది. ఆమె మీదే అన్నింటికి ఆధారపడి ఉంటుంది. శిశువు అయాయకురాలు, శిశువుకు తన మాతృమూర్తిని 'అమ్మా' అని సరిగ్గా పిలవడము కూడా రాదు. శిశువు కేవలము తన తల్లిని చూడగలదు, ఏడవ గలదు. శిశువు భావనలతో గాఢ అనుబంధాన్ని పెనవేసుకున్న ఆమె తల్లి తన సంతానము యొక్క సంవేదనల సూక్ష్మతను గుర్తించగలదు. ఆమె బిడ్డ అవసరాలను తీర్చటములోను, బాధను నివారించుటలోను ఏవిధమైన పొరపాటును చెయ్యదు.

సామాన్య తల్లులతో పోలిస్తే జగన్మాత మహామాయ మరింత అధిక మమతామయిగా దర్శనమిస్తుంది. దేవి తన సంతానం యొక్క సంవేదనలతో సదా సుపరిచితయై ఉంటుంది. తనను స్మరించినంతమాత్రము చేతనే ఆ దేవి సంకటములన్నింటిని క్షణములో నివారిస్తుంది. ఈ మాటలు కేవలము ఒక కల్పన లేక ఒక ఆలోచనాధార కాదు. ఇవి భవానీమాత భక్తుల యొక్క యుగయుగాల అనుభూతులు, ఆ లీలలను అసంఖ్యాక జనులు ఈనాడు కూడా మననము చేసుకుంటున్నారు. ఆదిజనని దుర్గామాత వారికొరకు జీవితములోని అన్ని వ్యవస్థలను సహజముగానే ఏకత్రాటిపైకి తెస్తుంది. ఆ మాతయే వారి కష్టముల నన్నింటిని నివారిస్తుంది. ఆ జగన్మాతయే వారికి సద్వివేకమును అనుగ్రహిస్తుంది. దేవీ భగవతి వారి హృదయాలలో సత్కర్మలకు ప్రేరణగా నిలుస్తుంది. మహామాయయే వారికి ఆధ్యాత్మిక విద్య అధిష్ఠానదేవతగా రూపుదాలుస్తుంది. నిజముగానే మాత ఆదిశక్తి తన సంతానము యొక్క పోషణ, ఔషధులు, సేవ, సన్మార్గమును ప్రసాదించే సమస్త బాధ్యతలను వహిస్తుంది. ఇవన్నీ పొందటానికి మాత సంతానము చెయ్యవలసినది ఒక్కటే. 'అమ్మా' అని ఆ జగన్మాతను స్మరిస్తూ ఉండటమే! శ్రీదుర్గాసప్తశతిలోని 700 శ్లోకములలోను 'అమ్మా' అన్న ఈ రెండక్షరాల మహిమయే గానము చెయ్యబడినది.

ఆదిశక్తి లీలాకథ యొక్క గత సంచికలో ప్రథమచరిత్రకు చెందిన ప్రథమ అధ్యాయములోని ఐదవమంత్రము యొక్క లోతైన రహస్యములను వెలుగులోకి తేవటము జరిగినది. అందులో ఇలా చెప్పబడి ఉంది. 'ఆ కాలములో దేశ ప్రజలను కన్నబిడ్డలవలె భావించి సముచిత రీతిలో పరిపాలన సాగిస్తూ ఉన్న సురథ మహారాజు కోలానగర రాజ్యమును కోలావిధ్వంసులు నాశనం చేశారు, వారు ఆయనకు శత్రువులుగా మారారు. చైత్ర వంశోద్భవుడైన ఈ రాజు సమస్త సద్గుణములకు నిలయుడు. ఆ రాజు వీరుడు, ప్రతాపవంతుడు, ప్రజాపాలకుడు. అయినప్పటికి అతనిమీద కోలావిధ్వంసులు ఘోర ఆక్రమణ గావించారు. సాధనా నిరతులైనవారిమీద అనేక ఆక్రమణానుభూతులు కలుగుతూనే ఉంటాయి. సాధకుని జీవితములో విపత్తులు సర్వవేళలా అతని జీవన సహచరులై ఉంటాయి. అడుగడుగునా అతను మహా సంకటములను ఎదుర్కొనవలసి వస్తుంది. ఎందుకంటే భక్తుడు తన తల్లి ఆరాధన సఫలతాపూర్వకముగా చేస్తూ ఉంటాడు కనుక ఒకవేళ సాధకుని జీవితములోను, సాధనలోను కష్టములు వచ్చినా, ఆ సమయములో ఆ ఆరాధనా ప్రభావము చేత ఆ కష్టములు అతనికి వరదానమును ప్రసాదించే అవకాశములుగా పరిణమిస్తాయి. ఈ క్రమములో జీవాత్మ భగవతిని విస్మరించి ప్రాపంచిక దిశగా, సంసారసాగర దిశగా ముందుకు సాగినప్పుడు లోటు కనిపిస్తుంది. ప్రాపంచిక సంసారసాగర బంధనములనే మోహపాశములలో చిక్కుకున్నప్పుడు అతి బలవంతుడైన సాధకుడైనప్పటికి కూడా అతను పరాజయము పాలుకావల్సిందే!

ఈ కథాసూత్రములో ఆదిశక్తి లీలాకథ యొక్క తరువాతి మహామంత్రము గుదిగ్రుచ్చబడి ఉన్నది.

**తస్య తైరభవద్ యుద్ధమతిప్రబలదణ్డినః ।**
**న్యూనైరపి స తైర్యుద్ధే కోలావిధ్వంసిభిర్జితః ॥ (1/1/6)**

**అర్థము : అత్యంత బలిష్ఠులను కూడా దండించగలిగే ఆ సురథునికి, మ్లేచ్ఛరాజులకు మధ్య యుద్ధము సాగింది. ఆ రాజులు**

**దుష్టులకు దూరంగా ఉండండి**

**సంఖ్యలో తక్కువ ఉన్నప్పటికి సురథమహారాజు పరాజితుడాయెను!**

ఆదిశక్తి లీలాకథ పావనమంత్రములో ఆధ్యాత్మికసాధన యొక్క నిగూఢమైన తత్త్వ నిరూపణ ఉన్నది. ఈ మంత్రము యొక్క శబ్దార్థమును ఆకళింపుజేసుకున్నచో ఇలా అవగతమౌతుంది. 'మహారాజు సురథుడు ప్రబలమైన శత్రువును మరియు ప్రబలమైన దండమును ధరించినవాడిని దండించుటలో సమర్థుడైనప్పటికి అతను మిత సంఖ్యాకులైన కోలావిధ్వంసులతో, వారు అల్ప సైన్యమును కలిగి ఉన్నప్పటికి వారి చేతిలో ఓటమిపాలయ్యాడు' అని మాత్రమే తేటతెల్లమౌతుంది. ఈ సత్యము యొక్క ఆధ్యాత్మిక రహస్యము లోతుల్లోకి తొంగిచూసినచో నిజానికి ఈ ఓటమి సమర్థుడైన సాధకుని పరాజయమే! సాధనా జీవితములోని ఎటువంటి సత్యమంటే అది సామాన్యము మరియు ఉచ్చస్తరీయములనబడు రెండు రకములైన సాధకుల జీవన యానములో ఇటువంటి పరాజయం తొంగిచూస్తూనే ఉంటుంది. తమ సమర్థవంతమైన తపోబలము ఉన్నప్పటికి కూడా వారు ఓటమిని చవిచూడవలసి వస్తుంది. తమకు అంతర్‌దృష్టి-దివ్యదృష్టి మరియు రిద్ధి-సిద్ధులు మరియు విభూతుల అనంత శక్తి-సామర్థ్యములు ఉన్నప్పటికి ఓటమిని అంగీకరించవలసి వస్తుంది.

అలా ఎందుకు జరుగుతుందంటే సాధకునికి తన సాధనా సామర్థ్యము మీద నమ్మకము పెరుగుతుంది. తనను ప్రేమిస్తున్నానని చెప్పేవారితో, తమని ప్రేమించమని కోరేవారితో తాను, తన సర్వస్వమును త్యాగము చేశానని చెబుతుంటాడు. అయితే ఆ మాటలలో దాగి ఉన్న సత్యము మరొకటి!!

అనుభవజ్ఞులకు ఈ విషయము తెలుసు. అటువంటి అనుభవజ్ఞుల అనుభవము ద్వారా పరీక్షల తర్వాత తేలిన సత్యమేమిటంటే 'సాధకునికి తనసాధనా సామర్థ్యము మీద పెట్టుకునే భరోసానే నిజానికి అతని అస్తిత్వములో అహంకార బీజానికి అంకురార్పణ గావిస్తుంది. అది ఎంతో సాత్వికమైనదే అగుగాక! కానీ చివరికి అది వినాశకారకమే అవుతుంది. సాధన ఎంత సాటిలేనిది, ఎంత లోకోత్తర ఖ్యాతిగాంచినప్పటికి, సాధకుడు ఎంత సమర్థుడైనప్పటికి వాస్తవానికి అది ఆ దివ్యజనని యొక్క పరమ సామర్థ్యములోని అనంతమైన అంశములో ఒక నగణ్యమైన అంశమే అవుతుంది. ఈ అఖిల బ్రహ్మాండ సృష్టిలో మహామాయయే సర్వసమర్థురాలు! ఇతర జనుల వద్ద ఆ మాత ప్రసాదించిన ఒక్క స్వల్ప అంశ మాత్రమే ఉంటుంది.

ఈ ప్రకారముగా ఆధ్యాత్మిక సాధకుని జీవనములో వ్యక్తిగత సంబంధాలకు స్థానమేమీ ఉండదు. నా భర్త, నా భార్య, నా పుత్రుడు లేక నా పుత్రిక ఇవన్నీ లోకవ్యవహారమునకు సంబంధించినంతవరకు సరియైనవే! అయితే ఈ అనుభూతి సాధకుని ఆంతరిక భావనలలోకి చొరబడినచో అది సదా సర్వదా వినాశకారకమే అవుతుంది. సాధకుని ఆంతరిక చేతనలో 'నేను నా మాతృదేవి సంతానమును! ఆ విశ్వజననియే నా సర్వస్వము! నా సర్వస్వము మీద ఆమెకే సర్వాధికారమున్నది! మిగిలినదంతా ఆ మాత లీలచేత సంస్కారవశంగా, కర్మవశాత్తు సంభవిస్తున్నది! కాలానికి వశమై, కర్మకు అధీనమై జతకూడిన ఈ సంబంధాలన్నీ కర్మపరిపక్వమైన వెంటనే కాలము ద్వారా చేయబడే మార్పుతో పాటు నశించిపోతాయి!' అన్న భావన ఎల్లప్పుడు మనస్సులో మెదులుతూ, బలపడుతూ ఉండాలి. ఈ సత్యము బోధపడనివారిని అహంకార, మమకారములు రెండు కూడా తమ వశములో పెట్టుకుంటాయి. ఈ **'నేను-నావి' అనేవి మహామాయ యొక్క మాయారూపాలు.** అవే సురథమహారాజును వశపరచుకున్నాయి.

ఇలా మహారాజు సురథుడైనా లేక మరెవరైనాసరే వారు కోలావిధ్వంసుల చేతిలో ఓటమిని అంగీకరించవల్సినదే! ఎందుకంటే **అహంకార, మమకారాలు సాధకుని వివేకమును హరించివేస్తాయి, నశింపజేస్తాయి.** వివేకరాహిత్యంచేత అహంకారం మనిషిని అంధుడిని చేస్తుంది. మమత అనేది మాయ యొక్క భ్రాంతి మార్గాలను నిర్మిస్తుంది. ఈ స్థితికి లోనైన సాధకులు పరమ సమర్థులైనప్పటికి తమ సామర్థ్యమును సద్వినియోగపరచుకొనలేరు. అయినా ఆత్మసాధనా కులమును నష్టపరిచే శత్రువులు అల్పసంఖ్యాకులైనప్పటికి కూడా విజయమును వరిస్తారు. ఎందుకంటే ఏవిధంగా అయితే జూదగాని ధనరాశిని మరెవరో కాక, స్వయముగా అతని జూదప్రవృత్తే నశింపజేయుటలో సమర్థమైనదో, ఇదీ అటువంటిదే! సమస్త ధనం, మహా సామ్రాజ్యం కూడా ఈ ఒక్క చిన్న జూదక్రీడలో పణముగా పెట్టబడ్డాయి. నలమహారాజు మరియు యుధిష్ఠిరుని పురాణగాథలు ఈ విషయమునే ప్రమాణీకరిస్తున్నాయి. మహాతాపసులైన ఋషులను కూడా ఈ అహంకార, మమకారాలు ఎన్నోమార్లు పతనము గావించాయి. నూతన సృష్టి సంరచనలో సమర్థుడు, ప్రచండ తపోబల సంపన్నుడు అయిన విశ్వామిత్రుడు కూడా ఈ కారణముచేత ఎన్నోమారులు పరాజయం చూడవలసి వచ్చింది. ఇందువలన ఆత్మసాధన నష్టపరిచే వృత్తులు తక్కువగా ఉన్నప్పటికి కూడా సాధకుడిని పరాజితుడిని కావించుటలో సమర్థవంతమైనవే!

ఈ శ్లోకమంత్రము యొక్క ఆధ్యాత్మిక-దార్శనిక సత్యముతో పాటు ఆ మంత్రములో దాగిన సత్యము ఇవ్వబడినది.

**లక్ష్యాన్ని సాధించేదాకా విశ్రమించకండి**

## సాధనా విధానము

**వినియోగము: ఓం అస్య శ్రీ "తస్య తైరభవద్ యుద్ధం" ఇతి సప్తశతీ షష్ఠ మన్త్రస్య శ్రీవేదవ్యాస ఋషిః, శ్రీవామాకాళీ దేవతా, హ్రాం బీజం, జ్వాలాముఖీశక్తిః, శ్మశానకాళీ మహావిద్యా, తమోగుణః, ఘ్రాణజ్ఞానేన్ద్రియం, ఉగ్రరసః, కరకర్మేన్ద్రియం, తీవ్ర స్వరం, అగ్నితత్త్వం, నివృత్తి కళా, క్రీం హ్రీం ఉత్కీలనం, ప్లావనీ ముద్రా, మమ జ్ఞాన భక్తి వైరాగ్య క్షేమస్థైర్యాయురారోగ్యమభి వృద్ధ్యర్థం శ్రీఆదిశక్తి మాతా గాయత్రీ రూపేణా యోగమాయా భగవతీ శ్రీ మహాదుర్గా ప్రసాద సిద్ధ్యర్థం చ నమోయుత ప్రణవ వాగ్బీజ స్వబీజ లోమ విలోమ పుటితోక్త షష్ఠ మన్త్రజపే వినియోగః ॥**

### న్యాసః

| | కరన్యాసము | షడంగన్యాసము |
|---|---|---|
| ఓం ఏం హ్రాం | అంగుష్ఠాభ్యాం నమః | హృదయాయనమః |
| ఓం నమోనమః | తర్జనీభ్యాం నమః | శిరసేస్వాహా |
| తస్య తైరభవద్ యుద్ధం | మధ్యమాభ్యాం నమః | శిఖాయై వషట్ |
| అతిప్రబల దణ్డినః | అనామికాభ్యాం నమః | కవచాయహుమ్ |
| న్యూనైరపి స తైర్యుద్ధే | కనిష్ఠికాభ్యాం నమః | నేత్రత్రయాయ వౌషట్ |
| కోలావిధ్వంసిభిర్జితః | కరతలకర పృష్ఠాభ్యాం నమః | అస్త్రాయఫట్ |

### ధ్యానం

**మేఘాఙ్గీ శశిశేఖరాం త్రినయనామానన్ద సంవర్ద్ధినీమ్ ।**
**నగ్నాం వా నృకరాం వరాం శవ శివారూఢాతి తీవ్రా రతిం ॥**
**కలాస్యావృత్యాంకుశం ప్రమథతీం సవ్యే హ్యమీతిం వరమ్ ।**
**దక్షాధోర్ధ్వ కరామ్బుజే నరశిరః ఖడ్గం వహన్తీం భజే ॥**

### మంత్ర

**ఓం ఏం హ్రాం నమః తస్య తైరభవద్ యుద్ధమతిప్రబలదణ్డినః ॥**
**న్యూనైరపి స తైర్యుద్ధే కోలావిధ్వంసిభిర్జితః ॥**
**నమో హ్రాం ఏం ఓం ॥ 6 ॥**

**1000 జపాత్ సిద్ధిః దశాంశ తిల ఘృత హోమః గాయత్రీ మహామంత్రజప 10,000, గాయత్రీ విధానేన దశాంశ హోమః** గాయత్రీమహామంత్రజపం 10,000 చెయ్యాలి. గాయత్రీ విధానమును అనుసరించి నువ్వులు, నెయ్యిని కలిపి అందులో పదవవంతు హోమము చేయాలి.

10 మాలల గాయత్రి, 1 మాల సప్తశతీమంత్రము । ఈవిధంగా పదిదినములు అనుష్ఠించి, ఆ తరువాత ప్రతిఒక్క దానికి దశాంశముతో ప్రత్యేక హోమము చేయాలి.

**ఆధ్యాత్మిక ఫలశృతి:** ఆధ్యాత్మిక సాధనలో ఎదురయ్యే విఘ్నములను తొలగించుకునే సమర్థవంతమైన జ్ఞాన ప్రాప్తి.

**లౌకిక ఫలశృతి:** తన ఆంతరిక మరియు బాహ్య శత్రువులను గుర్తించే శక్తి ఒనగూడుట.

గాయత్రీమహామంత్ర సాధన చేత ఈ సప్తశతీ మంత్రసాధన కొద్ది సమయములోనే తన అమోఘమైన ప్రభావమును చూపిస్తుంది. దీని ప్రభావముచేత సాధకుడు స్వయముగా తనలో ఎంత శక్తి సామర్థ్యములను వికసింపజేసుకుంటాడంటే తద్వారా సహజముగానే అతనికి తన అంతర్యాత్రలో ఎదురయ్యే అవరోధములు బోధపడతాయి. వాస్తవానికి అవి అతనితో మిత్రత్వపు పరదామాటున దాగి శత్రుత్వమును నిభాయించే ప్రయత్నము సాగిస్తూ ఉంటాయి. ఉపాసనా బలము చేత బాహ్య జీవితములో కూడా అతను వాటి మారువేషాలను గుర్తించ గలుగుతాడు. ఒక్కమారు వాటి నిజస్వరూపమును గుర్తించ గలిగినట్లయితే ఆదిశక్తి విశ్వజనని కృపచేత వాటిమీద గల మోహం కూడా పటాపంచలైపోతుంది. తత్కారణముగా అతని జీవనయాత్ర సహజముగాను, సుగమముగాను సాగిపోతుంది. అతని ఆధ్యాత్మిక మార్గము కూడా కాంతులీనుతూ ప్రశస్తమౌతుంది. కేవలము సాధనా జనులు మాత్రమే ఈ విధానమును స్వీకరించి దానిని అనుభూతి చెందగలరు. ఎందుకంటే సాధనావిధానములు తన సామర్థ్యమును క్రియాన్వితము కావించుకున్న తరువాతే ప్రత్యక్షానుభూతి కలుగజేస్తాయి. సాధనామయ జీవితమే శబ్దాలను మంత్రశక్తిగా మార్చగలదు.

*– అఖండజ్యోతి, మే 2009*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

### నిజమైన లక్ష్మీ పూజ

*ఆ రోజులలో బుద్ధుడు దానం, అపరిగ్రహం గురించి ప్రవచనాలు ఇచ్చేవారు. ఆ ప్రవచనం విన్న అర్థివసుడనే గొప్ప ధనవంతుడు ఒక్కపైసా కూడా వృథాగా ఖర్చుచెయ్య రాదని నిర్ణయించుకున్నాడు. కొడుకులు, కోడళ్ళు విలువైన ఆభరణాలు, ఇతర వస్తువులు కోరడం పట్ల తిరస్కారం తెలియ జేస్తూ వారికి నిరాడంబరత గురించి బోధించసాగాడు. ఈయన నలందా విశ్వవిద్యాలయ నిర్మాణ సమయంలో తన యావదాస్థిని బుద్ధుని పాదాల వద్ద సమర్పించాడు.* ***సంపద అంటే శ్రమకు ప్రతిఫలమే. దైవదత్తమైన శారీరిక శక్తి ద్వారా సంపాదించిన ధనమును సత్కార్యములకు వినియోగించుటయే నిజమైన లక్ష్మీ పూజ.***

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**ఎక్కువగా వినండి - తక్కువగా మాట్లాడండి**

# యోగికి అన్నీ సంభవమే

ఒకప్పటి మాట ఇది. మహాపురుషులు విశుద్ధానంద గారి గురించి తెలిసినప్పుడు, ఆయన వద్ద ఉన్న అలౌకిక శక్తుల గురించి కూడా తెలియవచ్చింది. అవి ఎంత అసాధారణమైనవి అంటే ఎవరు కూడా అంత తొందరగా విశ్వసించేవారు కాదు. నిజంగా "అచింత్య మహిమాన్. ఖలుయోగిన్" శాస్త్ర వాక్యాన్ని విశ్వసించే వాడిని నేను, మరియు దేశ, విదేశాల్లోని ప్రాచీన, నవీన యోగుల్లోని విభిన్న సాంప్రదాయాల్లో అనేక మంది యోగులు ఉన్నారని, సిద్ధ యోగులు నివసించేవారని గ్రంథాల్లో చదివాను, అంతేకాక వారి నిత్య జీవనంలో అనేక అలౌకిక సంఘటనలు జరిగినట్లు కూడా నేను విశ్వసిస్తున్నాను. అంతేకాదు, ప్రస్తుత కాలంలో కూడా మన చుట్టూ మనమధ్యలోనే అటువంటి మహాత్ములు ఉన్నారు, ప్రత్యక్షంగా వారిని దర్శించి వారిలో సంభాషించిన విషయం మనం విన్నప్పటికి మన మనస్సు ఒప్పుకోడానికి సందేహిస్తుంది. అందుకని ఓ రోజు ఆ సందేహ నివృత్తి కొరకు అటువంటి ఓ మహాపురుషుని దర్శనార్థం వెళ్ళాను.

సంధ్యా సమయం దగ్గర పడుతున్నది, సూర్యుడు కొద్ది సేపట్లోనే కొండలమాటుకు వెళ్ళబోతున్న సమయమిది. నేను వెళ్ళి చూసాను. వ్యాఘ్ర చర్మం మీద ఆసీనులై, అనేకమంది భక్తుల సముదాయంలో సౌమ్యస్థితిలో ఉన్న ఓ మహాపురుషుడు. అందమైన ఆజానుబాహుడు. మెరుస్తున్న విశాల నేత్రాలు, పండిన వయస్సు, మెడలో తెల్లని జంజము, కషాయ వస్త్రాలు ధరించి ఉన్నాడు. భక్తుల ద్వారా సమర్పింపబడిన పూలు, పూలమాలలు చరణాల వద్ద ఉన్నాయి. మహాత్మునికి సమీపంలోనే ఓ గుండ్రని స్వచ్ఛమైన యంత్రం ఒకటి ఉంది. ఆయన ఆ సమయంలో ప్రాచీన ఆర్ష విజ్ఞానం, యోగ విద్యా రహస్యాలను వ్యాఖ్యానిస్తున్నారు. కొంతసేపు వారి ఉపదేశం విన్న తరువాత వారి వ్యాఖ్యానంలో ఎన్నో విశేషమైనవి ఉన్నాయనిపించింది. వారి గంభీరమైన మాటల్లోనే అర్థమవుతున్నది వారు చెప్పేది కేవలం శాస్త్రజ్ఞానం ద్వారా చెప్పబడేవి కావని, అనుభవపూర్వకంగా సిద్ధింపచేసుకున్న విషయాలని. ప్రపంచంలో సర్వత్రా వ్యాపించిన శక్తి సూక్ష్మరూపం ఉన్నదని ఇది అన్ని పదార్థాలలోను వ్యాపించి ఉన్నదని విశదీకరిస్తున్నారు. అయితే ఏ పదార్థంలో అయితే అధికంగా ఉంటుందో అది బాహ్యంలో అభివ్యక్తమవుతుంది. ఇంద్రియ గోచరం అవుతుంది, లేదంటే అభివ్యక్తమయ్యే ప్రసక్తే లేదు. లోహం యొక్క ముక్కలు లోహమే కానీ మరోటి కాదు; దానిలో సమస్త ప్రకృతి అవ్యక్త రూపంలో దాగుకొని ఉన్నది, కానీ లోహం అనే ప్రధాన భావం వల్ల మిగతా శక్తులన్నీ విలీన రూపంలో కనపడకుండా ఉంటాయి. విలీన రూపంలో ఉన్న ఏ పదార్థమైనా (ఉదా: స్వర్ణమే కావచ్చు) సంస్కార రూపంలో ఆ లోహాన్ని పెంచినట్లయితే అంతవరకు అవ్యక్త రూపంలో ఉన్న ఆ శక్తి ప్రబలమై ఆ వస్తువు తన పేరు, రూపము మార్చుకుని 'బంగారం' అనే పేరుతో పిలవబడుతుంది.

జిజ్ఞానం కోసం నేను సంధించిన అనేక ప్రశ్నల పరంపరకు సమాధానమిస్తూ నాతో ఇలా అన్నారు. "నీకు ఇది చేసి చూపిస్తాను". ఈ మాటలు అని వారు ఆసనము మీద ఉన్న గులాబీ పూవుని చేతిలో తీసుకుంటూ, చెప్పు దీన్ని ఏ రూపం లోనికి మార్చమంటావు" అని అడిగారు. అప్పుడు అక్కడ మల్లెపూలు లేవు. అందుకని నేను మల్లెపువ్వుగా మార్చమని కోరాను. ఆ నా మాటలను తిలకించిన వారు కుడిచేతిలో గులాబి పుష్పాన్ని ఉంచి, ఎడమ చేతిలో స్ఫటిక యంత్రం (magnifying glass భూతద్దం) ద్వారా సూర్య కిరణాలను గులాబీ మీద కేంద్రికరించారు. క్రమంగా దానిలో స్థూల మార్పు రాసాగింది. మొదటగా ఒక ఎరుపు ప్రస్ఫుటమయ్యింది, మెల్లమెల్లగా గులాబి వీలీనమయ్యి అవ్యక్తమయ్యింది, అంతేకాక దానిస్థానంలో ఒక క్రొత్త కోమలమైన, వికసిస్తున్న మల్లె కన్పించసాగింది. నమ్మశక్యం కాని నేను దాన్ని నాతోపాటు ఇంటికి తీసుకెళ్ళాను. ఒకవేళ మెస్మరిజంలాంటి వశీకరణానికి లోనయ్యి, మల్లెపువ్వు అక్కడ లేకపోయినా ఉన్నట్లుగా భ్రమకు లోనయ్యానేమో అని తేల్చుకోడానికి ఆ పువ్వును భద్రపరచు కున్నాను. కానీ అది ఎండి, వాడిపోయేంత వరకు కూడా అలాగే ఉంది.

స్వామి వారు అన్నారు, "ఇదే విధంగా సమస్త జగత్తులో ప్రకృతి యొక్క ఆట సాగుతుంటుంది, ఈ ఆట యొక్క తత్వాన్ని కొంతమందే అర్థం చేసుకుంటారు, వారే జ్ఞానులు. అజ్ఞానులు ఆటను అర్థం చేసుకోలేక విభ్రాంతికి లోనవుతుంటారు. యోగ సిద్ధి లేకుండా జ్ఞాన, విజ్ఞానం ఎవ్వరికి ప్రాప్తించదు. ఇదే విధంగా విజ్ఞాన రహితంగా యోగి నిజమైన ఉన్నత స్థితికి చేరుకోలేడు.

అప్పుడు నేను ప్రశ్నించాను "అలా అయితే యోగికి అన్ని సంభవమేనా?" దానికి ఆయన సమాధానమిస్తూ, "తప్పకుండా! నిజమైన యోగికి ఇది సంభవం, అది అసంభవము అని ఏదీ

**నిరంతర ప్రయత్నంతో విజయం సాధ్యం**

లేదు. ఏ విధమైన హద్దు లేకుండా ఏదైనా చెయ్యగలడు". మరింత విశదీకరిస్తూ ఆయనే తిరిగి ఇలా అన్నారు "ఆదర్శయోగి ఆ పరమేశ్వరుడే, ఆయనకు తప్ప ఈ జగత్తులో శక్తి యొక్క మహత్తు తెలిసిన వారెవ్వరు లేరు. నిర్మల భక్తితో, అనన్య చింతనతో ఎవరు ఆ దేవదేవుణ్ణిని ఆరాధిస్తారో, వారు ఆయన అనుగ్రహం మేర శక్తిని సంపాదించుకుంటారు"

నేను తిరిగి ప్రశ్నించాను "పువ్వును మీరు మార్చగలిగారు. అయితే అది యోగశక్తి ద్వారా చేసారా లేక ఏదైనా ఉపాయం ద్వారా సంభవమా?" స్వామీజీ అన్నారు "ఉపాయం మాత్రం యోగశక్తి కాదా? రెండు వస్తువులను సమ్మిళితం చేయడం యోగ అనే పిలవబడుతుంది. నిజమైన యోగం అంటే ఇదే. నేను సూర్య విజ్ఞానం ద్వారా పుష్పాన్ని సృష్టించాను. యోగబలము, పరిపూర్ణమైన ఇచ్ఛా శక్తి ద్వారా అన్ని పనులు సాధించవచ్చును, కానీ ఇచ్ఛాశక్తిని జోడించకుండా కూడా విజ్ఞాన కౌశలంతో సృష్ట్యాది కార్యములు చేయవచ్చు. నేను అడిగాను "సూర్య విజ్ఞానం అంటే?" దానికి సమాధానంగా స్వామీజీ" జగత్తు మొత్తానికి సూర్యుడే సవితా శక్తి. ఎవరైతే సూర్యరాశిని, దానిలోని వర్ణాలను చక్కగా అర్థం చేసుకుంటారో, ఎవరైతే ఈ వర్ణాలను (రంగులను) పరస్పరం మిశ్రితం చేయగలరో వారు చాలా సహజం గానే పదార్థాల యొక్క సంఘటిత (combination), విఘటనలు (dissociation) చేయగలరు".

నేను తిరిగి ప్రశ్నించాను, "మీరు ఈ విజ్ఞానాన్ని ఎలా సంపాదించారు? నేనైతే ఈ పేరే విని ఉండలేదు". వారు మందహాసం చేస్తూ, "మీ యొక్క విజ్ఞానం ఏపాటిది? ఈ విజ్ఞానం భారతదేశం యొక్క సొత్తు. మహోత్కృష్టులైన ఋషీగణాల కృషి ఇది. ఉపయుక్తం అని భావించినప్పుడే దానిని వారు ప్రయోగిస్తారు. ఈ విజ్ఞానాన్ని ఇప్పటికి అవలంభిస్తున్న వారు ఉన్నారు. వారు హిమాలయాల్లోని టిబెట్ ప్రాంతాల్లో నిగూఢంగా నివాసముంటున్నారు. నేను స్వయంగా టిబెట్ యొక్క మారుమూల ప్రాంతాలలో ఉన్న 'జ్ఞాన్‌ఖండ్' అన్న పేరుగల ఓ యోగాశ్రమంలో ఉంటూ, ఒక మహాపురుషుడు, యోగి వద్ద దీర్ఘకాలం సేవ చేస్తూ, కఠోర సాధనలో, ఇలాంటి అనేక లుప్తమైన విద్యలెన్నో నేర్చుకున్నాను. అయితే ఇది చాలా జటిలమైన దుర్గమమైన విద్య, దీని బాధ్యత కూడా అత్యంత కష్టదాయకమైనది. అందుచేతనే ఆచార్యులు ఎవరికిపడితే వారికి దీనిని నేర్పరు'.

నేను ప్రశ్నించాను, "ఏమిటి ఇలాంటి విద్యలు ఇంకా ఉన్నాయా?" దానికి వారు "అవును అలాంటివే మరికొన్ని – చంద్ర విజ్ఞానం, నక్షత్ర విజ్ఞానం, వాయు విజ్ఞానం, క్షణ విజ్ఞానం, శబ్ద విజ్ఞానం, మనోవిజ్ఞానంలాంటి ఎన్నెన్నో విద్యలున్నాయి. కేవలం పేర్లు విన్నంత మాత్రం ఏమి అర్థం చేసుకుంటారు? మీరు శాస్త్రాల్లో విన్న విద్యలే కాకుండా, ఇంకా ఎన్నెన్ని విద్యలు ఉన్నాయో?"

*– మహా మహోపాధ్యాయ ఆచార్య గోపీనాథ్ కవిరాజ్ ఎం.ఎ.*

*– అఖండజ్యోతి, అక్టోబర్ 1941*

*అనువాదం: ఎమ్.ఎస్.ఎన్. గుప్త*

## మనలోనే శక్తి ఉన్నది

*నువ్వు సాఫల్యం గురించే ఆలోచిస్తే నీకు అదే దక్కుతుంది. భౌతిక పనులకే నీ హృదయాన్ని సమర్పిస్తే నీకు లభించే సాఫల్యం కొంత వరకే పరిమితమవుతుంది. ఆత్మ యొక్క ఆజ్ఞలను పాలించడం కూడా అవసరమని గుర్తు పెట్టుకో. ఆధ్యాత్మికంగా, భౌతికంగా కూడా సమానమైన ఉన్నతి లభించనంత వరకు లౌకిక ఆనందం కూడా దొరకదు.*

*పాపాన్ని పూర్తిగా తొలగించి దాని స్థానంలో పుణ్యం నింపగల సామర్థ్యం నీలో ఉన్నదని మనోవిజ్ఞానం చెప్తుంది. ప్రేమ కిరణాలను వెదజల్లితే ఘృణా రూప నిశాచరి పారిపోతుంది. మనిషి తన జీవితాన్ని చాలా వరకు స్వర్గంగా మార్చుకోగలడు.*

*శక్తి మొత్తం నీలో నుండే వస్తుంది, సారమంతా లోపలే ఉంటుంది. అంటే ఆత్మ వెలుపల దేన్నో వెతికే ప్రయత్నం చేయడం వ్యర్థం. నీ భౌతిక శరీరంలోనే శక్తులన్నీ నిండి ఉన్నాయి. నీ సూక్ష్మ శరీరం కూడా లోపలే ఉంటుంది. చావు పుట్టుకలు, ప్రేమ, ద్వేషాలు, సత్యాసత్యాలు, శక్తి సామర్థ్యాల గురించే కాక జరిగిన ప్రతి సంఘటనకు సంబంధించిన వివరాలు, జ్ఞానం, ఆత్మ నేర్చుకున్న విద్యలన్నీ కూడా స్మృతిలో నిక్షిప్తమై ఉంటాయి. పూర్వ జన్మలకు సంబంధించిన స్మృతి కలగగానే మీ ఊహకి కూడా అందని జ్ఞాన భాండాగారం మీ ముందుంటుంది.*

*నీవు ఎలా మారాలని కోరుకుంటే అలా మారగలవు, ఏది చేయాలనుకుంటే అది చేయగలవు. ఈ విషయంలో ఆడ, మగ, చిన్న, పెద్ద తేడాలేమీ ఉండవు. భూతకాలం గతించిపోయింది. ఇప్పుడు మిగిలింది వర్తమానం, భవిష్యత్తు. వాటిని ఎలా కావాలంటే అలా మలుచుకోవచ్చు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**ఏ రోజు పనులు ఆ రోజే పూర్తి చెయ్యండి**

# ఎంత సుందరమైనది ఈ సృష్టి

పరమాత్మ, ఈశ్వరుడు, బ్రహ్మ, పరమపిత మొదలైన ఎన్నో నామాలతో పిలవబడే ఒక 'అనాది శక్తి' యొక్క ప్రకాశ ప్రేరణతోనే ఈ జగత్‌లోని పదార్థాల జ్ఞానం లభిస్తుంది. దాని ప్రభావంతోనే, సృష్టిలోని విభిన్న పదార్థాల జ్ఞానం, కార్యం, సౌందర్యం ప్రతిఫలిస్తుంది, ఆ అనాదిశక్తి తన సమగ్ర రూపంలో అవతరించి సత్యరూపంలో స్థాపించబడుతుంది. సాధకుడు ఈ విరాట్ జగతిరూపంలో పరమాత్మ దర్శనం పొందగలుగుతున్నాడు. ఆ దివ్యశక్తి చేతన ఆధారం మీదనే సూర్య, చంద్ర, నక్షత్రాలు ఈ పృథ్వీ మొదలైనవి ప్రకాశిస్తున్నాయి. జగత్-ఆధ్యాత్మికతల స్థూల-సూక్ష్మ దృశ్యంతో పాటు వాటి తత్వం పరిపూర్ణంగా ఎక్కడ అనుకూలంగా ఉంటుందో అక్కడ 'సత్యం' యొక్క పూర్ణత్వం వెల్లివిరుస్తుంది. ఏనాడు ఈ సత్యం జీవనసాధనకు ఆధారమౌతుందో ఆనాడు ఈ జగత్ ప్రేరకుని సర్వశక్తుల పరిచయం ప్రాప్తిస్తుంది. అందుకనే శాస్త్రకారులు 'సత్యాన్నే' జీవితంలో సహజదర్శనంగా భావించారు. మహర్షి విశ్వామిత్రుల వారు **"సత్యేనారప్రతపతి సత్యే తిష్ఠతి మేదిని! సత్య వ్యక్తి పరోధర్మః స్వర్గే సత్యే ప్రతిష్ఠితిః"** అని అన్నారు.

అనగా సత్యం ఆధారంగానే సూర్యుడు తపిస్తున్నాడు. సత్యం మీదనే ఈ పృథ్వి నిలబడి ఉంది. సత్యమే అన్నిటికంటే గొప్ప ధర్మంగా విలసిల్లుతుంది. సత్యం ఆధారం మీదనే స్వర్గం ప్రతిష్ఠించబడింది.

సమగ్ర ఆధ్యాత్మిక దర్శనానికి 'సత్యమే' మూలాధారం. తూర్పు-పడమరలు ఏ విధంగా కలసిపోయి ఉంటాయో, ఆ ప్రకారంగానే జగత్తు-ఆధ్యాత్మికత, దృశ్య-అదృశ్యాల తత్వము సత్యానికి రెండు ప్రక్కల అంచులుగా ఉంటాయి. వాటిలో ఏ ఒక్కటి లేకపోయినా సత్యాన్ని దర్శించుట అసంభవమవుతుంది. సత్యంతో శివం, సుందరం కలిసే ఉంటాయి. 'శివ' కి అర్థం ఆనందం, కళ్యాణ కారకం, సుందరానికి అర్థం పులకింత కలిగే భావాత్మక విశేషత్వం. జగత్తు యొక్క అన్ని సంఘటనలు కేవలం బాహ్య సంఘటనలుగా అనుకొని వాటిని విశ్లేషించుట చేయదలచు కుంటే వాటిలో ఆనందం ఏ మాత్రం లభించదు. ఆ స్థితిలో ఉన్న సంఘటనల విశ్లేషణ కేవలం పనికిరాని, యాంత్రికంగా జరిగే పనిలాగే మిగిలిపోతుంది. ఇనుప పట్టాలపైన సాగిపోయే రైలులాగా, రోడ్డు మీద సాగే వాహనాలవలె, శిలాఖండాల మీద జాలువారే నది ధారలాగా, మనోమానసం మీద జగతీ ధార ప్రవహిస్తూ ఉంటుంది. 'చిత్తం' మీద దాని ప్రభావం ఏ మాత్రం పడదు. అంతా నిర్జీవ-నీరసంగా, ఏ మాత్రం రుచిలేక అనిపిస్తుంది. కాని జీవనంలో ఒక క్రొత్తదనం, సరసత, సద్భావనలను కలగలపి చూసిననాడు, పరమపిత పరమాత్మ ఈ సుందర సృష్టిని ఎంత కళాత్మకంగా తీర్చిదిద్దాడో గమనించగలము. ఇంతటి సుందర, అనుపమ సృష్టి ఉద్యానవనంలో ఎన్నో రకాల పుష్ప సౌరభాలు మత్తు గొలుపుతూ, మానసంలో పులకింతల అనుభూతులను వెల్లివిరియుటమనే భావనలో మునిగిపోతాము. రాత్రి ఆకాశంలో ప్రకాశించే నక్షత్ర సమూహాల జిలుగు వెలుగులను చూస్తూ ఉంటే పరమాత్మ ఆకాశంలో ఎన్నో సుందర సురుచిర దీపజ్యోతులను అలంకరించినట్లు, నీలి ఆకాశంలో నల్లటి దుప్పటి మీద మెరిసే ముత్యాలను వ్రేలాడదీసినట్లుగా నయనానందం కలుగుతుంది.

వైజ్ఞానికులు శక్తివంతమైన టెలిస్కోపులతో ఆకాశాన్ని దర్శించినప్పుడు, కవితాదృష్టి కలిగిన విజ్ఞానవేత్తలు కూడా పులకించిపోతారు. మామూలు దృష్టితో చూస్తే గ్రహాలు, నక్షత్రాలు ఒకే విధంగా కన్పిస్తూ ఉంటాయి. కాని టెలిస్కోప్ దూరదర్శినితో పరికించినప్పుడు ఆకాశంలో రకరకాల రంగుల దీప స్తంభాల కొమ్మలకు రంగురంగుల దీపాలను వ్రేలాడదీసినట్లుగా గోచర మవుతాయి. సామాన్య దృష్టితో చంద్రబింబాన్ని చూసినప్పుడు ఎంతో ఆనందం కలుగుతుంది. కాని పూర్ణచంద్రుని చూసిన చాలామంది భావకవులుగా మారిపోయి ఎన్నో కవితలను అల్లారు. ప్రపంచంలోని అన్ని భాషలలోను చంద్రుని వెలుగుల మీద వ్రాసిన కవితలు, మరే విషయం మీద వ్రాసి ఉండలేదు. స్థూల దృష్టిలో చందమామ 2160 మైళ్ళ వ్యాసం గల ఒక ఆరిపోయిన గోళం మాత్రమే! అక్కడ నేల ఎత్తు పల్లాలతో, చిన్నాపెద్దా గుంటలతో నిండిన గుట్టలవలె మనకు కనిపిస్తుంటుంది. కాని రాత్రి సమయంలో తారలతో నిండిన ఆకాశంలో, పౌర్ణిమ రోజున 16 కళలతోకూడి వెలుగులు విరజిమ్ముతూ ఉంటే, అప్పుడు దాని సౌందర్యం చూడటానికి రెండు కళ్ళు చాలవు.

మనం నివసిస్తున్న పృథ్వీ గ్రహమే కాక ఇంకా ఇన్నో గ్రహాలు ఆకాశంలో ఉన్నాయి. మొత్తం 9 గ్రహాలున్నట్లు పెద్దలు చెప్తారు. ఇవి అన్నీ మన సౌర మండలానికి సంబంధించినవే! మన సౌర మండలమేకాక, ఆకాశంలో లక్షల కోట్ల అసంఖ్యాక సౌర మండలాలు కొలువుతీరి ఉన్నాయి. అన్నీ వాటి వాటి పరివారంలో

**మీ ఆలోచనలు, మీ చేతలే మీ భవిష్యత్తును నిర్ణయిస్తాయి**

అనగా వాటి ఉపగ్రహాలతో కూడి ఉన్నాయి. మన సౌర మండలంలోని గ్రహాల స్థితి, వాటి సంరచన ఎలా ఉన్నప్పటికి, మన భారతీయ ఋషులు వాటిని పరమాత్మ అనుపమ సుందర కళాత్మక రూపంగా నిర్మించినట్లు భావించి, ప్రత్యేక మంగళ కరమైన దినాలలో వాటిని పూజించే విధి విధానాలను ఏర్పాటు చేయుట జరిగింది. ఈ పరంపరలో మన ఋషులు పదార్థాల, వస్తువుల విశ్లేషణ, జీవన సమగ్రతను గమనించిన వారై, ఆ గ్రహాల ఆంతరిక సౌందర్యానికి ఎంతో గౌరవంతోపాటు పూజ్య భావాన్ని చూపగలిగారు. కొన్ని సంవత్సరాల క్రితం వైజ్ఞానికులు అంతరిక్ష రహస్యాలను తెలుసుకోగోరి, ఎన్నో అంతరిక్షనౌకా యాత్రలు చేపట్టుట జరిగింది. వాటిలో రష్యాదేశపు స్పుట్నిక్-1,2; లూనిక్-1,2,3; స్పుట్నిక్-3; వోస్టాక్-1,2,3,4,5 ఇంకా 6; లూనిక్-4,5,7,8, 9,10; జోడ్-5, సోయజ్-2,3; జోడ్-5; ప్రోటాన్-4 మొదలైన అంతరిక్ష నౌకలను రోదసిలోనికి పంపుట జరిగింది. అమెరికా కూడా పయనీర్, మిదాస్-ఎక్స్, ఫ్లోటర్, మేరినర్, సిన్‌కోం, రేంజర్, జైమిని, సర్వేయర్, అపోలో మొదలైన ఎన్నో నౌకలను పైకి పంపింది. అంతరిక్ష పరిశోధన కొరకు జరిపిన ఈ కార్యక్రమాల ద్వారా ఎంతో విలువైన సమాచారం లభ్యమయింది.

ఈ యాత్రలలో కొన్ని అంతరిక్ష నౌకలు కుజగ్రహం, బృహస్పతి, శుక్ర, శనిగ్రహాల వరకు చేరుట జరిగింది. ఈ యాత్రల ద్వారా ఆ గ్రహాలకు సంబంధించిన ఫోటోలు భూమికి పంపుటేకాక వాటిద్వారా గ్రహాల వాస్తవిక స్థితిగతులతోపాటు సృష్టికర్తయొక్క అద్భుత కళాకౌశలం కూడా ఆ చిత్రాల ద్వారా స్పష్టంగా తెలిసింది. మన పృథ్వికి ఒక్కటే చందమామ. కాని వరుణ గ్రహానికి రెండు చందమామలున్నట్లు తెలిసింది. అక్కడి ఆకాశంలో ఉన్న ఈ రెండు చంద్రులు, మన భూమికి సంబంధించిన చంద్రుడి ప్రకాశవంతమైన వెలుగులాగానే, అవి కూడా వెన్నెలతో కూడిఉన్నాయి. అదే విధంగా యురేనస్ గ్రహానికి 5 చంద్రుళ్ళున్నాయి.

క్రితం మార్చినెల 5వ తేదీ 1979లో అంతరిక్ష పరిశోధన కేంద్రం ద్వారా పంపిన వాయేజర్-1 వ్యోమనౌక బృహస్పతి నుండి 2 లక్షల 77వేల కి.మీ. దూరం నుండి దాదాపు 15,000 చిత్రాలను పంపుట జరిగింది. ఈ బృహస్పతి గ్రహం మన పృథ్వి నుండి అత్యధికంగా 72 కోట్ల కి.మీ. తక్కువగా 64 కోట్ల కి.మీ. దూరంలో ఉంటుంది. కాని ఆకారంలో మన పృథ్వికంటే 1312 రెట్లు పెద్దగా ఉంటుంది. ఈ వ్యోమ నౌక పంపిన బృహస్పతి గ్రహ చిత్రాలు చూడటానికి ఎంతో అందంగా ఉన్నాయి. ఈ ఫోటోల సహాయంతో బృహస్పతి గ్రహ స్వరూప-స్వభావాలు, నేల ఎలాంటిది, వాతావరణం, రేడియో ధార్మిక వికరణ శక్తి, రేడియో ధార్మిక తరంగాల ప్రవాహాలు, ఇంకా దానిమీద వ్యాపించిన వాయు మేఘాలు, దాని గురుత్వాకర్షణ లేక అయస్కాంత శక్తి మొదలైన విషయాలను కూలంకషంగా తెలుసుకొనుటకు అవకాశం లభించింది.

వాయేజర్-1 అంతరిక్ష యానం ద్వారా బృహస్పతి గ్రహం 5 నుండి 15 కి.మీ. పరిధిలో, ఇంకా ఒక్కోసారి 1 కి.మీ. పరిధితో కూడిన స్పష్టమైన చిత్రాలు లభించాయి. ఈ గ్రహానికి సమీపంగా 6 గంటల ప్రయాణం చేసిన తరువాత వాయేజర్ నౌక తను ప్రయాణించిన మార్గంలో మొత్తం 13 ఉపగ్రహాలలో 5 ఉపగ్రహాలకు సమీపంగా చేరుట జరిగింది. 5 ఉపగ్రహాల పేర్లు 1) అడ్రెస్టియా 2) పెరియాసిస్ 3) గానమీడ్ 4) ఐ.ఒ.ఆర్. 5) కైసిస్యే. వైజ్ఞానికులకు మొదటిసారి, బృహస్పతి, దాని ఉపగ్రహాల అధ్యయనం ద్వారా అనేక రహస్యాలు తెలుసుకొనే అవకాశం లభించింది. ఉదాహరణకు 'కైలిస్యే' ఉపగ్రహం మీద అత్యంత శీతల వాతావరణం ఉండి మంచు ముద్దలు పైకి ఎగురుతూ ఉంటాయి. అంతరిక్ష నౌక పంపిన ఆ చిత్రాలను చూస్తుంటే ఎవరో సుందర మనోహరమైన పెద్ద బంతిని సుతిమెత్తని పట్టుతో తయారుచేసిన విరిదండ గుత్తులతో చుట్టినట్లు అనిపిస్తుంది. బృహస్పతి గ్రహం యొక్క మరొక ఉపగ్రహం ఐ.ఒ.ఆర్. మన చంద్రుడంత పెద్దగా ఉంటుంది. దీనిమీద బృహస్పతి గ్రహం నుండి చెల్లాచెదురైన వికిరణాలు నిరంతరం పడుతుంటాయి. అలా అయినప్పటికి కూడా దాని ఉపరితలం మీద ఏ విధమైన విశేష ప్రభావం లేదు. ఈ గ్రహం నారింజరంగుతో కూడిన ఎరుపు రంగుతో ఉంది. బృహస్పతి గ్రహం మొత్తం వివిధ రంగులతో కూడి ఉంది. 'కైలిస్యే' గ్రహం ముదురు మట్టిరంగు తోను, వెనుక గల మచ్చలు మాత్రం బూడిద రంగులో ఉన్నాయి. వాయేజర్-1 నౌక బృహస్పతి గ్రహం యొక్క అన్ని ఉపగ్రహాల రంగురంగుల చిత్రాలను భూమికి పంపుట జరిగింది.

వాయేజర్-1 అంతరిక్ష నౌక బృహస్పతి, దాని చంద్రుల వివరాలను భూమికి అందించిన పిదప శని, నెప్ట్యూన్, యురేనస్, ఫ్లూటో గ్రహాల వివరాలు తెలుపుటకు ముందుకు సాగింది. ఈ అంతరిక్ష నౌక శనిగ్రహం వద్దకు ఖచ్చితంగా 13.11.1980 నాటికి చేరగలదు. కాని దానికన్నా ముందు 'పయనీర్' పదకొండు 11.09.1979 మొదటివారంలో శనిగ్రహం వద్దకు చేరి, అక్కడ నుండి అనేక చిత్రాలను పంపింది. బృహస్పతి తరువాత మన సౌర మండలంలో శనిగ్రహం అన్నిటికన్నా పెద్ద గ్రహం. ఇది

**జయంబు నిశ్చయంబురా అనుకుంటూ ముందుకు సాగాలి**

మన భూమి నుండి దూరదర్శిని సహాయంతో చూడగా, మెరుస్తున్న పసుపు పచ్చని నక్షత్రంలాగా కనిపిస్తుంది. సూర్యుని తరువాత క్రమములో రాగల 8 గ్రహాలలో దీని స్థానం ఆరవది. ఇది సూర్యుని చుట్టూ ఒక అరబ్ (నూరుకోట్లు) 44 కోట్ల మైళ్ళ సగటు దూరంలో ప్రదక్షిణ చేస్తుంది. శనిగ్రహం మీద పగలు 5 గంటలు 7 నిముషాలు కాలంగాను రాత్రి సమయం అంతే అవధిలో ఉండి భూమితో పోల్చుకుంటే రోజు కాలం చాలా చిన్నగా ఉంటుంది. పృథ్వి మీద ఒక సంవత్సరకాలం శనిగ్రహం మీద $28^1/_2$ సంవత్సరాలుగా ఉంటుంది. భూమి మీద సంవత్సర కాలానికి 365 రోజులుంటే శనిగ్రహం మీద దాదాపు 877 పగళ్ళురాత్రిళ్ళుగా ఉంటాయి. శనిగ్రహం దాని ఇరుసు మీద చాలా తీవ్రగతిలో తిరుగుట చేత రోజు కాలం చాలా చిన్నగా ఉంటడానికి కారణమవుతుంది.

ఇప్పటివరకు శుక్రగ్రహమే చాలా సుందరంగా ఉంటుందని తెలుసుకోగలిగాముకాని శనిగ్రహం మన సౌరమండలం మొత్తం గ్రహాలకన్నా అతిసుందరంగా ఉంటుందని ఇప్పుడు తెలిసింది. దీని నాలుగు ప్రక్కల ఎన్నో రంగుల వలయాలు ఉన్నాయి. అవి మెడలో ధరించే పుష్పమాలలవలె కన్పిస్తూ ఉంటాయి. ఈ వలయాలవల్ల శనిగ్రహం నాలుగు చంద్రుల కాంతితో రంగు రంగులతో కన్పిస్తుంది. భూమి నుండి టెలిస్కోప్ ద్వారా చూస్తే ఈ వలయాలన్నీ అద్భుత అనుపమ సుందరంగా కన్పిస్తాయి. ఈ వలయాలతో కూడిన శనిగ్రహాన్ని మొట్టమొదట వైజ్ఞానికుడైన గెలీలియో 1610వ సంవత్సరంలో కనుగొన్నాడు. అక్కడ కనిపిస్తున్న మొదటి మూడు ప్రముఖ వలయాల మొత్తం వెడల్పు దాదాపుగా 65 వేల కి.మీ. వైజ్ఞానికుల నమ్మకం ప్రకారం, ఈ వలయాలన్నీ ఎప్పుడో దారితప్పిన చంద్రశిలలతో ఏర్పడి ఉంటాయని, శనిగ్రహపు గురుత్వాకర్షణ శక్తివల్ల ఇవి ముక్కలై ఉంటాయని విశ్వసిస్తున్నారు. శనిగ్రహపు ధరాతలం మీద ఉన్న ఈ చంద్రశిల ముక్కలు సూర్యుని వెలుగుతో ఎలా ఉన్నాయంటే, ఎవరో అసంఖ్యాక రంగు రంగు బల్బులు ఆకాశంలో వ్రేలాడదీసారేమోననే విధంగా వెలుగులు విరజిమ్ముతూ ఉంటాయి. 'పాయనీర్' వ్యోమనౌక పింపిన ఈ వలయాల చిత్రాల ద్వారా తెలిసిన వివరం ప్రకారం ఈ వలయాలు మంచుతో కూడిన పెద్ద పెద్ద శిలలుగా గాని లేక ఐస్‌తో కూడిన శిలారూపంగా మారినవైనా అయి ఉండవచ్చు.

పయనీర్-11వ వ్యోమనౌక శనిగ్రహపు ఏ భాగం నుండి ఈ చిత్రాలు తీసి పంపిందో ఆ భాగం పృథ్వి నుండి చూచుటకు కనిపించదు. ఎందుకనగా భూమి నుండి శనిగ్రహం యొక్క ఒక భాగం మాత్రమే చూడటానికి అవకాశముంది. రెండవ ప్రక్క మనకు కనిపించదు. ఈ ప్రయాణంలో ఆ వ్యోమ నౌక పంపిన సంకేతాల ఆధారంగా శనిగ్రహానికి అతిపెద్ద ఉపగ్రహం 'టైటాన్' మీద ప్రాణికోటి మనుగడకు అవకాశమున్నట్లు తెలుస్తుంది. ఈ టైటాన్ ఉపగ్రహంలోని గ్రహాలలో, జీవకోటి ఉనికిని మానవుడు తెలుసుకోగల ప్రయత్నం ప్రారంభమైనట్లు స్పష్టమైంది.

పృథ్వీ నుండి సుదూరంలోని అంతరిక్షపు పరిశోధన ద్వారా మనిషి, తన ప్రయత్నంతో తనదైన ప్రపంచాన్ని గురించి తెలుసుకోవటం ద్వారా ఒక నూతన స్వరూపాన్ని దర్శించినట్లు అయ్యింది. ఈ ప్రపంచం ఎంత సుందరమైంది? దీనిని చూచి తెలుసుకొన్న మానవుడు, వీటి నిర్మాణకర్త, సృష్టి నియామకుడు, ముందు చూపుతో కళానిర్మాణ కౌశలాన్ని చూసి ముగ్ధుడు కాకుండా ఎలా ఉండగలడు? ఇప్పటివరకు ఈ విరాట్ బ్రహ్మాండం గురించి తెలిసింది చాలా తక్కువే. అంతా తెలుసుకొన్నది 1/1000వ వంతు కూడా ఉండి ఉండదు. ఆనాడు శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి దర్శింపచేసిన తన విశ్వరూపదర్శనాన్ని ఈనాటి వైజ్ఞానికుల పరిశోధనల ద్వారా తెలిసిన సత్యం అనురూపంగా ఉన్నది. ఈ విశ్వరూపదర్శనం చూపిన అర్జునుని నోటి నుండి హఠాత్తుగా ఈ మాటలు వెలువడ్డాయి. నీవే ఆదిదేవుడు, అనాది కాలం నుండి ఉన్న పురాణ పురుషుడవు. నీవే ఈ సమస్త జగతికి ఆశ్రయ భూతుడవు. పరంధాముడవు నీవే! అనంత రూపాలతో విలసిల్లే తమరిద్వారానే ఈ సకల సృష్టి విశ్వవిఖ్యాతంగా విరాజిల్లుతుంది. ఈ చరాచర జగత్తుని భక్తి భావంతో దర్శించిన మీదట, ఎవరికైనా "భావతరంగం" ఉప్పొంగిపోవటమనేది ఎంతో స్వాభావికమే కదా!

*– అఖండజ్యోతి, జనవరి 1980*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

## దుర్గుణాల వల్లనే ఓటమి

*సుగ్రీవునికి రాజ్యాభిషేకం జరిగింది. అతడు రాముని శక్తి గురించి కీర్తిస్తూ నా ప్రభువు యొక్క శక్తి ఎంత గొప్పది అంటే వాలి వంటి మహావీరుడిని కూడా ఒకే బాణంతో కూల్చగలిగాడు అని అంటాడు. ఆ పలుకులు విన్న రాముడు చిరునవ్వుతో పైకి కనిపించేది నా శక్తి, కాని అసలు రహస్య మేమిటంటే వాలి యొక్క దుర్గుణాలు, దురాచరణలు అతడిని డొల్లగా చేశాయి. అటువంటి స్థితిలో ఒకే ఒక బాణంతో అతను నేలకు ఒరగడం సంభవించింది అంటూ వాస్తవాన్ని సుగ్రీవునికి తెలియజేస్తాడు.* – ప్రజ్ఞాపురాణం నుండి

**సృజనాత్మకత శక్తిని పెంచుకోవాలి**

అందమే ఆనందం

# హానికరమైన సౌందర్య సాధనములు

"సౌందర్యం" అనేది ఒక అద్భుతమైన ఆకర్షణ. అందువల్లే అందరు అందంగా ఉండాలని అనుకుంటారు. అందంగా ఉండుట కొరకు అనేక రకములైన సౌందర్య సాధనాలను ఉపయోగిస్తారు. మనదేశంలో సౌందర్య సాధనాల రేట్లు అన్నింటి కన్నా అధికంగా పెరుగుతున్నాయి. సౌందర్యాన్ని పెంచే ఈ సాధనాలు కొన్ని చౌకగాను కొన్ని ఎక్కువ ఖరీదుగా ఉంటాయి. వారి ఆర్థిక పరిస్థితిని బట్టి వాళ్ళు వాడుకుంటారు. కాని సౌందర్య సాధనాలు చర్మానికి విపరీతంగా హానిచేస్తాయి. వీటివల్ల మన చర్మమునకు మేలు జరగక పోగా హాని కలుగుతుంది. వాటిని ఉపయోగించటం వల్ల చర్మంపైన ఒకపొరలాంటిది. ఏర్పడి చర్మానికి హాని చేకూరుస్తుంది.

ఫ్యాషన్స్ ఎక్కువగా ఇష్టపడేవారికి ఈ విషయం ఖచ్చితంగా నచ్చదు. సౌందర్యాన్ని పెంచే సాధనాలు అనేక రకముల క్రీములు, లిప్‌స్టిక్, పౌడర్లు, మొదలగునవి తయారవుతున్నాయి. ఇవి ఎక్కువగా ఉపయోగించటం వల్ల చర్మానికి హాని కలుగుతుందని కొన్ని పరిశోధనల వలన తేలింది. చర్మం తడి లేకుండా ఎండిపోతుంది. దాని ప్రభావము మనస్సు మీద కూడా పడుతుంది. మనస్సు చికాకుగాను, అశాంతిగాను తెలియని అలసటతో ఉంటుంది. సౌందర్యాన్ని పెంచే ఈ సామాగ్రిలో 'కాస్మెటిక్స్'లో ఉండు రసాయన పదార్థాల వల్ల చర్మానికి సంబంధించిన అనేకమైన జబ్బులు రావచ్చు. అవి వాడే వ్యక్తి చిన్న వయస్సులోనే వృద్ధుడిగా కనపడతారు. ఇది నిపుణుల అభిప్రాయం.

సుమారు పది పదిహేను సంవత్సరాల క్రిందటి వరకు పెర్ఫ్యూమ్, డియోడరెంట్, ఖరీదైన లిపిస్టిక్, పౌదరు, భంగు మొదలైన సౌందర్య సాధనాలను ధనవంతులు మాత్రమే విలాసంగా వాడుకొనేవారు. కాని ఇప్పుడు పొట్టపోషించుకొనుటకు బయటికి వెళ్ళేవారందరు ఈ సాధనాలను ఉపయోగిస్తున్నారు. దాదాపు ప్రతి ఇంటిలో ఇవి మనకు కనబడుతుంటాయి. కాని చాలామందికి ఈ సౌందర్య సాధనాల వల్ల చర్మం అనేక రోగాలకి గురి అవుతుందని తెలియదు. వీటివల్ల మానవ జీవితాలపైన విపరీతమైన ప్రభావం ఏర్పడుతుంది. వీనిలో హాని కలిగించే రసాయనిక పదార్థాలను ఉపయోగిస్తారు. దానివల్ల చర్మ సౌందర్యాన్ని పెంచటం బదులుగా వాటి గుర్తులను గాఢంగా చర్మంపైన పడేస్తుంది. అనేకకరములైన రసాయనిక పదార్థాల వల్ల దురదలు రావచ్చును. చర్మముపైన సన్నటి మొటిమలు రావచ్చును. కొన్ని రసాయనిక పదార్థాల వల్ల సైడ్ ఎఫెక్ట్స్ (side effects) వచ్చి, దాని ప్రభావం వల్ల చర్మంపైన గుండ్రని ఎర్రటి మచ్చలు ఏర్పడతాయి.

రెటినాల్, హైడ్రో క్వినోన్ మొదలగు రసాయనిక పదార్థాలు చర్మానికి హాని కలిగిస్తాయి. రెటినాల్ యాంటి ఎజింగ్ క్రీములకు ముఖ్యమైన రసాయనం. దీనివల్ల చర్మం పైపొర నిస్సారము అవుతుంది. దానివల్ల దురద రావచ్చు. రెటినాల్ వల్ల చర్మమును సూర్యకిరణాల వేడిని తట్టుకోలేదు. అందువల్ల శరీరానికి ఎండ తగలకుండా చూసుకొనవలసి వస్తుంది. హైడ్రోక్వినోన్ క్యాన్సర్ రావటానికి కారణము అవుతుంది. ఒక్రోనోసిస్ అను చర్మ వ్యాధికి కారణము అవుతుంది. ఈ వ్యాధి వల్ల చర్మము వికృతముగా మారుతుంది. చర్మము మొద్దు బారుతుంది, రంగు కూడా తయారవుతుంది. "పాలీ పాయలీన్ గ్లాయికాల్, డియాజోలిడినాయల్, యూరియా ఫెనోక్సిల డైనాయిల్ మొదలగు రసాయనిక పదార్థాలను ఉపయోగించటం వల్ల విపరీతమైన దురదలు రావచ్చును. ఎలర్జీ వచ్చి మచ్చలు ఏర్పడుతాయి. చాలామంది షాంపును తలస్నానానికి వాడతారు. షాంపులో సోడియం లారిల్ సల్ఫేట్ మొదలగు రసాయనిక పదార్థాలు ఉంటాయి. దానివల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. వెంట్రుకలు త్వరగా తెల్లబడతాయి. కృత్రిమమైన సుగంధాన్ని సౌందర్యాన్ని పెంపొందించే సాధనాలు ఎక్కువగా ఉపయోగములో ఉన్నాయి. వీటివల్ల దురదలు, తలనొప్పి, చర్మంపైన బొబ్బలు కూడా రావచ్చును. తీవ్రమైన సైడ్ ఎఫెక్ట్స్‌కి గురి అవుతారు. దానివల్ల చర్మం నల్లబడుతుంది. చర్మాన్ని ముఖాన్ని శుభ్రము చేయటానికి క్లారిఫాయింగ్ లోషన్‌లో మినరల్ ఆయిల్ చర్మం యొక్క రోమ రంధ్రాలను పూడ్చి వేస్తుంది. చర్మాన్ని సాగదీస్తుంది. దానిలో ఉన్న రసాయన పదార్థాల వల్ల ఒక రకమైన ఎలర్జిక్ రియాక్షన్ వస్తుంది. చర్మానికి ఉపయోగించే కృత్రిమ రంగు క్రీములో, హెయిర్‌డై వంటి ఉత్పాదనలలో రసాయన పదార్థాలను కలుపుతారు. దీనివల్ల ఎలర్జిక్ రియాక్షన్ జరగవచ్చు.

"ట్రై ఇథెనాల్ మా ఇన్" అను రసాయన పదార్థాన్ని స్కిన్

**రేపటిపై ఆశపెట్టుకో**

కేర్ (చర్మసంరక్షణ), పిహెచ్. వేల్యూ పెంచటానికి ఉపయోగిస్తారు. దీనివల్ల ఈ చర్మము ఎండిపోయినట్లు అవుతుంది. కళ్ళలో దురద కూడా ప్రారంభమవుతుంది. ముఖమును తెల్లబరచే క్రీములలో వాడే కొన్ని రసాయన పదార్థాల వల్ల ఎంజైమ్స్ కూడా నష్టపోతాయి. దానివల్ల చర్మం ఎండిపోతుంది. చర్మంపైన ఎర్రటి మచ్చలు ఏర్పడతాయి. ఘాటు (గాఢమైన) అయిన రసాయన పదార్థాలతో తయారయిన సాధనాలు ఉపయోగించటము వల్ల ఆయిల్ ఎక్కువ ఉత్పత్తి అవుతుంది. చర్మం జిడ్డుగా కనపడుతుంది. జిడ్డుగా ఉన్న చర్మాన్ని శుభ్రముగా ఉండటానికి చాలామంది మహిళలు అనేక రసాయన పదార్థాలతో కూడిన ద్రవాలతో (face wash) కడుక్కుంటారు. ఇలా అనేకసార్లు కడుక్కోవటం వల్ల చర్మం తెల్లబడుతుందని భావిస్తారు. కాని ఇది తప్పు. అనేకసార్లు ముఖాన్ని శుభ్రము చేయటము వల్ల చర్మం ఎండిపోతుంది. దానివల్ల ఆయిల్ ఇంకా ఎక్కువ ఉత్పత్తి అవుతుంది. రోజుకి రెండు లేక మూడుసార్లు ముఖము శుభ్రము చేసుకుంటే సరిపోతుంది. శుభ్రమైన బట్టను రోజ్ వాటర్ (Rose Water)లో ముంచి ముఖమును శుభ్రము చేసుకున్నచో ఇంకా ఎక్కువ లాభదాయకమని చికిత్సా విజ్ఞాని డా॥ జయసింహ అభిప్రాయం.

లక్నోలోని ప్రపంచ విజ్ఞాన ప్రయోగశాలలో దేశంలో పేరున్న బ్రాండ్‌లో సౌందర్యాని పెంపొందించే సాధనాల ద్వారా పరిశోధన చేయబడింది. ఈ ప్రయోగములో **కాస్మెటిక్స్‌లో అల్ట్రా వయోలెట్ కిరణాలకు పీల్చుకునే లక్షణము ఉండటం వల్ల అవి ఉపయోగించే వ్యక్తి యొక్క ఆయుష్షును తగ్గిస్తుంది.** దాని గురించి ప్రభుత్వం ప్రజల మేలు కొరకు ప్రచారము చేయవలసి ఉన్నది. మధ్యతరగతి ప్రజలు దానివల్ల వచ్చు ప్రమాదాన్ని తెలుసుకుంటారు.

మనదేశములో గ్రామాల్లో నివసించే వారు కూడా సౌందర్య సాధనాలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. పౌడరు, క్రీమ్, లిప్‌స్టిక్, ఐ లైనర్, మస్కారా మొదలగునవి ముఖ్యమైనవి. వివాహ సమయములో పెండ్లి కుమార్తెకు ఈ సౌందర్య సాధనాలను ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ కాలంలో ఇవి ఉపయోగించకుండా పెండ్లి కుమార్తె అలంకరణ పూర్తి అవదు. ఎంత ఎక్కువగా ఉపయోగిస్తే అంత సౌందర్యం పెరుగుతుందని వారి ఉద్దేశ్యము. కొందరు ఆడపిల్లలు మేకప్‌ను రాత్రి నిద్ర సమయంలో కూడా తీయరు. మేకప్‌తో నిద్రించటమువల్ల వారి చర్మానికి హాని కలుగుతుంది. రసాయన పదార్థాలతో తయారు అయిన ఈ సాధనాలు చర్మంపైన ఎక్కువసేపు ఉండటం వల్ల దాని ప్రభావము చర్మం మీద పడుతుంది.

సౌందర్యాన్ని పెంచే ఎక్కువ సాధనాలలో హాని కలిగించే సూపర్ రాడీకల్, ఆక్సయిడ్ ఉపయోగిస్తున్నారని ఉప ముఖ్య చికిత్సాధికారి డా॥ అనిల్‌వర్మ అన్నారు. వీటిని ఎల్లప్పుడు వాడటం వల్ల చర్మ రోగాలు కలుగుతాయి. నోరు, చేతులు, ఇలా సౌందర్య సాధనాలని ఎక్కడ ఎక్కువగా ఉపయోగిస్తామో అక్కడ చర్మం ముడతలు పడుతుంది. ఎక్కువగా వాడటం వల్ల 40,45 సంవత్సరాలకే వృద్ధాప్యం కనపడుతుంది. సౌందర్య సామాగ్రిలో ఏ రసాయనం ఉపయోగిస్తారో అది సూర్యుని వెలుతురు తగలగానే విషంగా మారుతుంది. ఇందులో కొన్ని గుణాలు సూర్యుని యొక్క 'అల్ట్రావయెలెట్ కిరణాలతో చర్మం లోపలికి ప్రవేశిస్తాయి. దీనివల్ల కోశికావో యొక్క ప్రొటీను ఆర్.ఎన్.ఎ. అయి మరియు డి.ఎన్.ఎ. బాగా నష్టాన్ని చేకూరుస్తుంది. కొన్ని సార్లు ఇది క్యాన్సర్‌కు దారితీయవచ్చు. కృత్రిమమైన ఈ సౌందర్య సాధనాలు కొంత సమయము వరకు అందాన్ని పెంచుతాయి. కాని చర్మం యొక్క వయస్సును తగ్గిస్తాయి.

మన చర్మంపైన అనేక రోమరంధ్రాలు ఉంటాయి. దాని నుండి స్వేదము శరీరానికి అనవసరమైన ద్రవ్యాలు వెలుపలికి వస్తాయి. ఎప్పటికప్పుడు శుభ్రము చేయటము కూడా చాలా అవసరము. అందువల్లే గట్టిగా రుద్దుకొని స్నానము చేయాలని అంటారు. అలా చేస్తే రక్త ప్రసరణ బాగుంటుంది. చర్మము శుభ్రముతో పాటు మెరుస్తూ ఆరోగ్యంగా ఉంటుంది. రసాయనిక పదార్థాలతో తయారయిన సౌందర్య సాధనాలు చర్మం యొక్క ప్రతిరోధక క్షమతను తగ్గిస్తుంది. దానివల్ల చర్మం బలహీనమయి, ఎండిపోయి ముడతలు కనపడతాయి. అనేకసార్లు రకరకాల చర్మరోగాలకు గురి అవుతారు.

సౌందర్యాన్ని పెంచటానికి ప్రకృతిలో లభించేవి చాలా ఉన్నాయి. పసుపు, చందనము, కీరా, సెనగపిండి, ఘృతకుమారి మొదలగునవి. వీటిని వాడటం వల్ల చర్మం అందంగా మెరుస్తుంది. చర్మం యొక్క ఆయుష్షుని కూడా పెంచుతాయి. క్రమమైన పద్ధతిలో వాడటం వల్ల చర్మంపై ముడతలు రావు. ఒకవేళ వచ్చినా వాటిని తొలగించటానికి చర్మానికి సహాయపడుతుంది. పూర్వ కాలములో మనదేశములో వివాహ సమయంలో పసుపు, చందనము, శనగపిండి, కలబంద, నూనె మొదలగునవి వాడే రివాజు ఉన్నది.

ఈ రోజులలో ప్రతీచోట అందంగా కనపడటానికి మేకప్ యొక్క వాడకం పెరుగుతూనే ఉంది. ఫిల్మ్ ఇండస్ట్రీలో,

**పుట్టుకతో ఎవరు గొప్పవారు కాదు**

నాటకాలలో, నృత్యం మొదలగువానిలో పనిచేయువారు అభినయము చేసేటప్పుడు ఎక్కువగా మేకప్ వాడుతుంటారు. కాని ఇప్పుడు సామాన్య ప్రజలు కూడా అందంగా కనపడటానికి తమ కార్యక్షేత్రంలో వీటిని ఉపయోగిస్తున్నారు. అందువల్ల మినరల్ మేకప్, కాస్మెటిక్ ఇండస్ట్రీలో ఒక విప్లవం లాగా వచ్చింది. ఇది స్కిన్ ఫ్రెండ్లీయే (skin friendly) కాక ఎన్విరాన్‌మెంటల్ ఫ్రెండ్లీ (environmental friendly) కూడా. ప్రపంచంలో ఈ సౌందర్య సాధనాలు క్రొత్తగా పరిశోధించినవి కావు. దీని మూలము ప్రాచీన నాగరికతతో కలసి ఉన్నది. ప్రాచీన కాలములో ఈజిప్టు దేశ మహిళలు భూమిలో ఉండే విలువైన మెరిసే రాళ్ళతో పౌడరు మరియు ఇతర సౌందర్య సాధనాలను తయారుచేసి తమ ముఖములు అందముగా మెరిసేందుకు వాడేవారు. అదేవిధంగా ఇప్పుడు కాస్మెటిక్ ఇండస్ట్రీలో విలువైన రాళ్ళని మరియు ఖనిజ పదార్థాల పౌడరు క్రీమ్ ఫౌండేషన్ ఐషాడో, మస్కారాని తయారుచేయటానికి ఉపయోగిస్తున్నారు.

మేకప్ చర్మంపైన ఒక ఆవరణవలె ఉంటుంది. దానివల్ల చర్మం యొక్క అసలైన అందము కనబడదు. అంతేకాక ఆ మేకప్ యొక్క అందము కొంత సమయం వరకే ఉంటుంది. సౌందర్యాన్ని పెంపొందించుటకు ప్రకృతిలో లభించేవి వాడినప్పుడు చర్మానికి ఎలాంటి హాని కలుగదు. అంతేకాక చర్మానికి లాభము కూడా కలుగుతుంది. దానితోపాటు పుష్టికరమైన, ఆరోగ్యమైన ఆహారం తీసుకోవాలి. వ్యాయామం చేయుట, వాకింగ్ చేయుట సరిపోయినంత నిద్రపోవుట అవసరము. శారీరకంగా, మానసికంగా శ్రమ చేయటం కూడా అవసరమే. ఇవన్నీ చేయటం వల్ల శరీరము అందంగా, ఆరోగ్యంగా ఉంటుంది. దానివల్ల మనస్సు కూడా ఆహ్లాదంగా ఉంటుంది. **మనిషి యొక్క సౌందర్యం మంచి గుణములతో కూడిన వ్యక్తిత్వమే.** శరీర సౌందర్యాన్ని పెంచుకోవటంతోపాటు మంచి గుణములు పెంచుకొనటానికి ప్రయత్నం చేయాలి. అప్పుడే జీవితములో నిజమైన సౌందర్యం కనబడుతుంది.

– *అఖండజ్యోతి, జూన్ 2012*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజ్యం*

## ప్రేమమయ వాతావరణం

*కార్నెగీ తండ్రి మగ్గం నేసేవాడు. తల్లి కూడా తోళ్ళకొట్లోను, లాండ్రీలోను పనిచేసి, కొంత డబ్బు సంపాదించేది. ఇలా చేస్తేనేగాని వారికి ఇల్లు గడిచేదికాదు. కానీ కార్నెగీ తండ్రి భార్యను ఒకదేవతవలె ఆరాధించేవాడు. ఆమె పనికి వెళ్ళేటప్పుడు ప్రతిరోజు కూడా క్రొత్త పెళ్ళి కూతుర్ని సాగనంపినంత బాధగా వీడ్కోలు చెప్పేవాడు. ఆ అపారమైన ప్రేమానురాగాలు ప్రతినిత్యం కార్నెగీ మనోఫలకం మీద ముద్రపడేవి. ఆ ప్రభావం చిన్నారి కార్నెగీని ఎంతో ఉన్నతుణ్ణి చేసింది. భావ సంవేదనల నిలయంగా అతని అంతరంగం పరిపక్వత చెందసాగింది. తల్లిదండ్రుల మధ్య నుండే సంబంధ బాంధవ్యాల ప్రభావం పిల్లల మీద ఎంతగానో పడుతుంది. ఈ అవకాశం గృహస్థాశ్రమంలో తప్ప మరెక్కడా లభించదు.*

*కార్నెగీకి ఉన్న ఒక్క చొక్కా మురికిపోయేటట్లు తల్లి ప్రతినిత్యం జాగ్రత్తగా ఉతికి ఇస్త్రీచేసి ఇచ్చేది. దీనివలన అతనిలో తల్లిపట్ల అపారమైన కృతజ్ఞత చోటుచేసికొనేది. ఇతనికి పెద్దచదువు అబ్బలేదు. కానీ ఇంట్లో నెలకొని ఉన్న ఆత్మీయతతో కూడిన ఆ వాతావరణం అతణ్ణి ఎంతగానో తీర్చిదిద్దింది. కాస్త పెరిగి పెద్దవాడు కాగానే టెలిగ్రాఫ్ ఆఫీసులో చిన్న నౌకరీ లభించింది. టెలిగ్రామ్ ఇవ్వటం, తీసికోవటంవంటి విధి విధానాలను వెంటనే నేర్చుకొని క్రమంగా పరీక్షలన్నింటిలో ఉత్తీర్ణుడై ఆఫీసరయ్యాడు. తరువాత కొంత స్థలాన్ని కొని దానిలో వ్యవసాయానికి సంబంధించిన ఒక కర్మాగారాన్ని నిర్మించాడు. అలాగే ఒక చమురుబావిని కూడా కొనుగోలు చేశాడు. క్రమంగా ఆదాయం అనేకరెట్లు పెరిగింది. కుటుంబంలో సుసంపన్నమైన వాతావరణం నెలకొన్నది. అయినా వివాహం చేసుకోమని ఎందరు ఎన్ని అవకాశాలు కల్పించినా ఈయన తిరస్కరించి ప్రేమమూర్తులైన తల్లిదండ్రులకు సేవచేస్తూ ఉండిపోయాడు. వివాహం వల్ల మనస్సు, సమయం, రెండుగా చీలిపోతాయని, తన తల్లితండ్రుల ఋణాన్ని పూర్తిగా తీర్చలేనని తెలియజేసేవాడు. ఇటువంటి ఉత్కృష్ట భావనలు అతనిలో కలుగటానికి కారణం అతని బాల్యంలో అతని తల్లితండ్రులు ఒత్తిడి చేసి, నిర్బంధించి చదివించిన చదువు ఎంత మాత్రం కాదు. వారు అతని చుట్టూ నెలకొల్పిన ప్రేమమయ వాతావరణమే.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**కృషి, పట్టుదలతో ఎవరైనా గొప్పవారు కావచ్చు**



పూజ్య గురుదేవుల అమృతవాణి

# విగ్రహారాధన యందు దాగి ఉన్న సంకేతాలు, శిక్షణలు - 2

*గత సంచిక తరువాయి...*

## శబరి యొక్క సేవ

మనలో ఈ సేవా భావమే కనుక ఉంటే మన కర్తవ్యములు, ధర్మముల గురించి శంకరుని వద్దకు వెళ్ళి నేర్చుకొని వచ్చేవారము. మనం రామాయణంలోని పాత్రలవలె బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. జటాయువువలె భగవంతుని కనుల నుండి నీరు తెప్పించగలగాలి. మన కన్నీరు భగవానునిపై పడనవసరం లేదు. మూడవనేత్రమును తెరిపించే ఒక సంఘటన రామాయణంలో ఉన్నది. శబరి అనే స్త్రీ మాతంగఋషి ఆశ్రమ సమీపంలో నివసించేది. ఆశ్రమ విద్యార్థులు ఉదయాన్నే స్నానాదుల కొరకు నదికి వెళ్ళేవారు. వారు వెళ్ళే త్రోవ అంతా అటవీప్రాంతం. పిల్లలు తెల్లవారుఝామున వెళ్ళడం వల్ల కాళ్ళల్లో ముళ్ళు గ్రుచ్చుకునేవి. ఆ దృశ్యం ఒకనాడు శబరి కంట పడింది. ఆమె హృదయంలో కరుణ పొంగింది. వారు నా పిల్లలు కాక పోతేనేమి, ఎవరికైనా పిల్లలే కదా, పాపం చదువుకుంటున్నారు. తనకు చదువు లేకపోయినా వారికేమైనా సహాయం చేయాలి అనుకున్నది. మానవసేవే మాధవసేవ అని భావించింది. అంతే పిల్లలకంటే ముందే లేచి మహర్షి ఆశ్రమం నుండి నదీతీరం వరకు రోజు శుభ్రంగా చిమ్మడం మొదలుపెట్టింది. మాతంగఋషి ఆమెను పిలిచి 'శబరీ నీవు వృద్ధురాలవు, అని చెప్పి శబరిని ఆ పని చేయవద్దని ఆయన వారించాడు. కాని ఆమె చిమ్మేపని కొనసాగించింది. బాట ఎవరు శుభ్రం చేస్తున్నారో తెలియని విద్యార్థులు ఒకరోజు 'గురుదేవా, ఇంతకుముందు మా కాళ్ళకు ముళ్ళు గ్రుచ్చుకునేవి, ఇప్పుడు దారంతా ఎవరో చిమ్మినట్లు శుభ్రంగా ఉంది. మాకు ముళ్ళు కూడా గ్రుచ్చుకోవడం లేదు. రోజు ఎవరు వచ్చి శుభ్రపరుస్తున్నారు' అని అడిగారు.

## గురుభక్తురాలు

ఋషి ఇలా అన్నారు. 'ఎవరు మానవసేవే మాధవ సేవ అని భావించి సేవ చేసేవారిని దేవతని, భగవంతుడని పిలవాలి. అందువల్ల వీరిలో ఎవరో ఒకరు వచ్చి చిమ్ముతున్నారేమో చూడండి. మనిషి మాత్రం ఈ పని చేయడు. ఎందుకంటే అతను చాలా టక్కరివాడు, నిజాయితీలేనివాడు, స్వార్థపరుడు. ఏ పని చేసినా అందులో తన లాభమెంతో చూసుకుంటాడు. ఒకవేళ శ్రీగణేశుడి వద్దకు వెళ్ళినా ఆయన ఎలుకనో లేదా ఏనుగుదంతానో తెచ్చుకోవాలని, అది అమ్ముకుని సొమ్ము చేసుకోవాలని ఆలోచిస్తాడు.' కానీ శబరి టక్కరిది కాదు. ఒక భక్తురాలు ఎలా ఉండాలో ఆమె అలాగే ఉంటుంది. 'విద్యార్థులారా, ఎవరి మనస్సులో సేవా ప్రవృత్తి ఉంటుందో ఆ వ్యక్తి భగవంతుడే. అప్పుడు పిల్లలు – అయితే గురుదేవా మీరు మాకు భగవంతుని చూపిస్తారా? దేవత దర్శనం చేయిస్తారా? అని అడిగారు. అప్పుడు ఋషి – మీరు దాగి కూర్చుని ఉండండి. బహుశా మీకు దొరుకుతాడేమో అన్నారు. పిల్లలు అలాగే చేశారు. శబరి తన పద్ధతి ప్రకారం రాత్రిపూట చిమ్మేందుకై వచ్చింది. వారు ఆమెను పట్టుకుని 'నీవు దేవతవు, భగవంతునివి' అని చెప్పసాగారు. దానికామె 'లేదులేదు, నేను శబరిని, నేను చదువులేనిదాన్ని, అస్పృశ్యురాలను, నన్ను తాకవద్దు' అని వారించింది.

## ఆ దేవత ఇంటికే రాములవారు వచ్చారు

నీవు అస్పృశ్యురాలవు కావు, ఎవరి మనస్సులో సేవా భావనలు, కరుణ, పరోపకార భావనలు ఉప్పొంగుతుంటాయో ఆ మనిషి అస్పృశ్యుడు ఎలా అవుతాడు? అని విద్యార్థులు అన్నారు. ఆమె అంటరానిదెలా అవుతుంది. వెంటనే మతంగఋషి ఆశ్రమ ప్రాంగణంలో ఆమెను హాజరుపర్చారు. ఆయన 'శబరీ నీవు రోజు శుభ్రంగా చిమ్ముతున్నావు కదా, ఇక్కడే భోజనం కూడా చేసివెళ్ళు' అన్నారు. అందుకామె 'స్వామీ, సేవకు మారుగా సేవ అనేది ఉండదు. సేవకు వెల కూడా చెల్లించకూడదు. నా అవయవాలు చక్కగా పనిచేస్తున్నాయి, అటువంటప్పుడు నేను ప్రతిఫలమెలా తీసుకుంటాను. అడవిలో నేను చక్కగా కంద మూలాలను, ఫలాలను నాటుకుని వాటితో నా పొట్ట నింపుకుంటుంటాను. ఇతరుల ముందు చేయి చాపాల్సిన అవసరం నాకు లేదు' అని చెప్పి తన కుటీరానికి వెళ్ళిపోయింది. కానీ తను రోజూ చేసే చిమ్మే కార్యక్రమం మాత్రం ఆపలేదు. శ్రీరాముల వారు అడవిలో సీతాదేవిని వెతుకుతూ వచ్చినప్పుడు మాతంగ ఋషి ఆశ్రమానికి కూడా వచ్చారు. ఆయన శబరి ఎక్కడ ఉంటుంది? అని అడిగారు. ఋషి చెప్పారు. అప్పటికే తిరిగి తిరిగి రాములవారి కాళ్ళు బొబ్బలెక్కి పోయాయి అయినా అలాగే శబరి ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళి తలుపుతట్టారు.

**శక్తి, సామర్థ్యాలు అందరిలోను ఉంటాయి**

శబరి : ఎవరు?

రాములవారు : నేను రాముడిని

శబరి : నేను భజించే రాముడేనా!

రాములవారు : అవును

శబరి : అయితే మీరు నా ద్వారం వద్దకు ఎలా వచ్చారు?

రాములవారు : భక్తురాలు భగవంతుని వద్దకు రాకపోతే భగవానుడే భక్తుల వద్దకు రావాలి కదా! ఇది శబరి పరంపర అంటే, అలాగే ఉండాలి కూడా, భక్తుడు రాకపోతే భగవంతుడే రావాలి. శబరీ భక్తిలో ప్రామాణికతను సాధించి నిరూపించుకున్నావు, సంస్కృత శ్లోకాలు చదవడం రాకపోయినా, మంత్ర జపాలు, కర్మ కాండలు, అనుష్టానాలు ఏవీ చేయడం రాక పోయినా భక్తుని మనస్సులో ఉండవలసిన సిద్ధాంతాలు,ఆదర్శాలు నీకున్నాయి. అందుకే నేనే వచ్చాను. నీవు నాకు ప్రసాదం తినిపించవా?

శబరి : భగవంతుని ప్రసాదం భక్తులు తినాలి కానీ భక్తుని ప్రసాదం భగవంతుడెలా తింటాడు స్వామీ?

రాములవారు : లేదు శబరీ భక్తుని ప్రసాదం కూడా భగవంతుడు తింటుంటాడు.

## విదురుని ఇంట జరిగిన విందు

విదురుని ఇంటిలో కూడా ఇలాగే జరిగింది. విదురుని భార్య శ్రీకృష్ణుని చూసిన ఆనందంలో అరటితొక్కలు ఆయనకిచ్చి పండు క్రింద జారవిడిచింది. అది చూసి విదురుడు భగవానునికి పండు పెడతారా? తొక్కలు పెడతారా? అని వారించబోగా భగవానుడు కలుగచేసుకొని 'విదురా, నీవు మా మధ్యకు రావద్దు. ఇక్కడ నాకు ప్రేమ తినిపించబడుతున్నది' అన్నాడు. భగవంతుడు ప్రేమను తింటాడు తప్ప వస్తువులను తినడు. ప్రసాదంగా పెట్టిన వస్తువులను పూజ తరువాత మీరు, మేము అందరం తిని ప్రసాదంగా పంచుతాము. మీరు తినే వస్తువులతో భగవంతునికేమి పని? ఆయనకు ప్రేమ కావాలి. ఇదే శంకరభగవానుని యొక్క వివేకమనబడే నేత్రము. ఒకవేళ శబరి కనుక ఇచ్చిపుచ్చుకుని, లాభనష్టాలు బేరీజు వేసుకునే ఈ జంజాటంలో పడి మనం చేసిన పనికి లాభమా? నష్టమా అని లెక్కించుకొని ఉంటే మాతంగ ఋషితో 'స్వామీ మీరు నా తిండి గురించే మాట్లాడుతున్నారు, మరి నాకు బట్టలు, వృద్ధాప్య పెన్షన్, ఉండేందుకు ఒక వసతి గృహం, అందులో విద్యుత్ సౌకర్యం అన్నీ ఏర్పాటు చేయండి' అని అడిగి ఉండేది. శంకరభగవానుని మూడవనేత్రమువలె ఆమె యొక్క మూడవనేత్రము కూడా తెరుచుకున్నది.

## హనుమంతుని యొక్క మారువేషధారణ

రామచంద్రులవారు ఋష్యమూక పర్వతానికి చేరుకున్నప్పుడు హనుమంతుడు బ్రాహ్మణవేషంలో ఆయన వద్దకు వచ్చాడు. ఆయనకు నమస్కరించి 'స్వామీ మేము బ్రాహ్మణులము, మీరిరువురు ధనుర్బాణాలు, ఆయుధాలు ధరించి ఉన్నారు. మిమ్మల్ని ఆ వాలి పంపించాడా? పంపలేదు కదా! మేము చాలా పేద బ్రాహ్మణులం కనుక మమ్ము చంపవద్దు.' అని అన్నాడు. ఈ మాటలన్నీ హనుమంతుడు సుగ్రీవుని వద్ద నౌకరుగా పనిచేస్తున్నప్పటివి. దాన్ని వదిలి భగవంతునికి నౌకరుగా పని చేయడం మొదలుపెట్టాడు. అప్పుడు జాంబవంతుడు హనుమంతునితో 'నీవు సముద్రం దాటు' అన్నాడు. అందుకాయన నేను కోతిని కదా! కాళ్ళు విరుగుతాయేమో అన్నాడు. 'ఏమీ విరగవు, ఎందుకంటే నీవు నీ కొరకుకాక భగవానుని పనికొరకు ఎగరాలనుకుంటున్నావు' అన్నాడు జాంబవంతుడు. **మూడవ నేత్రమంటే భగవానుని కొరకు, భగవానుని పనిచేయి, ఆయన సంకేతాలను తెలుసుకోమని అర్థం.**

## నిజాయితీ, అలవాట్లు, సిద్ధాంతము, వ్యక్తిత్వము

**భగవానుని సంకేతాలు అంటే సాదాజీవితం-ఉన్నత ఆలోచనలు అని అర్థం.** మన యొక్క ఉన్నతమైన ఆలోచనలు, శ్రేష్టమైన పనులు ఏవైతే ఉన్నాయో అవే ఆయన యొక్క సందేశాలు. హనుమంతుడు ఎప్పుడు ఆ దారిలోకి వచ్చాడో ఒక్క గెంతులో సముద్రాన్ని దాటాడు. నలుడు, నీలుడు సముద్రంపై వంతెన నిర్మించడం మొదలుపెట్టారు. అప్పుడు వంతెనపై వేసిన రాళ్ళు మేము కూడా కొంత సాయం చేస్తాము అని నీటిపై తేలడం మొదలుపెట్టాయి. మీరు ఆశ్చర్యపడవద్దు. లోకకళ్యాణ భావనతోనే వంతెన నిర్మాణం జరుగుతున్నది. ఒకవేళ నలుడు, నీలుడు వద్ద వంతెననిర్మాణం కాంట్రాక్టుకు తీసుకొని సగం సిమెంటు, సగం మట్టి కలిపి పిల్లర్స్ వేసి ఉంటే? అప్పుడు నలుడు, నీలుడు దివాలా తీయడమేకాక వంతెన కూడా కూలిపోయి ఉండేది. ఎవరికి ఉపయోగపడేదికాదు. **మానవుని నిజాయితీ, భావనలు, అలవాట్లు, సిద్ధాంతాలు, కర్మ, వ్యక్తిత్వము ఇవన్నీ మూడవనేత్రం తెరుచుకునేందుకు అవసరమవుతాయి.** బయటకు కనిపించే ఈ రెండు కళ్ళు ఖరీదైన దుస్తులను, మంచి ఆహారాన్ని మాత్రమే చూడగలవు. అవి మనలను ఇతరుల దృష్టిలో ధనవంతులుగా, పెద్ద మనుషులుగా చెలామణి కావాలని ప్రేరేపిస్తాయి. కానీ

సానపెట్టనిదే రత్నం ప్రకాశించదు

శంకరభగవానుడు మూడవనేత్రం ఉన్నది. అది మనకు కూడా తెరుచుకుంటే చాలా ఆనందం కలుగుతుంది.

### ఉడుత నిర్వర్తించిన బాధ్యత

ఈ సందర్భంలో ఉడుత తన శరీరంతో ఇసుకను తీసుకెళ్ళి సముద్రంలో చిలకరించింది. కోతి ఇలా అంది 'ఓ ఉడుతా, నువ్వు ఏం చేస్తున్నావు?' అప్పుడా ఉడత "నేను పేదదాన్ని కావచ్చు. చిన్నదాన్ని కావచ్చు, బలహీనురాలిని కావచ్చు, అయినా ఉన్నత సిద్ధాంతాల కొరకు కొంత పని చేయగలను. అని చెప్పి తన వెంట్రుకలలో మట్టిని నింపుకొని సముద్రంలో దులపడం మొదలుపెట్టింది. ఆ ఉడతను పట్టుకొని కోతి రాములవారి దగ్గరికి తీసుకెళ్ళింది. దాన్ని పట్టుకొని రాముడు 'నువ్వు బలహీనురాలివి, నీ సామర్థ్యమెంత, శక్తి ఎంత? నీవు చిన్నదానివి కదా ఏం చేయగలుగుతున్నావు' అని అడిగాడు. అందుకు ఉడత 'నేను శరీరపరంగా, డబ్బుపరంగా చిన్నదాన్నే కానీ మానసికంగా మాత్రం కాదు, హనుమంతులవారంత పెద్దపని చేయలేను. బండరాళ్ళను, కొండలను మోయలేను కానీ మట్టిని నా శరీరంతో తీసుకెళ్ళి సముద్రంలో చల్లగలను' అంది. అది విని రాముడు చాలా సంతోషించి దాన్ని ప్రేమతో హృదయానికి హత్తుకొని దాని వెన్నుపై చేతితో నిమిరాడు. రాములవారు నీలమేఘశ్యామవర్ణుడు కనుక ఆ రంగు దాని వీపుపై గుర్తుగా ఉంచాడు. అది దాని జాతికే వరంగా, వారసత్వంగా లభించింది.

### పూజతో పాటు సేవ కూడా జరుగుతుంది.

భక్తుడు కేవలం భగవంతుని పూజకే పరిమితం కాదు. **పూజతో పాటు సేవ అనే శబ్దం కూడా ఉంటుంది. ఏదో ఒక్కదానివల్ల పని జరగదు. మీరు కేవలం పూజ మాత్రమే చేస్తూ సేవను పట్టించుకోరు. దానినుండి మనస్సును ప్రక్కకు త్రిప్పితే పని జరగదు. మనం జీవితంలో సేవను కూడా అలవర్చుకోవాలి.** మన పిల్లలకు సేవ చేయాలి, సంస్కారవంతులుగా తయారు చేయాలి, భార్యకు కూడా సేవచేసి యోగ్యురాలిగా మార్చుకోవాలి. శరీరానికి కూడా సేవ చేసుకోవాలి, అప్పుడు రోగాలు రావు. పరలోకంలో నరకప్రాప్తి ఉండదు. ఇలా మనం అందరికి సేవ చేయగలం. మీరు కూడా పిల్లల సేవ, తల్లితండ్రుల సేవ చేసుకోండి. పొరుగువారి సేవ, దేశసేవ, సమాజసేవ, సంస్కృతికి సేవ చేయాలి. ఇవన్నీ పూజలో కలిసిపోవాలి.

### శంకరుని నుండి నేర్చుకోండి

మన మూడవనేత్రం కూడా శంకరునివలె తెరుచుకొని ఉంటే శంకరభగవానుని నుండి ఏం నేర్చుకుంటాం? శంకరుని శరీరంపై భస్మం ధరింపబడి ఉంటుంది. ఆయన శ్మశానంలో నివసిస్తాడు, మెడలో కపాలమాల ధరించి ఉంటాడు. అంటే ఏమిటి? శ్మశానంలోనే ఎందుకుంటాడు? ఎందుకంటే జీవితము, మృత్యువు కలిపి ఉంచాలని మనకు నేర్పిస్తున్నాడు. జీవితంతో పాటు మృత్యువును గుర్తుంచుకోవాలి, కానీ మనం మృత్యువును మర్చిపోయాము. మనకు మన యవ్వనం, ఆహారాదులు, లాభనష్టాలు అన్నీ గుర్తుంటాయి. కానీ మృత్యువును మాత్రం పూర్తిగా మర్చిపోయాము. మాకు మా మృత్యువు విషయం గుర్తుంది. మీకు గుర్తుండే ఉంటుంది కదా! అలా గుర్తుండి ఉంటే మా పని మీరు చేసే విధానం ఈ రోజున ఉన్నట్లుగా కాక వేరే విధంగా ఉండి ఉండేది.

### మనమేమీ తీసుకొనిపోలేము

ఇదే మనకు శంకరభగవానుడు నేర్పించింది. ఇది మిగిలిన వారంతా నేర్చుకున్నారు. ఉదా: సికిందర్‌బాద్‌షా అవినీతి, అన్యాయాలతో చాలా సంపదదను కూడబెట్టాడు. చనిపోయే ముందు తన మంత్రులను, తోటివారిని అందరిని పిలిచి నేను జీవితమంతా కష్టపడి కూడబెట్టిన సంపదను కూడా ఈ మరణ సమయంలో తనతో పాటు తీసుకువెళ్ళాలని కోరాడు, ఈ మాత్రం ప్రతిఫలమైనా తనకు దక్కాలని కోరుకున్నాడు. అప్పుడు మంత్రులు కుదరదు అని చెప్పారు. భగవంతుడు మనకు నిర్ధారించినంత వరకు మాత్రమే ఉపయోగించుకోగలం. అంత కంటే ఎక్కువగా ఉపయోగించుకోలేము. ఇది ప్రపంచం యొక్క నియమం. మనం 5 రొట్టెలే తినగలం, 50 రొట్టెలు తినలేము. మీలో ఎవరైనా తినగలిగితే తిని చూపించండి. మీరు నెలకి రూ.6,000/- సంపాదిస్తున్నారు కనుక 50 రొట్టెలు తినగలమంటే తిని చూపించండి. మన హద్దును దాటి తింటే కడుపు నొప్పి, వాంతులు అవుతాయి. మీరు కొంతవరకే తినగలరు. ఒకవేళ మీ దగ్గర చాలా వస్తువులున్నాయనుకోండి. వాటిని మీ కుమారుడో, చెల్లెలో, అత్తయ్య ఇలా మీ సంబంధీకులందరు తలాఒకటి లాక్కుంటారు. వాటిని మీరు ఉపయోగించుకోలేరు.

### జీవితంలో అపరిగ్రహమనే సిద్ధాంతాన్ని పాటించండి

మీకు కుర్తా కుట్టాలంటే మూడున్నర మీటర్ల గుడ్డ కావాలను కోండి, దానితో చక్కగా కుట్టవచ్చు. ఉన్నది కదాని 100 మీటర్ల గుడ్డతో కుర్తా కుడితే అది వేసుకోలేరు, ఉతుక్కోలేరు, తగిలించలేరు, అది వేసుకొని సైకిల్ కూడా తొక్కలేరు. 6 అడుగుల మంచం పడుకునేందుకు వీలుగా ఉంటుంది. వంద అడుగుల మంచం వేయడము కుదరదు, ఇల్లు సరిపోదు. ప్రతి వస్తువును ఉపయోగించేందుకు ఒక హద్దు ఉంటుంది. అది సికిందర్

ప్రణాళికబద్ధమైన శ్రమతో జీవితాన్ని వెలుగుతో నింపుకో

మరచాడు. తన సంపదను తనతో తీసుకుపోవాలనుకున్నాడు. కానీ మంత్రులు కుదరదన్నారు. మీరు ఇప్పటి వరకు తిన్నది, వేసుకున్నది సరిపోయింది. చేసిన మంచి పనులు సరిపోయాయి. మిగిలిన సంపద అంతా ప్రపంచానిది. ఇది అనాది కాలంగా వస్తున్న విధివిధానం. అలాగే జరగాలి, జరుగుతుంది.

## ప్రతి ఒక్క రోజును చక్కగా ఉపయోగించుకోవాలి

తన సంపదను సవ్యంగా ఉపయోగించలేదనే విషయం సికిందర్‌కు మరణించేముందు అవగతమైంది. అప్పుడతను తన మంత్రులను పిలిచి 'సికిందర్ చాలా బుద్ధిహీనుడు' అని చెప్పి తాను చనిపోయాక తన చేతులను తన సమాధినుండి బయటకు పెట్టి ఉంచమని కోరాడు. ఎందుకంటే ప్రజలకు సికిందర్ ఖాళీ చేతులతో వెళ్ళిపోయాడు అని అర్థమౌతుంది. ప్రియమిత్రులారా! మనం ఖాళీ చేతులతో వచ్చి ఖాళీ చేతులతోనే వెళ్ళిపోతాము. మంచి, చెడు అనే మూటలే మన తలపై మోసుకువెళ్ళగలము. మనల్ని ఎవరు కళంకితులు గానో, కీర్తివంతులుగానో తయారుచేయరు. మనల్ని మనమే తయారుచేసుకుంటాము. అంతకుమించి మనమేమీ చేయలేము. మృత్యువనేది గుర్తుంటే మనమేం చేయాలి, ఏం చేయకూడదు అనేది మనకు తెలుస్తుంది. పరీక్షిత్ మహారాజు జీవితంలో ఇటువంటి పరీక్ష ఎదురైంది. తక్షకుడనే నాగుపాము కాటుతో వారం రోజుల్లోగా మరణిస్తాడని తెలిసిన సమయంలో ఆయన ఏడవలేదు, అరవలేదు. ఈ ఏడు రోజులు ఎలా సద్వినియోగం చేసుకోవాలనేది ఆలోచించాడు. సోమ, మంగళ, బుధ, గురు, శుక్ర, శని, ఆదివారం తరువాత మరో వారం లేదు. పరీక్షిత్ మహారాజు శాపం ఈ ఏడు రోజుల్లోనే ఇవ్వబడింది. అలాగే మీ అందరికి ఈ ఏడు రోజుల్లోపే పాముకాటు వేస్తుంది. కనుక మంచి మనిషి వలె జీవితాన్ని గడపండి. హుందాగా, నిజాయితీతో, పరోపకారంతో, మీ జీవితాన్ని గడపండి.

## భస్మధారణ సిద్ధాంతము

మిత్రులారా, మనిషివలె మనకు జీవించడం రాదు. అది కనుక తెలిస్తే భస్మధారణ చేయాలనే విషయం మనకు తెలుస్తుంది. మన మనస్సు ఎంతగా మాలిన్యాలతో నిండిపోయిందంటే మృత్యువును గురించి రోజు మర్చిపోతున్నాము. శంకరుని పూజించాక హవనం చేసి ఆ భస్మాన్ని నుదుటిపై ధరిస్తాము. భస్మధారణయందు శరీరం ఏదో ఒక రోజు భస్మం అవుతుందనే భావన ఉన్నది. మట్టి, దుమ్ము కలిసి గాల్లో ఎగురుతాయి. ఏ శరీరాన్ని చూసుకొని ఈనాడు మనం అహంకరిస్తున్నామో అదే శరీరం గాల్లో దుమ్ము, ధూళిగా మారి పైకి ఎగురుతుందనే ఆలోచనే రాదు. మనం ఏదో లక్షలాది, కోట్లాది సంవత్సరాలు జీవించాలనుకుంటాం. ఏడు తరాల వరకు మన సంపదంతా మనకే ఉంటుంది, మనం తిన్నది, కట్టింది మనదే అవుతుందని అనుకుంటాం. పరలోకం గురించి, మంచి పనుల గురించి మనకెందుకు? అని నిర్లక్ష్యంగా ఉంటాము. మన జీవితలక్ష్యం, భగవంతుని సూచనలు మనకు అర్థం కావు. ఆయన కనుసన్నలలోనే మనం నడుస్తున్నామనే విషయం మనకు గుర్తుండదు.

## భగవంతుడేమైనా నౌకరా?

స్నేహితులారా, భగవంతుని కనుసన్నలలో జీవించేందుకు మనం సిద్ధపడి ఉండం. మనమే బాస్‌లమని, భగవంతుడే మనకు నౌకరని అనుకుంటాము. భగవంతుడా! మాకు పిల్లలు లేరు పిల్లలను ఇవ్వు అనగానే భగవంతుడు సరేనని తలూపి పిల్లలను ఇచ్చేయాలి. మనం సరే స్వామీ వచ్చావా, నీకు నైవేద్యమిస్తానని చెప్పిన ప్రసాదం ఇదుగో అని ఆయన ముందు పళ్ళెం పెడతాం. ఇది కాకపోతే కోర్టుకేసులు, సమస్య ఏదైనా మనం చేసేది ఇంతే. మీరిచ్చే మిఠాయిలు తిని పని చేసేందుకు ఆయనేమైనా మీ సేవకుడా? యజమాని ఆయనా, మీరా? ఆయనకాదు కదా! మీరే యజమాని, ఆయనే నౌకరు, ఎందుకంటే మీరు ఆయనకు మిఠాయి తినిపించారు కదా! ఆ మూల్యం మరి మీరు ఆయననుండే వసూలు చేసుకోవాలి కదా! మిఠాయి ఊరికే రాదని, ముక్కుపిండి మొత్తం వసూలు చేస్తామని భగవంతునితో చెప్పండి. అప్పుడు భగవంతుడు అవునురా ఈ మిఠాయి చాలా బాగుంది, ఇంతకంటే మంచి ప్రసాదం ఎక్కడా తినలేదు అనాలి. మరి ఈనాటి పరిస్థితి ఇదే.

## శిక్షణను గుర్తు చేసుకోండి

మన ఆధ్యాత్మిక శిక్షణ ఏమిటనే విషయం కూడా మీరు మర్చిపోయారు. కానీ దానివల్లనే మనం జగద్గురువులమని, శాసకులమని పిలువబడతాము. ఒకప్పుడు సప్తఋషుల ద్వారా సప్తద్వీపాలు పరిపాలింపబడ్డాయి. ఎందుకంటే మన ఆలోచనా విధానం, పనిచేసేవిధానం అంత ఉన్నతమైనది. మనమిచ్చే సలహాలు చాలా గొప్పగా ఉంటాయి. అటువంటి మనం ఈనాడు అంత నీచమైన, అల్పమైన జీవితాన్ని గడుపుతున్నాము. అలా మనమే తయారుచేసుకున్నాము. పూజలు, పారాయణల ద్వారా జీవితలక్ష్యం ఏదో విధంగా పూర్తిచేయాలనుకుంటున్నాము కానీ అది చాలా తప్పు.

## స్మశానమందలి కపాలమాల

శంకరభగవానుడు స్మశానంలో నివసిస్తాడు. జీవితం మృత్యువునుండే లభించిందని చెప్తాడు. ఈనాడు మనం చనిపోతే

**కష్టాలు మనిషిని రాటుతేలుస్తాయి**

రేపు పుట్టక తప్పదుకదా! స్మశానము, ఇల్లు రెండూ ఒకటిగా ఉండాలి. రెండూ ఒకటేనని అర్థం చేసుకోవాలి. ఈనాటి ఇల్లే రాబోయే రోజుల్లో స్మశానమౌతుంది. ఈనాటి పుట్టుకే రేపటి మృత్యువు. ఇవి రెండూ చీకటివెలుగుల వంటి ఆటలే. అటువంటప్పుడు చావుకు భయపడడం ఎందుకు? మృత్యువుకు ఎందుకు సిద్ధపడకూడదు? శంకర భగవానుడు శరీరానికి పూసుకునే భస్మం మనకిదే నేర్పుతుంది.

ఆయన మెడలోని కపాలమాల మనకేం నేర్పుతుంది? మన ముఖాన్ని అద్దంలో ఒకటికి పదిసార్లు చూసుకుంటాము. ఎటు తిరిగినా అద్దం కనిపించేలా ఏర్పాటు చేసుకుంటాము. రకరకాల హెయిర్ షాంపులు, క్రీములు, పౌడర్లు, ఒకచోట పసుపు, పెదాలకు ఎరుపు, కళ్ళక్రింద నీలంరంగు ఇలా అన్నీ ముఖానికి పులుముకుంటారు. వాళ్ళ హడావిడి చూస్తే ఏదో ఒక రంగు రంగుల బొమ్మ వేస్తున్నట్లు ఉంటుంది. వారికి ఆ ధ్యాసే తప్ప ఈ శరీరం ఎముకలతో తయారైన ఒక అస్థిపంజరం అని గుర్తురాదు. దాన్ని శరీరం నుండి బైటకు తీసి చూస్తే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. ఈ బొమ్మలాటలో పడి భారతీయసంస్కృతి యొక్క మూల తత్వమును మరచిపోయాము. ఒకసారి శివాజీ ఎదుట ఒక యువతి తీసుకురాబడింది. ఆమెను చూసిన ఆయన నువ్వు మా అమ్మవై ఉంటే నేను కూడా నీలాగే అందంగా ఉండేవాడిని కదా! అని చెప్పి ఆమెను ఉచిత మర్యాదలతో ఎక్కడనుండి తీసుకు వచ్చారో అక్కడే దింపిరమ్మని పంపించాడు.

## అర్జునుని వంటి జీవితమును గడపండి

అర్జునుడు స్వర్గలోకానికి వెళ్ళినప్పుడు అప్సరసలెందరో ఆయన ముందుకు వచ్చి నిలబడ్డారు. వారంతా ఆయనను వరించి ఆయన ద్వారా ఒక బిడ్డను పొందాలని ఉందనే కోరికను వెలిబుచ్చారు. అప్పుడు అర్జునుడు 'అమ్మా మీకు నా వల్ల కలిగే సంతానం చేతకానివారైతే ఏం చేస్తాం? ఇప్పుడు నాకు 32 సంవత్సరాలు. ఒకవేళ పుట్టినా అతను నాఅంతటివాడు కావాలంటే 32 సంవత్సరాలు మీరు ఎదురుచూడాలి. అందుచేత నేను మీ బిడ్డగా ఉంటాను. మీరు తల్లి నేను బిడ్డ. బిడ్డ కావాలన్నావు కదా? నేను సిద్ధంగా ఉన్నాను బిడ్డగా ఉండేందుకు. నేను మీకు తయారైఉన్న బిడ్డను.

## దేహము యొక్క ఆకర్షణ

ఈనాడు మన కళ్ళముందు ఎముకల గూడుపై కప్పిన చర్మానికిపైన రకరకాల రంగులు వేయబడి ఉన్నాయి. ఈ బయట ఉన్న వ్యక్తిని మనం చూడగలం. లోపలివ్యక్తిని చూడలేము. ఎముకల గూడుపై కప్పబడి ఉన్న ఈ సుందరమైన చర్మమును మాటిమాటికి అద్దంలో చూసుకోవాలి. దీనికి ఫొటో తీయించు కోవాలనే తహతహ కూడా మనకుంటుంది. అంతేకాదు ఎవరిదో ఫొటో తీసుకొచ్చి మీ ఇంటి గోడకి అలంకరిస్తారు. అతను మీకు ఏ విధంగాను సంబంధీకుడు కాదు. అయినప్పటికి ఆ వ్యక్తి సినిమా హీరో కనుక, చాలా అందంగా ఉంటాడు కనుక మాకు చాలా ఇష్టం అని చెప్తారు. కానీ ఆ చర్మం క్రింద కూడా ఎముకలే ఉంటాయి. శంకరభగవానుని మెడలోని కపాలమాల మనకు ఈ శిక్షణనిస్తుంది.

## శిక్షణయే చాలా ముఖ్యమని గుర్తుంచుకోండి

శంకరభగవానుని చరణముల వద్ద కావచ్చు, దైవీదేవతల వద్ద కావచ్చు లేదా ఏ భగవంతుని రూపమునందైనా ఎన్నో రకాల శిక్షణలున్నాయి. పూర్వం అందరు భగవానుని పాదాల వద్దకు వెళ్ళేవారు. ఇప్పుడు అందరు దేవతలను పూజిస్తారు, నమస్కరిస్తారు, ప్రదక్షిణలు చేస్తారు. కానీ దేవతలతో పాటు మానవులను కూడా దేవతలుగా మార్చే శిక్షణ కూడా అందులోనే ఉన్నది. అది కూడా మనం నేర్చుకోవాలి. ఆ తత్వము మనకు తెలుసు. మన కథలయందు ఇవే ఉపదేశాలున్నాయి. కీర్తనల యందు, ప్రవచనాలయందు కూడా ఇవే నేర్పించబడ్డాయి. కానీ కేవలం ప్రతీకలుగా ఉండిపోయాయి, లోపల ఉన్న శరీరాన్ని మర్చిపోయాము.

## దేవభూమి వారసులైన భారత ప్రజల నుండి మేము కోరుకునేది

మిత్రులారా! ఈ విధంగా పౌరాణిక కథలలో దైవీదేవతలకు సంబంధించిన విశేషమైన సందేశాలున్నాయి. మనం వాటిని అర్థం చేసుకునేందుకు ప్రయత్నిద్దాము. వారినే 33 కోట్ల దేవతలుగా చెప్తాము. అప్పట్లో భారతదేశంలో 33 కోట్ల మంది మనుషులు ఉండేవారు. ప్రపంచం వారిని మనుషులని కాక దేవతలని పిలిచారు. ఎందుకంటే వారి ఆలోచనలు, కర్మలు చాలా ఉన్నతంగా ఉంటాయి. ఎవరు ఉన్నత కర్మలు, ఆలోచనలు చేస్తారో వారు దేవతలనే పిలువబడతారు. మీరున్న ఈ భరతభూమి దేవతల భూమి. అది అలాగే ఉండాలి. మీరు ఇక్కడికి దేవతలవలె రావాలి. దేవత ఎక్కడికెళ్ళినా అక్కడ శాంతి, సౌందర్యము, ప్రేమ, సంపదను ఇస్తుంది. అలాగే మీరు ఎక్కడి కెళ్ళినా కూడా ఇలానే చేయాలి. మీరంతా నా మాటలు విన్నందుకు చాలా కృతజ్ఞతలు.

*– అఖండజ్యోతి, ఫిబ్రవరి 2012*

*అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*

**ప్రతిభకు పదునుపెట్టండి**

నా వారితో నా మాట

# సృజన సైనికుల కనీస కర్తవ్యము

### ఈ యుగమందలి ఆసురీతత్వము - అజ్ఞానము

ఆసురీతత్వమునకు వ్యతిరేకంగా యుద్ధం చేసేందుకు సిద్ధపడాలంటే అందుకు విజయదశమి గొప్ప శుభముహూర్తం. అసురతను గురించి, ఆసురీతత్వమును గురించి చెప్పాల్సివస్తే మనకు పురాణాల్లో తారకాసురుడు, వృత్రాసురుడు, శుంభుడు, నిశుంభుడు, హిరణ్యకశ్యపుడు, రావణుడు, కంసుడువంటివారు లెక్కలేనంతమంది మనసులో మెదలుతారు. వారు చేసిన అకృత్యాలకు లెక్కలేదు. అవి తలచుకుంటే మనస్సులో తీరని ఆవేదన కలుగుతుంది. ఈనాడు ఈ రాక్షసులందరి యొక్క సామూహిక రాక్షసత్వమును నింపుకున్న మహారాక్షసుడు మనందరికి ఎన్నో ఆపదలను తెచ్చిపెట్టేందుకు సిద్ధంగా ఉన్నాడు ఆ మహారాక్షసుని పేరే అజ్ఞానం. పురాణకాలంనాటి రాక్షసులు కొద్దిమందినే కష్టనష్టాలపాలు చేశారు. కానీ ఈ రాక్షసుడు మాత్రం సంపూర్ణ మానవజాతిని చప్పరించి మ్రింగేస్తున్నాడు.

సకలసౌకర్యాలతో సుసంపన్నమైన ఈ పృథ్వీగ్రహవాసులు స్వర్గతుల్యమైన సుఖశాంతులను హాయిగా అనుభవించవచ్చు. కానీ అంతా వ్యతిరేకంగా జరుగుతున్నది. అందరు ఎవరికివారే మేం నరకాన్ని అనుభవిస్తున్నాం అని చెప్తున్నారు. అందరు ఎవరికివారే తల్లడిల్లుతు, నిప్పులపై నడిచేందుకు వివశులౌతున్నారు. ఈనాటి మానవుని జీవితము కష్టాలు, వ్యధలతో నిండిన కరుణాభరితమైన కథగా మిగిలిపోతున్నది. జీవితాన్ని ఈశ్వరుని వరదానంగా, దేవతలకు కూడా దుర్లభమైనదిగా భావించి జీవించాలి. కానీ అంతా దీనికి వ్యతిరేకంగానే జరుగుతున్నది. అందరు దాదాపు వారివారి తరహాలో నరక సదృశమైన జీవితమును గడిపేందుకు బలవంతంగానే సిద్ధపడుతున్నారు. వారు సాధనాలు, సౌకర్యాల లేమివల్ల అలా చేయడం లేదు. కేవలం అజ్ఞానం వల్ల ఏర్పడిన దోషభూయిష్టమైన ఆలోచనా విధానము వారి మతులను భ్రమింప చేసి వారి జీవితపు దిశనే మార్చివేసింది.

అజ్ఞానమనే అసురుడు ధనబలాన్ని, విద్యాబలాన్ని, బుద్ధి బలాన్ని అన్నింటిని తన ప్రబల మాయాశక్తి ద్వారా భ్రమింప చేశాడు. ధనబలమున్నవారు ఐశ్వర్యమును ప్రదర్శించుకోవడము నందు, భోగవిలాసములయందు చిక్కుకుపోయి ఉన్నారు. విద్యా బల సంపన్నులేమో గర్వము, అహంకారముల చివరిహద్దును తాకారు. బుద్ధిబల సంపన్నులేమో తమ బుద్ధిని మోసపూరితమైన కుట్రలు చేసే పనులకు ఉపయోగిస్తున్నారు. దీని అర్థము ధనము, విద్య, బుద్ధిబలములను తప్పుపట్టాలని కాదు. నిజానికి తప్పంతా అజ్ఞానమనే ఆసురీశక్తిది. దానివల్లనే ఎన్నో విభూతులతో సుసంపన్నంగా విరాజిల్లవలసిన వీరందరి దృష్టికోణము (ఆలోచనావిధానము), మతి భ్రమించిపోయాయి. ధనము, బుద్ధి, విద్యా సంపదలనేవి ప్రశంసించవలసిన, ఉపయోగ కరమైనవి అయినప్పటికి వీటిని ఉపయోగించుకోవాలి అంటే వివేకం కావాలి.

విద్యుత్, ఆవిరి, గ్యాస్, పెట్రోలు, అణుశక్తి అనే శక్తులన్నీ నిస్సందేహంగా ఉపయోగపడతాయి. వీటిని వాడుకోగలగడమనేది అభినందించదగిన విషయమే. కానీ వీటిలో ఏది దురుపయోగ మైనా పరిణామాలు చాలా భయంకరంగా ఉంటాయనేది కూడా తెలుసుకోవాలి. అజ్ఞానమనే అసురుడు ఈ విభూతులను కలిగి ఉన్నవారికి ఇటువంటి భయంకరమైన పరిస్థితినే కల్పించాడు. ధనవంతులు ధనాన్ని, విద్యావంతులు విద్యను, బుద్ధిశక్తిగలవారు బుద్ధిని దుర్వినియోగం చేస్తున్నారు. అంతటితో ఆగకుండా అందరు శరీరబలాన్ని కూడా కలిపేసుకొని ఎన్నో అకృత్యాలకు, అనాచారాలకు పాల్పడుతున్నారు. అపరాధులు, అనాచారులు అందరు కలిసిపోతే ఏర్పడే పరిణామాలు చాలాఘోరంగా ఉంటాయి. ఎందుకంటే ధనము, విద్య, బుద్ధితో కలిసిన మంచి ఆరోగ్యమున్న వ్యక్తులు ఇటువంటి దుర్మార్గాలకు జన్మనిచ్చి, పోషణభారం కూడా వహిస్తారు.

ప్రపంచంలో సాధనాలకు లోటు లేదు. అమెరికా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా వంటి దేశాలన్నింటిలో ఎంతో భూమి వృధాగా పడి ఉన్నది, దానిని చక్కగా సదుపయోగం చేసుకుంటే భారత్, చైనాలకుండే అధిక జనాభా అనే సమస్య పరిష్కారమైపోతుందికదా! ప్రపంచంలో ఉన్న ధనాన్నంతటిని అందరు కలిసి పంచుకొని అనుభవించగలిగితే ఆర్థికసమస్య అనేదే లేకుండా పోతుంది. విధ్వంసకర ఆయుధాలను తయారు చేసేందుకు సిద్ధమైన వైజ్ఞానికులు తమ విజ్ఞానాన్ని సృజనాత్మక కార్యక్రమాలకు వినియోగించినట్లయితే జటిలమైన సమస్య లెన్నెన్నో సహజంగానే పరిష్కరించబడతాయి. ఈ విధంగా ఒకరినొకరు కూలద్రోసుకునేందుకు, అణిచివేసుకునేందుకు, ఒకరిపై మరొకరు కుట్రలు పన్నుకునేందుకు వాడుకునే బుద్ధిని

**విజయానికి దగ్గర దారులు ఉండవు**

పరస్పరం సహకరించుకునేందుకు చేయూత నిచ్చుకునేందుకు వాడితే పృథ్వి స్వర్గంగా మారడంలో ఎటువంటి జాప్యం జరగదు. కానీ ఇదంతా ఎలా జరుగుతుంది? అజ్ఞానమనే మహారాక్షసుడు అందరిని త్రొక్కిపడేశాడు.

## సమస్యలెన్నో - కారణం ఒక్కటే

మానవుని ఎదుట ఈనాడు ఎన్నో సమస్యలెన్నో ఉన్నాయి. వాటిని కనుక అర్థం చేసుకోలిగితే మనకు సమాధానం కూడా అందులో నుండే లభిస్తుంది. శారీరిక రోగాలు, మానసిక బాధలు, ఆర్థిక సమస్యలు, దుర్మార్గుల దురాక్రమణలు, బాధలు, అనేవి కుటుంబపరమైనవి కావచ్చు, దేశానికి సంబంధించినవి కావచ్చు, అవిద్య, ఎందుకూ పనికిరానితనం, వెనుకబడ్డతనం, బాధలు వంటివి ఎక్కడ కనిపించినా ఆ స్థానంలో అజ్ఞానమనే రాక్షసుని మాయ ప్రయోగింపబడిందని అర్థం చేసుకోవాలి. ఈ దావానలం అవాంఛనీయ చింతన అనే చిన్న నిప్పుకణం నుండి ఆవిర్భస్తుంది. ఇప్పుడిది చాలా విస్తరించింది.

ఎవరైనా తమకుగాని, ఇంటికిగాని, కుటుంబానికిగాని, సమాజానికిగాని, విశ్వమానవులకుగాని, ప్రాణులకుగాని సేవ చేయాలని గట్టిగా నిర్ణయించుకోవాలనుకుంటే ముందుగా అజ్ఞానమనే మహారాక్షసుని తప్పించుకునే ఉపాయాలను సిద్ధం చేసుకొని పెట్టుకోవాలి. పౌరాణికకాలంలో ఆసురీశక్తులన్నీ ఒక స్థానం వరకే పరిమితమై ఉండేవి. అందువల్ల వారిని సునాయాసంగా నిర్మూలించేందుకు వీలుగా ఉండేది. కానీ ఇప్పుడు అంతా మారిపోయింది. అజ్ఞానమనే రాక్షసుడు ప్రతి వ్యక్తి యొక్క కోరికలను, బుద్ధిని, పనులను పూర్తిగా ఆక్రమించేశాడు. ఈ మహాదైత్యుడు సర్వవ్యాపకుడు. వీడికి విరుద్ధంగా యుద్ధం చేయడం కొంచెం కష్టమైన పనే కానీ అసంభవం మాత్రం కాదు. ఈ మహాసమరానికి కొందరే సిద్ధపడి ఉండవచ్చు, అయినప్పటికి ధర్మయుద్ధంలో తలపడక తప్పదు. గాండీవానికి, గదకు ఇప్పుడు విశ్రాంతినిచ్చేందుకు అనుమతిలేదు. ఒంటరి వాడైనప్పటికి పరశురాముడు గొడ్డలిని ప్రయోగించక తప్పలేదు.

మహాపరివర్తన జరుగుతున్న సమయంలో మహాకాలుడు తన సహయోగులను, సేనానులను తిరిగి పిలుస్తున్నాడు. ఇంత ముఖ్యమైన ఈ బ్రహ్మముహూర్త సమయంలో మనమంతా ఏమీ చేతకాని వారివలె, ఎందుకు పనికిరానివలె చీకట్లో ఖచ్చితంగా పడుండము. మనమంతా ఆ తల్లి మహిషాసురమర్దిని యొక్క పిల్లలము. పరమశూరవీరుడైన, ధర్మయోధుడైన మర్యాదా పురుషోత్తముడైన శ్రీరాముడు, యోగీశ్వరుడైన శ్రీకృష్ణుడు, యుగఋషి అయిన శ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల పిల్లలము. మహాశూరులైన వీరుల వంశస్థులమై ఉండి పిరికివారివలె పడి ఉండుట మనకు శోభించదు. ఇక ఇప్పుడు మనలో ప్రతి ఒక్కరు విజయదశమి విజయయాత్ర చేసేందుకు ముందుకు సాగాలి.

ప్రాణప్రియులైన మా పరిజనులందరు ప్రాథమిక పరీక్షలన్నింటిలో ఉత్తీర్ణులైనారు. ప్రజలు నిర్మాణాత్మక కార్యక్రమాన్నింటికి ఇచ్చిన ఆహ్వానమును ప్రతి పరిజనుడు స్వీకరించాడు. అందరూ కొద్దో, గొప్పో పనిచేస్తూనే ఉన్నారు. ఇక ఇప్పుడు ఇంకా ముందుకు వెళ్ళవలసిన అవసరం ఉంది. శ్రీరాముని సేన కబంధుడిని, ఖరదూషణాదులను, త్రిశరుడిని, విరాధుడు మొదలైన రాక్షసులను వధించుకుంటూ పంచవటి నుండి రామేశ్వరం వరకు వచ్చారు. ఇక ఇప్పుడు మహేశ్వరుని ఆశీర్వాదం తీసుకొని సేతునిర్మాణానికి సిద్ధం కావాలి. కోతులు, ఎలుగుబంట్లు ఇక తమ పరాక్రమమును చూపించాలి. ఈనాడు మననమున్నది పరమ దుష్టులైన లంకలోని అసురుల సైన్యముతో ఉన్నటువంటి ప్రాంతము. ఇక్కడ హరహరమహాదేవ, జై శ్రీరామ్ అనే నినాదాలు చేస్తూ ఆక్రమణ చేయాలి. సంస్కృతి అనే సీతను అపహరించిన కపట రావణుని ఏదైనా చేసేందుకు మనలో ఎవరికైనా అవకాశం వచ్చి ఉంటే ఏం చేసేవారమో?

## బలిదానవీరులారా లేవండి!

ఇప్పుడు మనం పిరికివారివలె మన సుఖసౌకర్యాల వెనుక దాగి ఉండవచ్చు లేదా 'హతో వా ప్రాప్ససి స్వర్గమ్ జిత్వా వా మోక్షయ సే మహీమ్' (విజయమో, వీరస్వర్గమో) విజయవాక్యాన్ని పఠించుకుంటూ మహాయుద్ధంలో భాగస్వాములం కావచ్చు. ఇక ఇప్పుడు యుద్ధం చేయడమా లేక చావడమా? (Do or Die) అన్న మీమాంసే తప్ప మరేదీ లేదు. రావణాసురుడు, కంసుడి కాలంలో సాధనా సంపత్తి కలిగిన, యోధానుయోధులైన రాజులు ఉండే వారు. వారు కావాలంటే కలిసి మెలసి రాక్షసులకు వ్యతిరేకంగా యుద్ధం చేయవచ్చు. కానీ అలా జరగలేదు. ధనవంతులు, బుద్ధివంతులు, బలవంతులు అందరు కూర్చున్నారు. గజనీ మొహమ్మద్, గోరీ మొహమ్మద్ ఆక్రమణలు చేసినప్పుడు శస్త్రాస్త్రధారులైన సామంతరాజులెందరో ఉండేవారు. వారంతా తలుచుకొని ఉంటే అందరు కలిసి ఆక్రమణదారులను త్రిప్పికొట్టి తరిమేయవచ్చు. కానీ అలా జరగలేదు.

మహాత్మాగాంధీగారి సమయంలో కూడా 600 మంది కంటే ఎక్కువమంది రాజులు, మహరాజులు ఉన్నారు. కానీ వారంతా తమ సాహసాన్ని కోల్పోయారు. దేశము, ధర్మము, సంస్కృతి కొరకు త్యాగము, బలిదానము ఇవ్వాలనే కోరికను తీర్చుకో గలిగేంతటి తేజస్సు వారిలో లేదు. అందుచేతనే సమర్థులున్నప్పటికి

**విజయానికి శ్రమించడమొక్కటే మార్గం**

రావణాసురుని ఎదిరించేందుకు ఎలుగుబంట్లు, వానరులు రంగంలోకి దిగవలసివచ్చింది. పరాధీనయుగంలో కూడా యుద్ధం చేసేందుకు హింసను వ్యతిరేకించే సత్యాగ్రహులే ముందుకు వచ్చారు. ఆ స్థితి ఈనాటికి అలాగే ఉన్నది. మంచి యోగ్యత ఉండి, సమర్థులైనవారికి కొదవేమీలేదు. వారు తలచుకుంటే అజ్ఞానమనే మహాదైత్యునితో యుద్ధం చేసి గెలిచేందుకు తమ సాధనాసంపత్తిని ఇవ్వగలరు. కానీ అలా జరగడం లేదు.

## సృజన సైనికుల నుండి మేం కోరుకునేది

సాధనాసంపత్తి ఉంటే ఏమిటి? సమర్థత ఉంటే ఏమిటి? వారి హృదయంలో లోభమనే నీచభావన ఉంటే ఏం చేస్తాం? వారి శరీరాలకి కూడబెట్టడం, అనుభవించడం మాత్రమే తెలుసు. అల్పస్థాయికి చెందిన వారి చేతనత్వమునకు ఆదర్శములు పాటించడమనేది అసంభవమైన పని. మానవ జీవితాన్ని ఎవరైతే భోగవిలాసమయంగా తయారుచేశారో వారికి త్యాగము, బలిదానము అనే విషయాలను గురించి ఆలోచించడమనేది చాలా భారంగా అనిపిస్తుంది. ఆధ్యాత్మికత అంటే కేవలం జపమాల త్రిప్పడం, పూజా సామాగ్రితో పూజ అనే కర్మకాండ చేయడం అనుకునేవారు వేదాంతమునందలి మహా వాక్యముల గురించి ఎలా ఆలోచించగలరు?

మానవీయగరిమను నిరంతరం నిలబెట్టాలంటే చాలా మూల్యము చెల్లించవలసి ఉంటుంది. అంత మూల్యాన్ని వెనుకబడ్డ వారు, చిన్నవారు ఎలా సమకూర్చగలరు? సామర్థ్యము, సాధనా సంపత్తి కలిగి ఉన్నా ఏం జరుగుతుంది? వీటిన్నింటికంటే మిన్నగా లోభత్వమనేది వారి వ్యక్తిత్వమును కప్పేసింది కదా! కనుక వారికి అంతటి మహాసాహసము చేయాలనే కోరిక కూడా కలగదు. మహామానవుల సరసన నిలబడగలిగి, మానవీయ గౌరవమునకు ప్రతిష్ట అందించగలిగేవారే ఇంతటి ప్రచండ పరాక్రమమును చూపించగలరు.

అఖండజ్యోతి పాఠకులు (యుగశక్తిగాయత్రి పాఠకులు), ప్రాణప్రియులైన మా గాయత్రీపరివార్ పరిజనులే ఇదంతా చేయాలి. ఎలుగుబంట్లు, వానరులమైన మనమే కలిసి ఈ సేతు నిర్మాణం తిరిగిచేయాలి. గోవర్ధన పర్వతాన్ని ఎత్తేందుకు గోపబాలురు తమ కర్రలతో సహా నిలబడ్డారు. సముద్రముపై వంతెన నిర్మించేపని చేయాలని ఉడత తన శరీరంతో ఇసుకను తీసుకొని అంతటి విశాలమైన సముద్రపు విశాల జలరాశిలో చల్లడం మొదలుపెట్టింది. వీటి సామర్థ్యము గురించి చెప్తే అప్పట్లో అందరు నవ్వుకున్నారు. కానీ భగవంతుడు మాత్రం వారిని అప్పుడు అభినందించాడు, ఇప్పుడు మనం అటువంటి పనిచేస్తే అభినందించేందుకు సిద్ధంగా ఉన్నాడు.

అందుచేత మనం గర్వంగా, గౌరవంగా ఇప్పుడు కూడా ఏదో ఒకటి చేసి చూపించాలి. అందుకు మన వద్ద ఉన్నదాని నంతటిని యుగదేవత యొక్క చరణములకు అర్పించేయాలి. ఇంతకంటే తక్కువ చేస్తే అజ్ఞానమనే రాక్షసుని చంపేందుకు వీలుకాదు. దధీచి అస్థికలతో తయారైన వజ్రాయుధంతోనే వృత్రాసురవధ జరిగింది. ఆ సమయంలో మహాతేజోవంతుడైన ఆ ఋషి లోభత్వం చూపించలేదు. మనకు చిన్న సూది గ్రుచ్చుకుంటేనే చెప్పలేని వేదన కలుగుతుంది. మరి అస్థికలను దానం చేయాలంటే కలిగే సహింపలేని బాధను అనుభవించేందుకు కూడా ఆయన వెనుకాడలేదు. ఇంతకంటే తక్కువ కార్యసాధనతో రాక్షసత్వమును నిర్మూలించడం కుదరదు. కానీ ఎప్పుడు ఆ ధర్మయోధులు తమను తాము సంపూర్ణంగా త్యాగము, బలిదానము చేసుకునేందుకు సిద్ధమౌతారో అప్పుడే ధర్మయుద్ధంలో పాపాన్ని నశింపచేయడం జరుగుతుంది.

ఈనాడు కూడా ఆ చరిత్రే పునరావృత్తం కావడం మినహా మరోమార్గం లేదు. ఇది మనందరికి పరీక్షా సమయం. అజ్ఞానమనే మహాదైత్యుని సంహరించి విజయయాత్రను మొదలు పెట్టేందుకు మనకు ప్రచారసాధనాల అవసరం చాలా ఉన్నది. జనశక్తి, బుద్ధిశక్తి, ధనశక్తిని ఎంత సమకూర్చుకున్నా అది తక్కువే అవుతుంది. బయటి వ్యక్తులు ఒకరినొకరు అణిచివేసుకోవాలనే తాపత్రయంలో కూరుకుపోయి ఉన్నారు. అఖండజ్యోతి (యుగశక్తి గాయత్రి) పాఠకులు మరియు గాయత్రీపరివార్ పరిజనులు ఈనాడు సమయం ఇస్తున్న ఈ పిలుపును అందుకొని పని పూర్తి చేయగలరు. వారు ఇక మౌనంగా కూర్చోవడానికి వీలులేదు. విజయదశమి అనే శుభపర్వదినాన వారు తమ విజయయాత్రను ప్రారంభం చేయాలి. ఈ ప్రయత్నంలో మనల్ని మనం కోల్పోవలసి వచ్చినా వెనకడుగు వేయకుండా ముందుకు సాగాలి.

*– అఖండజ్యోతి, అక్టోబర్ 2012*
*అనువాదం : శ్రీమతి వల్లీశ్రీనివాస్*

## బ్రాహ్మణత్వం

*యక్ష యుధిష్ఠిర సంవాదంలో యక్షుడు ధర్మరాజుని బ్రాహ్మణత్వం అనేది దేనివల్ల సిద్ధిస్తుంది? అని ప్రశ్నిస్తాడు. బ్రాహ్మణత్వం అనేది కులం వల్ల గాని, శాస్త్రాధ్యయనం వల్ల గాని, స్వాధ్యాయసత్సంగాల వల్లగాని లభించేది కాదు. సదాచార సంపన్నుడైన వ్యక్తి ఆత్మబోధ ద్వారా అజ్ఞానాన్ని దూరం చేసికొని బ్రాహ్మణత్వం అంటే ద్విజత్వం పొందుతాడు అని ధర్మరాజు బదులుపలుకుతాడు. – ప్రజ్ఞాపురాణం నుండి*

**ఆనందం పంచుకుంటే పెరుగుతుంది**



ఆరోగ్యమే మహాభాగ్యం - 24

# హోమియో వైద్య సేవ

## ఆస్తమా-కారణాలు-నిర్ధారణ-హోమియో వైద్యం

వర్షాకాలం ప్రారంభమవుతోందంటే చాలు ఆస్తమా రోగులు వణికిపోతుంటారు. కాస్త చల్లగాలి తగిలినా చాలు శ్వాసలో ఇబ్బంది తలెత్తుతుంది. వాతావరణంలో చిన్నపాటి మార్పులను కూడా వారు తట్టుకోలేరు. ఆహారంలో మార్పులు, కాలుష్యం, పొగతాగడం వంటివి సమస్యను మరింత జటిలం చేస్తుంటాయి. చిన్న పిల్లలు సైతం ఆస్తమా బారిన పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అయితే తగిన జాగ్రత్తలు తీసుకుంటూ మందులు వాడటం ఒక్కటే దీనికి పరిష్కారము.

దీర్ఘకాలిక శ్వాసకోశ ఇబ్బందినే ఆస్తమా అంటారు. ఆస్తమా వ్యాధిగ్రస్తులలో అలర్జీ రియాక్షన్ ద్వారా ఊపిరితిత్తులలో గాలిమార్గానికి అడ్డంకులు ఏర్పడి శ్వాసపీల్చుకోవడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. దీనివల్ల పిల్లికూతలు, దగ్గు, ఆయాసం, ఛాతీలో నొప్పి తదితర లక్షణాలు కనిపిస్తుంటాయి. శ్వాసకోశమార్గంలో వాపు, శ్వాసకోశ మార్గం కుచించుకుపోవడం వల్ల ఆస్తమా వస్తుంది.

**కారణాలు:** చల్లగాలి (చల్లటి వాతావరణం), దుమ్ము, ధూళి, పొగ, అలర్జీ కారకాలు (గడ్డి చెట్లు, ఫంగస్, కాలుష్యం), రసాయనాలు (ఘాటు వాసనలు), శారీరక శ్రమ, వైరల్ ఇన్‌ఫెక్షన్, పెంపుడు జంతువుల విసర్జక పదార్థాలు, శ్వాసకోశాల్లో ఇన్‌ఫెక్షన్స్ వంటివి ఆస్తమాకు కారణమవుతున్నాయి.

**నిర్ధారణ:** వంశానుగత చరిత్ర, అలర్జీ, ఎగ్జిమాకు సంబంధించిన పరీక్షలు, ముక్కు, గొంతు, ఛాతీ పరీక్షలు, కఫం పరీక్ష, ఎక్స్‌రే, చర్మానికి సంబంధించిన అలర్జీ పరీక్షలు. స్పైరోమెట్రీ (శ్వాసమీటర్ ద్వారా పరీక్ష) ద్వారా వ్యాధి నిర్ధారణ చేసుకోవచ్చు. ఆరోగ్యకరమైన అలవాట్లు, వ్యాయామం, పోషకాహారం తీసుకున్నట్లయితే ఆస్తమా బాధించదు. రాత్రివేళ, ఉదయం సమయాల్లో శ్వాసకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలి. ఎక్కువ శారీరక శ్రమలేకుండా చూసుకోవడం అవసరం. దుమ్ము, ధూళి, పొగ, చల్లటి వాతావరణానికి దూరంగా ఉండాలి. ఇంటి పరిసరాలు, ప్లాస్టిక్ బ్యాగ్స్, కార్పెట్స్, బెడ్‌షీట్స్, బ్లాంకెట్స్‌లలో డస్ట్‌మైట్స్ (చిన్న పరాన్న జీవులు) ఉంటాయి. కాబట్టి పదిరోజులకొకసారి ఎండలో వేయడం, శుభ్రంగా ఉతుక్కోవడం చేయాలి. పెంపుడు జంతువులకు దూరంగా ఉండాలి. తేమ ఎక్కువగా ఉంటే డస్ట్‌మైట్స్ పెరుగుదల ఎక్కువగా ఉంటుంది. కాబట్టి తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ముఖానికి చేతిరుమాలు కట్టుకోవడం చేయాలి.

**హోమియోవైద్యం :** ఆస్తమాకు హోమియోలో చక్కటి వైద్యం అందుబాటులో ఉంది. ముఖ్యంగా పిల్లల్లో కలిగే అలర్జీలు, శ్వాసకోశ ఇబ్బందులు, శారీరక, మానసిక విశ్లేషణ ద్వారా తగిన మందులను ఇచ్చి చికిత్స అందించడం జరుగుతుంది. హోమియోతో ఆస్తమా వ్యాధిని సమూలంగా తగ్గించే వీలుంది. ఆంటిమొనిమ్ ఆర్స్, ఆర్సెనిక్ ఆల్బ్, సాంబుకస్, స్పాంజియా, నేట్రంసల్ఫ్, అరేలియా, కార్బోవెజ్ వంటి మందులు ఆస్తమాకు చక్కగా పనిచేస్తాయి. నివారణ బ్రాంకోడైలేటర్స్, కార్టికోస్టెరాయిడ్స్, యాంటీబయోటిక్స్, నాసిల్ స్ప్రే మందులు వాడితే మంచి ఉపశమనం కలుగుతుంది. కానీ వీటివల్ల భవిష్యత్తులో వ్యాధి తీవ్రమయ్యే అవకాశం ఉంది. వీటిని దీర్ఘకాలికంగా వాడటం వల్ల దుష్ప్రభావాలు కలుగుతాయి. పిల్లల్లో పెరుగుదల ఆగిపోవడంతో పాటు మానసిక ఆందోళన, బరువు పెరగడం, జ్ఞాపకశక్తి లోపించడం వంటి సైడ్ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి వీటికి దూరంగా ఉండటమే మంచిది. ఆస్తమాను మెడిటేషన్, యోగ ద్వారా కూడా చాలా వరకు నివారించవచ్చు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండటం, స్వచ్ఛమైన గాలి, నీరు ఉన్న ప్రదేశాలలో నివసించడం అలవాటు చేసుకోవాలి. కాలుష్యం ఎక్కువగా ఉండే ప్రదేశాలకు దూరంగా ఉంటే మంచిది. ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆస్తమాను అధిగమించవచ్చు.


సలహాల కొరకు సంప్రదించవల్సిన చిరునామా

**డా॥ టి. నీలవేణి,** బి.హెచ్.ఎమ్.ఎస్.
ఆర్.ఎన్.జి. అడ్వాన్స్‌డ్ హోమియో క్లినిక్,
ఇ.నెం. 3-211, యశోద గార్డెన్స్ దగ్గర, శాంతినగర్,
కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500 072.
ఇ-మెయిల్: drneelaveni@gmail.com


*ఈ శీర్షిక హోమియో వైద్య విధానం మీద అవగాహన పెంచుకోవడానికే. దయచేసి స్వంత వైద్యం ప్రయత్నించవద్దని మనవి.*

**విషాదం పంచుకుంటే తగ్గుతుంది**

# సుమతి సూక్తం - 2



బద్దెన కవి ఎంతటి దూరదృష్టి కలిగిన వాడో సుమతి శతకంలోని ప్రతి పద్యం తెలుపుతుంది. ఋణబాధ ఎంత దారుణంగా ఉంటుందో, వయోధర్మాన్ని పాటించకుండా వృద్ధాప్యంలో యవ్వనవతియైన కన్యను వివాహమాడడం, స్వయం సంపాదనతో కాకుండా అప్పుచేసి హోదాను కల్పించుకుని, కీర్తి కండూతితో దానధర్మాలు చేయడం, మూర్ఖంగా తపస్సు చేయడం, దోషుల దోషాలను అరికట్టలేని అసమర్థపాలన మొదలైన విషయాలు, ఎంతటి ప్రమాదాన్ని భవిష్యత్తులో కలిగిస్తాయో వివరించారు ఈ పద్యంలో

***అప్పుగొని చేయు విభవము***
***ముప్పునఁ బ్రాయంపుటాలు మూర్ఖుని తపమున్***
***దప్పరయని నృపురాజ్యము***
***దెప్పరమై మీఁదఁగీడు దెచ్చుర సుమతీ ॥***

ప్రస్తుతం అప్పుచేసి, గొప్పలు చెప్పుకుంటూ, అందరి మెప్పును పొందాలన్న కీర్తి కండూతితో దానాలు (శక్తికి మించిన) చేయడం వల్ల వడ్డీ పెరిగి, చివరికి చాలా భారమై కీడు చేస్తుంది. కాబట్టి అప్పును చేయడం మంచిది కాదు. చేసినా వెంటనే (వీలైనంత త్వరలో) తీర్చే ప్రయత్నం చెయ్యాలి. లేకుంటే చాలా కష్టం. కలియుగదైవం వేంకటేశ్వరుడు ఇప్పటికీ వడ్డీ చెల్లిస్తూ ఉన్నాడన్న కథ ఇందుకు నిదర్శనం. అంతేగాక మన భారతదేశం కూడా ప్రపంచ బ్యాంకు నుండి తీసుకున్న ఋణం తీర్చే యత్నం పాలకులు చెయ్యాలి. లేకుంటే ఆ విదేశీ శక్తులు మనపై మరల ఆధిపత్యాన్ని చెలాయించే ప్రమాదం ఉంది.

అప్పు చేసి పప్పు కూడు వలదు అన్న సామెత యొక్క సారాంశం ఇదే. **"ఋణం కృత్వా ఘృతం పిబేత్"** అన్న ఆర్యోక్తి కూడా అప్పుచేసి నెయ్యితో మృష్టాన్న భోజనం చేయడం వంటిదే.

వివాహం విషయంలో కూడా వావి, వరస చూడాలన్నారు. వయసు కూడా ముఖ్యం. వృద్ధాప్యంలో ఉన్న వరుడు, తనకంటే ఎంతో చిన్నదైన కన్యను వివాహమాడితే అవగాహనలోను, అన్యోన్య దాంపత్యంలోను అంతరం ఏర్పడి ఎన్నో కష్టాలను ఇస్తుంది. సారంగధరుని చరిత్ర, యయాతి కథ వంటి చారిత్రక, పౌరాణిక కథలు ఈ సత్యానికి అద్దం పడుతున్నాయి. కాబట్టి తాత్కాలికంగా ఆనందాన్నిచ్చే ఇటువంటి చర్యలు భవిష్యత్తులో ఎంతో హానిని కల్గిస్తాయి.

***ఆ కొన్న కూడెయమృతము***
***తాకొందకనిచ్చువాడెక దాత ధరిత్రిన్***
***సోకోర్చువాడె మనుజుడు***
***తేకువకలవాడె వంశతిలకుడు సుమతీ ॥***

ఆకలితో ఉన్నప్పుడు భుజిస్తే ఆ ఆహారం అమృతంలా ఉంటుంది. విసుగు విరామం లేకుండా నిండు మనసుతో దానం చేసేవాడే నిజమైన దాత. జీవితంలో ఎదురయ్యే కష్టాలను ఓర్చుకొనే సహనం కలవాడే యదార్థమైన మానవుడు. ధైర్యంతో పోరాట పటిమ కలవాడే వంశోద్ధారకుడు అన్న నిర్వచనం ద్వారా; అన్నం అమృతంలా ఎప్పుడు అన్పిస్తుందంటే ఆకలితో తిన్నప్పుడే అంటే బాగా కష్టపడి, దైనందిక శ్రమకు తట్టుకుని భుజిస్తే అది ఆరోగ్యం, ఆనందం. కాబట్టి ఆకలి వేసేంతవరకు పనిచెయ్యాలి. దానం చేయడంలో విసుగు ఉండరాదు. తృప్తి ఉండాలి. దానాన్ని ధర్మంగా చూడాలే తప్ప, లోకోపకారం చేస్తున్నాననే అహంకారం, కీర్తి కోసం పాకులాడటం వంటివి కూడవు. జీవనయానంలో ఆటుపోట్లను ఎదుర్కొంటూ, ఆత్మస్థైర్యంతో ఉన్నవాడే యదార్థ మానవుడు. ఇలా శ్రామిక ధర్మాన్ని, దాన ధర్మాన్ని, జీవన ధర్మాన్ని, వంశ ధర్మాన్ని వివరించారు బద్దెన పై పద్యంలో

***ఇచ్చునది విద్య, రణమున***
***జొచ్చునదే మగతనంబు, సుకవీశ్వరులున్***
***మెచ్చునదే నేర్పు, వాదుకు***
***వచ్చునదే కీడుసుమ్ము వసుధను సుమతీ ॥***

తాను నేర్చుకున్న విద్యను నలుగురికి పంచాలి. అదే నిజమైన విద్య. అంటే జ్ఞానాన్ని ఇతరులకు ఇచ్చినప్పుడే అది మరింత శోభిల్లుతుంది. యుద్ధ రంగంలో చొచ్చుకుపోయే పరాక్రమమే నిజమైన వీరలక్షణం. వీరుడు వెన్నుచూపరాదు. అదే పరమవీర ధర్మం. పండితులు, సుకవులు మెచ్చేదే నిజమైన ప్రతిభ, ప్రావీణ్యం, కవిత్వాన్ని అందరు ఆనందించే విధంగా ఉండాలి. అవసరమైన వాదన. తగువులాటలకు తావిచ్చే వివాదస్పద వ్యాఖ్యల వల్ల, కీడే తప్ప మేలుచేకూరదు. అందువల్ల వ్యంగ్యాత్మక వ్యాఖ్యలు, రెచ్చగొట్టే ప్రకటనల వల్ల తీవ్రమైన నష్టం లభిస్తుంది. కావున విచక్షణతో, వివేకంతో వచించాలన్నదే సత్యం.

***ఇమ్ముగ జదువనినోరును***
***నమ్మాయని పిలిచి యన్నమడుగని నోరున్***
***తమ్ముల పిలువని నోరును***
***గుమ్మరి మనుద్రవ్వినట్టి గుండర సుమతీ ॥***

**విద్యకు నైపుణ్యం జోడించాలి**

దైవం నోరు ఎందుకు ఇచ్చాడంటే కేవలం అన్నం తినడానికి మాత్రమే కాదు. దాని పరమార్థం వేరు. వల్లె వేయకుండా ఏ విద్య వంటబట్టదు. వల్లె వేయాలంటే నోరు తిరగాలి. నోరు తిరిగి చక్కగా చదివినప్పుడే విద్య, వినయం, వివేకం, విచక్షణ కలుగుతాయి. అందుకు నోరు మిక్కిలి ఆవశ్యకం.

అడగందే అమ్మ అయినా పెట్టదు అన్న సామెత. ఆకలి వేసినప్పుడు నోరు తెరిచి అమ్మా! అన్నం పెట్టవా? అని అడిగితే అమ్మ హృదయం కలిగి, వెంటనే ఆకలి తీరుస్తుంది. అంటే శారీరక ఆకలి తీరాలంటే, అమ్మ ప్రేమను పొందాలంటే నోరారా అమ్మా! అని పిలవాలి. అదే అనుబంధానికి గుర్తు. తమ్ముల పట్ల వాత్సల్యం. అన్నల పట్ల గౌరవం పెంపొందించబడాలంటే, సోదర ప్రేమను వ్యక్తం చేయడానికి, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి ప్రతీక. ప్రథమ సాధనం నోరే. అందుకే నోరు మంచిదైతే, ఊరుమంచిదౌతుందన్న సామెత కూడా ఇక్కడ అన్వయిస్తుంది. చక్కగా మాట్లాడితే అందరు ప్రేమగా స్పందించి, అన్ని సమయాలలో ఆదుకుంటారు. లేకపోతే కుండల తయారు చేయడం కొరకు మెత్తని మన్ను కొరకు త్రవ్విన గొయ్యి, మిగిలిన పనులకు ఎలా ఉపయోగపడదో, అలాగే నోరు కేవలం అన్నం తినడానికి మాత్రమే ఉపయోగపడే అవయవం కాదు అన్న సత్యాన్ని అందంగా తెలియపర్చారు పై పద్యంలో.

మానవ జీవితం సార్థక్యం చెందాలంటే, నాలుగు తరాలపాటు ఆతని పేరు ప్రతిష్టలు నిలబడాలంటే చరితార్థమైన పనులు చెయ్యాలి. లేకపోతే ఎటువంటి పరమార్థం లేని బ్రతుకులవలే వృథాగా ఉంటుందన్న విషయాన్ని ఇలా చెప్పారు ఈ పద్యంలో

*ఉడుముండదె నూఱేండ్లును*
*బడియుండదె పేర్మి బాము పదినూఱేండ్లున్*
*మడుపున గొక్కెరయుండదె*
*కడునిల బురుషార్థ పరుడు కావలె సుమతీ ॥*

ధర్మార్థ కామ మోక్షాలను సాధించే పురుషార్థ పరుడు సమాజంలో చిరకాలం, చిరస్థాయిగా నాలుగు తరాల పాటు ఉంటాడు. శ్రీరాముడు, గీతను బోధించిన శ్రీకృష్ణుడు, శిబి, దధీచి, వివేకానందుడు, అబ్దుల్‌కలామ్ వంటి ఎందరో సంఘ సేవకులు, ఉన్నతస్థాయి వ్యక్తిత్వం కలిగిన వారే నిజమైన పురుష పుంగవులు. మిగిలిన కోట్లాది జీవరాశులు ఎన్ని ఉన్నా, యుగానికొక్కడు, తరానికొక్కడు ఉండాలి. లేకుంటే వంద సంవత్సరాలు జీవించి ఎటువంటి ప్రయోజనం సాధించని రాక్షసబల్లి వంటి ఉడుము, వెయ్యి సంవత్సరాల ఆయువుతో అందరిని కాటువేసే క్రూర సర్పంలా, చెరువులో చేపల కోసం దొంగ జపం చేసే కొంగల వలే నిరర్థకమైన జీవితం గడిపిన వారౌతారు. అందువల్ల పరమార్థం లేని బ్రతుకు పరమనీచమైనదని కవి వాక్కు.

*ఉత్తమ గుణములు నీచున*
*కెత్తెరంగున గలుగనేర్చు? నెయ్యెడుందా*
*నెత్తిచ్చి కరగబోసిన*
*నిత్తడి బంగారమగునె యిలలో సుమతీ ॥*

ఉత్తమ గుణాలు స్వభావరీత్యా, పుట్టుక నుండి మనిషి నరనరాలలో జీర్ణించుకుపోయి ఉంటాయి. అవి తెచ్చిపెట్టుకుంటే వచ్చేవి కావు. ఎంతో బరువైనదని, ఇత్తడిని తెచ్చి, కరిగించి పోతపోసినా అది ఇత్తడి బొమ్మె అవుతుంది కానీ పుత్తడి బొమ్మ కాదు. కనకానికి ఉండే శోభ, కంచుకు ఎలారాదో, ఉత్తముని సహజ గుణాలు, స్వభావము, నీచునకు రాదు. ఎన్ని వాతలు పెట్టుకున్నా, నక్క పులిగా మారి ఆ స్థానం యొక్క యొక్క ఔన్నత్యాన్ని దిగజార్చే ప్రయత్నంలో అందరి నుండి అవమానాన్ని పొందుతాడే తప్ప, గౌరవాన్ని కాదు. కావున ఉత్తమ గుణాలు సహజసిద్ధంగా రావాలే తప్ప, తెచ్చిపెట్టుకుంటే రావు. ఇలా ఎన్నో ధర్మాలను తెల్పిన బద్దెన కవి మనకు నిత్య స్మరణీయుడే.

*- సాధన నరసింహాచార్య*

## చందారులకు / కొనుగోలుదారులకు విజ్ఞప్తి

గాయత్రీ చేతనాకేంద్రం బ్యాంకు ఖాతాను స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎర్రగడ్డ శాఖలో ప్రారంభించటమైనది. నేటినుండి ఆన్‌లైన్‌ద్వారా నగదును పంపదలచినవారు ఈ క్రింది ఖాతా నంబరులో జమచేయవలసినదిగా మనవి.

ఖాతాపేరు: శ్రీ వేదమాతా గాయత్రీ ట్రస్టు

ఖాతానంబరు: 32506416087

IFSC Code : SBIN 0013272

పత్రికకు మరియు సాహిత్య ఖరీదుకు సంబంధించిన నగదును పై ఖాతాలో జమచేసి తెలియపర్చవలసినదిగా మనవి.

అట్లే అంశదానాల క్రింద నగదు పంపదలచినవారు ఈ క్రింది ఖాతాలో జమచేయ మనవి.

ఖాతాపేరు: శ్రీ వేదమాతా గాయత్రీ ట్రస్టు

ఖాతానంబరు: 32506422932

IFSC Code : SBIN 0013272

**గమనిక:** నగదు చెల్లించిన పిదప బ్యాంకు చలానా జిరాక్సు కాపీని చేతనా కేంద్రము చిరునామాకు పంప ప్రార్థన.

**గాయత్రీ చేతనా కేంద్రము**
హెచ్.పి.రోడ్, అశ్వినిహౌస్ దగ్గర, మూసాపేట,
హైదరాబాద్-500018. ఫోన్: 040-23700722

**వినయం వలనే విద్య వికసిస్తుంది**

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## గిద్దలూరులో

గాయత్రీ పరివార్-గిద్దలూరు ప్రకాశంజిల్లా వారిచే 07.09.2011న ప్రారంభించబడిన గాయత్రీ ప్రజ్ఞాపీఠం ప్రథమ వార్షికోత్సవము గిద్దలూరులో 07.09.2012న అత్యంత వైభవంగా నిర్వహించారు. కలశయాత్రలో దాదాపు 1000 మంది పాల్గొన్నారు. 54 కుండముల గాయత్రీ మహాయజ్ఞములో 2000 మంది పాల్గొన్నారు. గాయత్రీ మహాయజ్ఞ సందర్భమున మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు గాయత్రీ మంత్రాన్ని దాని విశిష్టతను వివరించుట జరిగింది. ఈ యజ్ఞ కార్యక్రమంలో గిద్దలూరు శాసనసభ్యులు శ్రీ అన్న రాంబాబు దంపతులు పాల్గొన్నారు. యజ్ఞాన్ని డా॥ శ్రీరామ్ నిర్వహించారు. గిద్దలూరు వాసి గాయత్రీ పరివార్ వ్యవస్థాపకుడైన శ్రీ తురగా అంజని కుమార్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ వారి బృందం యొక్క సారథ్యంలో గాయత్రీ మహాయజ్ఞము చక్కగా నిర్వహింపబడినది. 216 యుగశక్తిగాయత్రి పత్రికలకు చందాదారులను చేర్పించడమైనది. గాయత్రీ చేతనా కేంద్రము శ్రీ అంజనికుమార్‌గారి కృషిని అభినందించుచున్నది.

## విశాఖపట్నంలో

29.09.2012న వందనీయ మాతాభగవతీదేవి శర్మ మహాప్రయాణ సంస్మరణ దినాన్ని పురస్కరించుకొని గాయత్రీ పరివార్ విశాఖపట్నం శాఖవారు సమీప ఆసుపత్రిలో ఉన్న దాదాపు 1200 మంది రోగులకు పౌష్టికాహారాన్ని అందిస్తూ బ్రెడ్ మరియు బిస్కట్లను ఉచితంగా పంపిణి చేశారు. అట్లే సమీపములోని జ్ఞానానంద ఆశ్రమంలో, చెవిటి మరియు మూగ పిల్లల సంరక్షణాలయాలకు వెళ్ళి వారికి కూడా పౌష్టిక ఆహారంక్రింద పండ్లు, బిస్కట్లు, పాఠ్యపుస్తకాలు, వ్రాత పరికరాలను ఉచితంగా అందించారు. పై కార్యక్రమానికి శ్రీ జగదీశ్ అచోపా, నితిన్ గుప్తా, ప్రవీణ్‌భాయ్ పటేల్, సంజయ్‌సింగ్, అరుణ్‌కుమార్, డా॥ ఉమేశ్ శ్రీవాత్సవ్ మున్నగువారు ఆర్థిక సహాయమందించారు. సత్యేంద్రప్రసాద్, చంద్రశేఖర్, జైన్ ప్రాంతీయ మహిళామండలి సభ్యులైన రాజ్యలక్ష్మి, విజయ, పద్మ మున్నగు వారు ఉత్సాహంతో కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమ విజయానికి తోడ్పడిరి. మొత్తం రూ.50,000/-ల విలువగల వస్తువుల వితరణ జరిగింది.

పై కార్యక్రమానికి సూత్రధారులుగా గాయత్రీ పరివార్ సభ్యులైన శ్రీ అవతారంరాజుగారి బృందము ప్రధాన పాత్ర పోషించారు. సమాజ సేవకు శ్రీకారం చుట్టిన విశాఖపట్నం శాఖకు హార్థిక అభినందనలు.

15.10.2012 విశాఖపట్నం యుగశక్తి గాయత్రీ కేంద్రములో శ్రీ ప్రశాంత్ సేథ్ పరివ్రాజక్, శాంతికుంజ్ వారి ఆధ్వర్యంలో సామూహిక తర్పణ, శ్రాద్ధ సంస్కారములు నిర్వహించబడినాయి. తర్పణ, శ్రాద్ధ సంస్కారముల గురించిన వివరణ, ప్రాముఖ్యత వివరించబడ్డాయి. 55 మంది ఈ కార్యక్రమంలో పాలుపంచు కున్నారు. విశేషమేమిటంటే పురుషుల కన్నా స్త్రీలు ఎక్కువగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ అవతారం రాజు, శ్రీమతి రాజరాజేశ్వరి అమ్మ, శ్రీమతి కృష్ణవేణి, శ్రీమతి రాజ్యలక్ష్మి, శ్రీ సత్యన్నారాయణ, శ్రీ బందం నరసింగరావు, శ్రీ అరుణ్ కుమార్, శ్రీ సంజయ్‌సింగ్ తదితరులు ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలందించారు.

## గురుసేవకు చక్కని అవకాశము

మిత్రులారా!

గాయత్రీ సాధన చేయుచూ, సూక్ష్మశరీరధారులైన పరమ పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య మరియు వందనీయ మాతా భగవతీదేవిశర్మల మార్గదర్శనంలో మీ శేష జీవితాన్ని గడుపుచూ, సమాజ సేవలో పునీతులగుటకు చక్కని అవకాశం

**మీకు ఉండవలసిన అర్హతలు :**

• కనీసము 10వ తరగతి వరకు చదివి ఉండాలి • యజ్ఞము, సంస్కారములు చేయగలవారికి ప్రాధాన్యత-తెలియనివారికి శిక్షణనిచ్చెదము. • పూర్తి సమయదాన మివ్వగలిగిన వారికి ప్రాధాన్యత. • కనీసము 3 నుండి 6 నెలలు సమయదానం ఇవ్వగలగాలి. • 50 సంవత్సరముల లోపు వయస్సువారికి ప్రాధాన్యత. • మీ వ్యక్తిగత అవసరాలు తీర్చుకొనుటకు శాంతికుంజ్ పద్ధతిలో నెలవారి నగదు పారితోషికము చెల్లింపబడుతుంది. • భార్యాభర్తలకు ప్రాధాన్యత. • స్త్రీలకు / పురుషులకు విడివిడిగా వసతి కల్పించ బడుతుంది. • పుస్తక శాల నడిపెడివారికి కూడా ప్రాధాన్యత

మీ పూర్తి వివరాలు, చిరునామా మరియు ఫోను నెంబరు తెలుపుతూ మీ దరఖాస్తును గాయత్రీ చేతనా కేంద్రానికి పంపవలసినదిగా కోరడమైనది.

**సంప్రదించవలసిన ఫోన్ నెం: 9949111175**

సద్గుణాలు లేని చదువు నిరుపయోగం